


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




దేవాదాయ భూముల్లో సోలార్ ప్లాంట్లు

03

సంపుటి 07, సంచిక: 329 | బుధవారం | 30-10-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# మూసీపై ముందుకే...

“మూసీ బాగు విషయంలో కెటిఆర్ తన ఆలోచనలు చెప్పొచ్చు. అంతర్జాతీయ అవగాహన ఉన్న ఆయనకు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా? ఈ ప్రాజెక్ట్‌పైన కెటిఆర్,హరీశ్‌రావు, ఈటల రాజేందర్ తమ ప్రతిపాదనలు తెలియజేయాలి. నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ను. గేమ్‌పైన స్పష్టత ఉంది. – సిఎం రేవంత్‌రెడ్డి

- పునరుజ్జీవ పనులకు 1వ తేదీన శంకుస్థాపన
- ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధం
- త్వరలో అఖిలపక్ష సమావేశం
- అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా
- భూమి ఇచ్చేవారికి 100 శాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ
- కేవలం హైడ్రాతోనే రియల్‌ఎస్టేట్ వ్యాపారం పడిపోలేదు
- మీడియా ‘చిట్‌చాట్’లో సిఎం రేవంత్‌రెడ్డి

## వెనక్కితగ్గే ప్రసక్తేలేదు

ప్రజాపక్షం/హైదరాబాద్

‘‘రాజకీయంగా మాజీ సిఎం కెసిఆర్ పని అయిపోయింది. ఆయనొక కాలం చెల్లిన ఔషధం.తనయుడు కెటిఆర్‌తోనే తండ్రి కెసిఆర్ రాజకీయం ముగుస్తుంది. బావతో బామ్మర్ది రాజకీయం కూడా ముగుస్తుంది. ఇక బావతో ఎలా వ్యవహరించాలో తమకు తెలుసు’’ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ పనులకు నవంబర్ 1వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు సిఎం చెప్పారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చకు తాము సిద్ధమని, త్వరలోనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొన్నదని, కేవలం హైడ్రాతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోలేదని సిఎం స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో సియోల్‌ని హన్ నది ప్రక్షాళనను అధ్యయనం చేసి వచ్చిన మీడియా ప్రతినిధులతో సిఎంరేవంత్ రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడం తప్ప, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే తాము వెయ్యి సార్లు ఆలోచిస్తామని, తీసుకున్న తర్వాత వెనక్కి వెళ్లేదిలేదన్నారు. తొలుత బాపూఘాట్ నుంచి మూసీ తరువాయి 2లో

### విచారణ సమయంలో కక్ష సాధింపులు ఉండవు

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోంది. విచారణ సమయంలో కక్ష సాధింపు ఉండబోదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ నిందితుల పాస్‌పోర్ట్ రద్దయిన నేపథ్యంలో వారు అనధికారికంగా విదేశాల్లో ఉండలేరని తెలిపారు. కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినప్పటికీ తాను రుణమాఫీ చేశానని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశామన్నారు. కెసిఆర్ రాష్ట్రంలో రూ.7.5 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి వెళ్లారన్నారు. రుణమాఫీలో సాంకేతిక లోపాలు ఉన్నవి మాత్రమే ఆగాయని, పది నెలల్లో 50వేల ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, టిజిపిఎస్‌సి నియామకాల్లో 90శాతం బిసి ఎస్‌సి,ఎస్‌టిలకే అని అన్నారు.

### తప్పు చేయకుంటే ముందస్తు బెయిల్ ఎందుకు ..?

జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలో బిఆర్‌ఎస్‌వి కట్టుకథలు హాస్యాస్పదమని రేవంత్ రెడ్డి అన్నారు. దీపావళి అంటే ఎవరైనా చిచ్చుబుడ్లు కాలుస్తారని, కానీ, జన్వాడ ఫామ్‌హౌస్‌లో మాత్రం సారా బుడ్లు బయటి కొచ్చాయని ఎద్దేవా చేశారు. అనధికార విదేశీ మద్యంతో కెటిఆర్ దీపావళి జరుపుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రాజ్‌పాకాల ఏమీ చేయకపోతేఎందుకు పారిపోయారని, ముందస్తు బెయిల్ ఎందుకు అడిగారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ తన అక్రమ సొమ్ముతో సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.



# తల తాకట్టు పెట్టైనా రుణమాఫీ చేస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పిఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా విద్యార్థినులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం

ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఉన్నా తల తాకట్టు పెట్టైనా రూ.రెండు లక్షల రుణ మాఫీ చేసి తీరుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులు తీసుకొచ్చిన పత్తిలో కోత విధిస్తే సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేబ్రిడ్జి కాటాలో తేడా వస్తే మిల్లు సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇటీవల భారీ వర్షాలకు మండల పరిధిలోని బీరోలు పెద్ద చెరువు పూర్తిగా తెగిపోవడంతో మూడు కోట్ల వ్యయంతో పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోల్ తండా గ్రామ పంచాయతీలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ మిల్‌లో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం తిరుమలాయపాలెం హైస్కూల్లో 8, 9, 10 ప్రగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మరాజ్యంలో ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, రైతులకు మాట ఇచ్చిన ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని తెలిపారు. ఇప్పటికే మాట ఇచ్చిన 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినట్లు, ఇంకా 13 వేల కోట్ల రుణమాఫీ డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని, ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రుణమాఫీ అర్హులైన రైతులందరికీ చేస్తామని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రైతులు ఎంతో పంట నష్టపోయారని, జిల్లావ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని, రైతులకు అనుగుణంగా జిల్లాలో 9 పత్తి సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు సిసిఐ కొనుగోలు కేంద్రానికి పత్తి విక్రయించేందుకు తీసుకొస్తే 8.12 శాతం ఉన్న అరకేజీ తరువాయి 2లో



## మెడికల్ కాలేజీలో ఎసిబి దాడి

పట్టుబడ్డ ఎఒ, జూనియర్ అసిస్టెంట్

ప్రజాపక్షం/భద్రాచలం

కొత్తగూడెం మెడికల్ కాలేజీలో మంగళవారం ఎసిబి అధికారులు దాడులు చేశారు. రూ.3 లక్షల లంచం తీసుకుంటుండగా ఎఒ ఖలీలుల్లాఖాన్, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెండ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. కొత్తగూడెం మెడికల్ కాలేజీలో పని చేసే ఔట్ సోర్సింగ్ తరువాయి 2లో



## విద్యుదాఘాతంతో తల్లీకూతురు సజీవ దహనం

ప్రజాపక్షం/రామగిరి

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల రాంనగర్ లో మంగళవారం షార్ట్ సర్క్యూట్ తో తల్లి గడ్డం కొమరమ్మ(65), ఆమె కూతురు పోచమ్మ(45) సజీవ దహనం అయ్యారు. వివరాల్లోకి వెళితే బిర్యాని సెంటర్లో పనిచేస్తున్న వారు రాత్రి పని ముగించుకొని ఇంటికి వెళ్లి ఒకే మంచంపై నిద్రపోయారు. ప్రమాదవశాత్తు తరువాయి 2లో

## విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

‘పోక్సో’ కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఓ మైనర్‌బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ అమానుష సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని ఒక కాలనీకి చెందిన మైనర్ బాలిక (17) స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో పదవతరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో ఆమె తన ఇంటిముందు ఆడుకుంటోంది. అదే కాలనీకి చెందిన మల్యాల ప్రభాస్, బోనాల శేఖర్, గుర్రం భరత్ అనే తరువాయి 2లో

# గత పదేళ్లలో విద్యుత్ ఛార్జీల భారం రూ.20 వేల కోట్ల పైనే

ప్రజాపక్షం / హైదరాబాద్

‘‘కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలను పెంచలేదు. డిస్కంలు ప్రతిపాదించిన రూ.1200 కోట్ల ఛార్జీల పెంపు భారం కూడా వినియోగదారులపై పడకుండా ప్రభుత్వమే సబ్సిడీ మొత్తం భరించేందుకు సిద్ధపడింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఛార్జీలను పెంచకపోగా గృహజ్యోతి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే గృహాలకు ఉచితంగా విద్యుత్తును అందిస్తోంది. దాదాపు 50 లక్షల గృహాలకు జీరో బిల్లులు జారీ చేస్తోంది’’ అని ప్రభుత్వవర్గాలు తెలియజేశాయి. ‘‘గడిచిన పదేండ్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీల పెంపుతో తెలంగాణలోని అన్ని వర్గాలపై మోయలేనంత భారం మోపింది. ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో విద్యుత్తు ఛార్జీలు పెంచనే లేదని బిఆర్‌ఎస్ నేతలు అబద్ధాలు వల్లిస్తున్నారు. 2015–2016లో డొమెస్టిక్, నాన్ డొమెస్టిక్, అన్ని కేటగిరీల నుంచి విద్యుత్తు ఛార్జీల ద్వారా రాష్ట్రంలోని డిస్కంలు (ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్) రూ.18845 కోట్లు వసూలు చేశాయి’’ అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2023–24లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి విద్యుత్తు ఛార్జీల ద్వారా డిస్కంలకు వచ్చిన రాబడి రూ.43439 కోట్లు కాగా పదేండ్లలో అన్ని వర్గాలపై అప్పటి ప్రభుత్వం వడ్డించిన విద్యుత్తు ఛార్జీల భారం రూ.24,594 కోట్లు. ఇందులో పెరిగిన కనెక్షన్లు, పెరిగిన విద్యుత్ వినియోగం పక్కన



పెట్టినా దాదాపు రూ.20 వేల కోట్ల భారం ఛార్జీల పెంపు ఫలితమేనని అధికారవర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం 2014 నుంచి 2024 మధ్య కాలంలో గత ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలను పెంచింది. 2015–16 సంవత్సరంలో 5 శాతం, 2016–17లో అంతకంటే ఎక్కువగా 8 శాతం విద్యుత్తు ఛార్జీలను పెంచడమే కాకుండా 2022–23లో గంపగుత్తగా ఒకేసారి 16 శాతం ఛార్జీలను పెంచి వినియోగదారులపై రూ. 6 వేల కోట్లకుపైగా భారాన్ని మోపింది. 2020కి ముందు ఫిక్స్డ్ ఛార్జీల ప్రస్తావన లేనే లేదు. గృహ వినియోగదారుల నుంచి ఫిక్స్డ్ ఛార్జీలను వసూలు చేయటం మొదలు పెట్టిందే అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వమని ప్రస్తుతం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తర్వాత అయిదేండ్లు ఛార్జీలు పెంచలేదంటూ ప్రజలను నమ్మించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం చాటుమాటు ఛార్జీలు వడ్డించి ప్రజలను మోసం చేసింది. పేదలను, మధ్య తరగతి ప్రజలను ఏ ఒక్క వర్గాన్ని తరువాయి 2లో

# 21 మంది బెటాలియన్ పోలీసులపై కేసులు



ప్రజాపక్షం/హైదరాబాద్

ధర్నా చౌక్ వద్ద ఆందోళన నిర్వహించిన 21 మంది కానిస్టేబుళ్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లుగా టిజిఎస్‌పి అడిషనల్ డిజి సంజయ్ కుమార్ జైన్ వెల్లడించారు. హైదరాబాద్ సిటీలో బిఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ కానిస్టేబుళ్లు ఆందోళన నిర్వహించారని తెలిపారు. అందుకే వారిపై దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు నమోదు చేశామని, బిఎన్‌ఎస్ 223, 126 (2) సెక్షన్లతోపాటు పోలీస్ ఫోర్సెస్ యాక్ట్ సెక్షన్ 4 కింద కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. క్రిమినల్ కేసులతోపాటు కానిస్టేబుళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని,ఆర్టికల్ 311 (2(బి)) నిబంధనలు ఉల్లంఘించారని వెల్లడించారు. నిబంధనలను అతిక్రమించి ప్రవర్తిస్తే తెలంగాణ పోలీస్ శాఖ ఉపేక్షించదని, ఆందోళనకు పాల్పడుతున్న వారిపై శాఖాపరమైన చర్యలు కూడా ఉంటాయని సంజయ్ కుమార్ జైన్ స్పష్టం చేశారు. ‘ఏక్ పోలీస్ విధానం’ నినాదాలతో బెటాలియన్ పోలీసులు, వారి కుబుంబ సభ్యులు మెరుపు తరువాయి 2లో

# సస్పెండ్ చేసిన పోలీసులను విధుల్లోకి తీసుకోవాలి

సమస్య పరిష్కరించకుంటే గూడు కట్టుకున్న అసంతృప్తి భవిష్యత్తులో బద్దలయ్యే ప్రమాదం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం / హైదరాబాద్



ఇటీవల సర్వీసు నుంచి డిస్మిస్ అయిన పది మంది, సస్పెండైన 37 మంది బెటాలియన్ పోలీసులను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సెలవులు ఇవ్వకపోవడం, డ్యూటీతో సంబంధంలేని పనులను చేయించడంతో తీవ్ర నిస్పృహతో బెటాలియన్ కానిస్టేబుళ్ళ కుటుంబాలు వీధుల్లోకి ఎక్కాయని, దీనిని మానవతా దృక్పథంతో అర్థం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. డ్యూటీతో సంబంధం లేని మట్టి పనులు, పైపులు ఎత్తించే పనులను, అనధికారికంగా ఆర్డర్లీ సేవలకు వినియోగించే వలస కాలపు ధోరణులను సమూలంగా తొలగించాలని, సివిల్ పోలీసులకు మాదిరిగా ఒకే పోలీసుల విధానం అమలు చేయాలనే బెటాలియన్ పోలీసుల డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు. యూనిఫామ్ సిబ్బంది రోడ్డెక్కడంపై నిబంధనలు ఉన్నప్పటికీ, వారి సమస్యలు న్యాయమైనవేనని, వాటిని దీర్ఘకాలం పరిష్కరించకపోవడంతోనే అసంతృప్తి వెల్లడైందనే అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని సాంబశివరావు సూచించారు. వారి చర్యలను క్షమాగుణంతో అర్థం చేసుకుని డిస్మిస్, సస్పెండ్ అయిన సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, బెటాలియన్ పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా వారి కుటుంబాలలో పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందన్నారు. తద్వారా బెటాలియన్ పోలీసులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వహిస్తారని, సమస్య పరిష్కరించకుండా అణిచివేస్తే, వారిలో నిగూడంగా ఉన్న అసంతృప్తి భవిష్యత్తులో కూడా బద్ధలయ్యే ప్రమాదం ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. తక్షణమే ప్రభుత్వం బెటాలియన్ పోలీసుల న్యాయమైన అంశాలను పరిష్కరించాలని సాంబశివరావు కోరారు.



## మరోసారి బైటపడ్డ సెబీ, అదానీ, బిజెపి సిండికేట్ బంధం

రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూపు, కీలక నియంత్రణ సంస్థలు, బిజెపిల మధ్య ప్రమాదకరమైన బంధం ఇంకా కొనసాగుతుందని, మోనోపలీ బచావో సిండికేట్ (గుత్తాధిపత్య పరిరక్షణ సిండికేట్) పని చేస్తూనే ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఏళ్ళ తరబడి ఎన్నో కష్టాలతో సృష్టించిన సెబీ పవిత్రతను మోదీ నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు కష్టబడి దాచుకున్నకోట్లాది రూపాయలను గందరగోళంలో పడేస్తున్నారని విమర్శించారు. ఇంక ఎంతో కాలం మీరు నియమించిన సెబీ చైర్‌పర్సన్‌ను కాపాడలేరని, బైటపడుతున్న నిజాలతో ఆమె స్థానం ప్రమాదంలో పడిందన్నారు. మీ మిత్రుడు అదానీ తరువాయి 12లో



## ప్రజాభిప్రాయం మేరకే రిజర్వేషన్ల ఖరారుకు ప్రతిపాదనలు

తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడి

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి

ప్రజలు వ్యక్తపరిచిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా వెల్లడయ్యే అంశాలను పరిగణనలోకి తీసుకుని స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషాపై తెలంగాణ బిసి కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలతో కూడిన నివేదికను సమర్పిస్తుందని కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ఈ నివేదిక పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో తరువాయి 2లో

# పంథా మారిన ఉగ్రవాదం



ఆగని బెదిరింపుల పర్వం

ఈజీ టార్గెట్‌తో- భారత ఆర్థిక వ్యవస్థపై ‘ఉగ్ర’ గురి

నెల రోజుల్లో 650 బెదిరింపు కాల్స్

విమానయాన సంస్థలకు రూ.800 కోట్ల నష్టం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉగ్రవాదం తన పంథా మార్చుకున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు ఉగ్రవాదులు అత్యంత సులువైన మార్గాలను ఎంచుకున్నట్లు కేంద్ర నిఘా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ క్రమంలోనే నెల రోజుల వ్యవధిలో సుమారు 650 బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఇందులో 575 కాల్స్ విమానాలను పేల్చివేస్తామంటూ విమానయాన సంస్థలకు కాల్స్ రావడం ఇందుకు నిదర్శనమంటున్నారు. వీరి బెదిరింపు కాల్స్‌తో విమానాయ సంస్థలు సుమారు రూ.800 కోట్లు నష్టం వాటిల్లినట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక పక్క విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్, ఆయా ప్రాంతాలలో బాంబు పేల్చుతున్నామంటూ బెదిరింపు కాల్స్, మరోపక్క రన్నింగ్ రైళ్లను పట్టాలు తప్పేటట్లు చేయడంకోసం రైల్వే ట్రాక్‌లపై సిలిండర్‌లను అమర్చడం, పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మెలు పెట్టడం చేస్తున్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో రైల్వే పోలీసులు, లోకోపైలట్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదాలు తప్పాయి. లేనిపక్షంలో రైళ్లు పట్టాలు తప్పి వందలాది మంది మరణించడంతో పాటు రూ.కోట్లలో నష్టాలు చవిచూసేవి. కాగా బెదిరింపు కాల్స్‌కు పాల్పడిన ఓ వ్యక్తిని నాగ్‌పూర్‌లో మంగళవారం అక్కడి తరువాయి 12లో

# 70ఏళ్లు పైబడిన వృద్ధులకు ‘ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యబీమా’

9వ ఆయుర్వేద దినం, ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ప్రారంభోత్సవాల పర్వం




**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం దాదాపు రూ.12,685కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, 70ఏళ్లు, ఆపైబడిన వృద్ధులు అందరి కోసం తన ప్రభుత్వ ప్రధాన ఆరోగ్య బీమా పథకం ‘ఆయుష్మాన్ భారత్’ను విస్తరించారు. తొమ్మిదవ ఆయుర్వేద దినం , వైద్య దేవుడిగా పేరొందిన ధన్వంతరి జన్మదినోత్సం సందర్భంగా ఆరోగ్య రంగంలో మరొక ముందడుగు పడినట్లైంది. అంతేకాకుండా ప్రధాని మోదీ దేశ రాజధాని ఢిల్లీలో భారతదేశ మొట్టమొదటి అఖిల భారత ఆయుర్వేద సంస్థ ఫేజ్2ను కూడా ప్రారంభించారు. పంచకర్మ హాస్పిటల్, డ్రగ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు సంబంధించిన ఆయుర్వేద ఫార్మసీ, ఒక క్రీడా ఔషధాల విభాగం, సెంట్రల్ లైబ్రరీ, ఐటి, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, 500సీట్లతో నిర్మించబడిన ఆడిటోరియం ఇతర వసతుల సమాహారంగా ఈ అఖిల భారత ఆయుర్వేద సంస్థ ఫేజ్ 2 నిర్మించబడింది. ఆరోగ్య తరువాయి 12లో

# ఓటు వేసిన జో బైడెన్



**డెలావేర్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తన ఓటు వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు ముందస్తు బ్యాలెట్ అవకాశం ఉంటుంది. డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లోని తన నివాసానికి సమీపంలో 'స్టేట్ ఆఫ్ డెలావేర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్షన్స్' కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు. అక్కడ ఓటు వేయడానికి అప్పటికే చాలా మంది క్యూలో నిలబడడంతో, బైడెన్ సుమారు 40 నిమిషాలు క్యూలోనే నిలబడి వేచి చూడాల్సి వచ్చింది. ఓటర్లతో ఆయన మాట్లాడారు. వీల్ చైర్‌లో ఉన్న ఓ వృద్ధ మహిళకు సాయం చేశారు. ఎన్నికల అధికారికి గుర్తింపుకార్డు చూపించి, ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతకు ముందు పోలింగ్ కేంద్రం వద్ద బైటెన్ మాట్లాడుతూ, అధ్యక్ష పదవికి పోటీపడుతున్న డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ విజయావకాశాలపై అక్కడ ఉన్నవారి అభిప్రాయం తెలుసుకున్నారు. మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయాలని బైడెన్ తొలుత నిర్ణయించినప్పటికీ, అనంతరం రేసు నుంచి వైదొలగడంతో కమలకు అవకాశం లభించిన విషయం తెలిసిందే. 1970 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న బైడెన్, మాజీ అధ్యక్షుడు ఒరాక్ ఒబామా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం గత ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసి, అప్పటి అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించారు. తన పరాజయాన్ని ట్రంప్ అంగీకరించకపోవడం, ఆయన మద్దతుదారులు కాపిటోల్ (అమెరికా పార్లమెంటు భవనం)పై దాడి చేయడం వంటి ఘటనలు అప్పట్లో సంచలనం రేపాయి. ఈసారి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అలాంటి ప్రమాదం ఉండవచ్చన్న భయాందోళనలు ప్రజల్లో లేకపోలేదు.

ప్రపంచం

# హిజ్బొల్లాకు కొత్త చీఫ్‌గా నయీమ్ ఖాసిం

**బీరూట్:** లెబనాన్‌లోని హిజ్బొల్లా గ్రూప్ కొత్త చీఫ్‌గా నయీమ్ ఖాసిం ఎన్నికయ్యాడు. గత నెల ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో మృతి చెందిన తమ నాయకుడు హసన్ నస్రల్లా వారసుడిగా నయీమ్‌ను ఎంపిక చేసినట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిజానికి నస్రల్లా మృతి తర్వాత హిజ్బొల్లాకు నయీమ్ తాత్కాలిక నేతగా వ్యవహరించాడు. సుమారు మూడుదశాబ్దాలు హిజ్బొల్లా డిప్యూటీ సెక్రెటరీ జనరల్‌గా పని చేసిన ఆయనను సెక్రెటరీ జనరల్‌గా ఎన్నుకున్నట్టు హిజ్బొల్లా తన ప్రకటనలో తెలిపింది. హిజ్బొల్లాకు సంబంధించిన కీలక నిర్ణయాలను తీసుకునే అధికారం సెక్రటరీ జనరల్‌కు ఉంటుంది. వ్యూహకర్తగా పేరు సంపాదించిన నయీమ్‌కు బదులుగా, నస్రల్లాకు సమీప బంధువైన సఫియుద్దీన్‌కు హిజ్బొల్లా నాయకత్వం లభించే అవకాశం ఉన్నట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే, సీనియారిటీ ఎక్కువ కావడంతో నయీమ్‌కు ఈ పదవి దక్కింది. నస్రల్లా మృతి తర్వాత కాల్పుల విరమణపైన కూడా నయీమ్ అప్పట్లో ప్రకటన విడుదల చేశాడు. నస్రల్లా మృతితో యుద్ధం ముగియలేదని స్పష్టం చేసిన ఆయన, కాల్పుల విరమణకు సహకరిస్తామని హామీ ఇచ్చాడు. ఒకవేళ ఇజ్రాయెల్ మొండిగా ముందుకు వెళితే ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించాడు. నస్రల్లా మరణం



తర్వాత హిజ్బొల్లా గ్రూప్ సభ్యులను ఏకతాటిపై తీసుకొచ్చిన నయీమ్ కాల్పుల విరమణ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించాడు. ఈ విషయంపై లెబనాన్ పార్లమెంటు స్పీకర్ నబీ బెర్రి చేస్తున్న ప్రయత్నాలకు సహకరిస్తానని ప్రకటించాడు. అయితే, లెబనాన్ ప్రజలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తే మాత్రం సహించేది లేదని నయీమ్ తేల్చిచెప్పాడు.

# వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు

## అంతరిక్షం నుంచే సునీత విలియమ్స్ శుభాకాంక్షలు





**వాషింగ్టన్ డిసి:** అమెరికా అధ్యక్ష అధికారిక నివాసం వైట్‌హౌస్‌లో దీపావళి సంబారాలు వేడుకగా జరిగాయి. ఈ వేడుకల్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కాంగ్రెస్ నాయకులు, అధికారులుసహా 600 మంది భారతీయ అమెరికన్లు పాల్గొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ అక్కడి నుంచే శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా మాట్లాడిన బైడెన్, నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో కమలా హ్యారిస్‌కు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఆమెను విశ్వసించగల, తెలివైన అభ్యర్థిగా అభివర్ణించారు. అందుకే ఆమెను గత ఎన్నికల్లో తన రన్నింగ్ మేట్ (వైట్‌ప్రెసిడెంట్ అభ్యర్థి)గా ఎంచుకున్నానని వ్యాఖ్యానించారు. కాగా, ఐఎస్ఎస్ నుంచి సునీతా విలియమ్స్ ప్రత్యేక సందేశాన్ని పంపారు. తన తండ్రి దీపావళి గురించి ఎన్నో సందర్భాల్లో చెప్పారని, ఈ పండుగ సందర్భంగా భారతీయులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఆ సందేశంలో పేర్కొన్నారు.

# చైనా మానవ సహిత రోదశీ ప్రయోగం నేడు

**బీజింగ్:** మరోసారి మానవసహిత రోదశీ యాత్రకు చైనా రంగం సిద్ధం చేసుకుంది. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం బుధవారం తెల్లవారు జామున 4.27 నిమిషాలకు ఈ ప్రయోజం జరగనుంది. ఈ యాత్రలో పాల్గొంటున్న ముగ్గురు వ్యోమగాముల్లో ఓ మహిళ కూడా ఉంది. జియాక్వియాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరుగుతుందని చైనా మాన్డ్ స్పేస్ ఏజెన్సీ (సిఎంఎస్ఎ) తెలిపింది. ఈ ప్రయోగానికి లాంగ్ మార్చ్ 2ఎఫ్ వ్యోమనౌకను ఉపయోగించనున్నట్టు సిఎంఎస్ఎ డిప్యూటీ డైరెక్టర్ లిన్ జిక్వియాంగ్ తెలిపారు. ఇప్పటికే తమ దేశ అంతరిక్ష కేంద్రంలో ఉన్న వ్యోమగాములను ఈ వ్యోమనౌక తీసుకొస్తుందని చెప్పారు. చైనా అంతరిక్ష యాత్రల్లో ఇది 33వ ప్రయోగంకాగా, మానవ సహిత వాహనాన్ని పంపడం ఇది నాలుగోసారి అవుతుంది. కాయ్ జుఇజె, సాంగ్ లిండాంగ్, వాంగ్ హవోజె అంతరిక్షంలోకి వెళతారు. 2022లో ఒకసారి అంతరిక్షయానం చేసిన కాయ్ ఈసారి కమాండర్‌గా వ్యవహరిస్తారు.



## రూ.20 వేల కోట్ల పైనే

(మొదటి పేజీ తరువాయి)

కూడా వదిలిపెట్టకుండా గత ప్రభుత్వం ఒక్కో యూనిట్‌పై 50 పైసల నుంచి ఒక రూపాయి చొప్పున వడ్డించింది. వీటితో పాటు ఫిక్స్‌కస్టమర్ ఛార్జీలను కూడా పెంచింది. అప్పుడు వినియోగదారుల నుంచి అన్ని చోట్ల ఆందోళనలు వ్యక్తమైనా బిఆర్ఎస్ పెడచెవిన పెట్టింది. మరోవైపు విద్యుత్తు సంస్థల లాభనష్టాలను వెల్లడించకుండా గత ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని సర్వనాశనం చేసింది. అందుకే తెలంగాణలోని డిస్కంలు వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయి. ఏడాదికోసారి డిస్కంలు ఈఆర్‌సికి సమర్పించాల్సిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికలను (ఎఆర్ఆర్) కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో 2014–15, 2019–20, 2020–21, 2021–22 సంవత్సరాల్లో డిస్కంలు ఈ నివేదికలను (ఎఆర్ఆర్) కూడా దాఖలు చేయలేదు. తమ ప్రభుత్వ నిర్వాకాన్ని దాచిపెట్టి ఈ ప్రభుత్వం రూ.18 వేల కోట్ల ఛార్జీలు పెంచుతుందని బిఆర్ఎస్ నేత కెటిఆర్ తప్పుడు ప్రచారం చేశారు.

## ఎసిబి దాడి

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది ఆరు నెలల జీతాల బిల్లులు చేసేందుకు కళాశాల ఏఓ ఖలీలుల్లా ఖాన్ తో పాటు జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ రూ.15 లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేమని రూ.7 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఆ మొత్తంలో మొదటి విడత క్రింద మంగళవారం రూ.3 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో రూ.3 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా ఏజెన్సీ వాళ్లు అధికారులను కలువగా రెండు నెలల జీతాలు చేశారని సమాచారం ఉంది. దీంతో ఏజెన్సీతో బేరసారాలు కుదుర్చుకుని జీతాలు బిల్లు చేసేందుకు లంచం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పి రమేష్ మాట్లాడుతూ ఏవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రి నెంబర్‌కు కాల్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## పోలీసులపై కేసులు

(మొదటి పేజీ తరువాయి)

ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న వారి కుటుంబ సభ్యులపై ప్రభు త్వం ఉక్కుపాదం మోపింది. ఇప్పటికే పలువురిని సస్పెండ్ చేయగా, మరికొందరిని ఉద్యోగాల నుంచి బర్తరఫ్ చేసింది. దీంతో కానిస్టేబుళ్ళ ఆందోళన మరింత తీవ్రతరమైంది. ఇప్పటికే చేసిన సస్పెన్షన్లను, బర్తరఫ్ లను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్ బడ్జెట్ విడుదల**

పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్ లకు సంబంధించిన బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం భారీస్థాయిలో విడుదల చేసింది. రూ.182.48 కోట్ల మొత్తాన్ని పోలీసు సిబ్బందికి మంజూరు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఎంతోకాలంగా పోలీస్ సిబ్బంది ఎదురుచూస్తున్న సరెండర్ లీవ్ లకు సంబంధించిన బడ్జెట్ ను విడుదల చేయడంపై పోలీస్ అధికారుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన బకాయిలను దశలవారీగా త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది.

## తల్లీకూతురు సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో తల్లి కూతుర్లు ఇద్దరు మంచం పైనే మంటల్లో కాలిపోయి సజీవ దహనమయ్యారు. వీరితోపాటు మంచం కింద ఉన్న శునకం, అలాగే కోడి మరణించింది. సంఘటన స్థలాన్ని ఏసిపి మడత రమేష్, మంథని సిఐ రాజు, ఎస్సై చంద్రకుమార్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగిరి పోలీసులు తెలిపారు.

## విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురు యువకులపై బాలిక వద్దకు వచ్చి అరవకుండా నోరు మూసి అక్కడినుంచి ఎత్తుకెళ్లారు. కస్తుర్బా పాఠశాల వెనుకాల ఉన్న గదిలో తీసుకెళ్లారు. అరుస్తున్న ఆమె నోట్లో కర్చీఫ్ కుక్కారు. వద్దని ఎంతగా ప్రాధేయపడుతున్నా కనికరించని ఆ ముగ్గురు యువకులు బాలికపై సాముహిక అత్యాచారం చేశారు. ఇంట్లో పనిచేస్తున్న బాలిక తల్లి బయటకు వచ్చి చూడగా కూతురు కన్పించపోవడంతో చుట్టుపక్కల వెతికింది. తన కుమారుడుతో కలసి కూతురు కోసం చాలాసేపు వెతికినా ఫలితం లేకపోయింది. రాత్రి 11 గంటల సమయంలో తన కూతురు నడుచుకుంటూ ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చిన కూతురును ఇప్పటి వరకు ఎక్కడికి వెళ్లావని తల్లి మందలించగా పెద్దపెట్టున రోదిస్తుండటంతో ,ఫిట్స్ వస్తాయని భయానికి అంతటితో మందలించడం ఆపేశారు. మరుసటి రోజైన సోమవారం కూతురును మళ్లీ రాత్రి ఎందుకు ఆలస్యం అయ్యిందని తల్లి ప్రశ్నించింది. తాను ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో అదే ఏరియాకు చెందిన మల్యాల ప్రభాస్, బోనాల శేఖర్, గుర్రం భరత్‌లు తనను బలవంతంగా ఎత్తుకెళ్లి కస్తుర్బా పాఠశాల వెనుకగదిలో తీసుకెళ్లి నోటిలో కర్చీఫ్ కుక్కి అత్యాచారం చేశారని కంటతడిపెట్టింది. బాధితురాలి తల్లి సోమవారం రాత్రి 11 గంటకు హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ముగ్గురు వ్యక్తులపై ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

**ముగ్గురు నిందితుల అరెస్టు– ఏసిపి సతీష్**

హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ముగ్గురు యువకులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు హుస్నాబాద్ ఎసిపి సతీష్ తెలిపారు. మైనర్ బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డ నిందితులు బోనాల శేఖర్, మల్యాల ప్రభాస్, గుర్రం భరత్‌లను మంగళవారం అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఏసిపి చెప్పారు.

## రుణమాఫీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)



తరుగు కూడా తీయొద్దని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కల్పించాలని తెలిపారు. అనంతరం తిరుమలాయపాలెం హైస్కూల్లో విద్యార్థినిలకు పి ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా వివిధ ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు సైకిల్ పంపిణీ చేసి ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలకు పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఇర్రిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, తిరుమలాయపాలెం మండల తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు అందుబాటులో తెలంగాణ ఉద్యమ తొలి, మలి దశ చరిత్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెంగాణ సంస్కృతి, చరిత్ర తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమ ఘట్టాల నేపథ్యాన్ని విస్తృత స్థాయిలో ప్రజలకు వివరించేందుకు సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ( ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ) లో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ విభాగం అధిపతిగా కెప్టెన్ పాండురంగా రెడ్డి మంగళవారం బాధ్యతలు తీసుకున్న కార్యక్రమానికి చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ గొప్పతనం, చారిత్రక విశిష్టతను రాబోయే తరం తెలుసుకునే విధంగా రచనలు అందుబాటులో ఉండేలా తెలంగాణ చరిత్రకారులు, కవులు, రచయితలు, సంస్థలు, ఉద్యమకారులు కృషి చేయాలని సూచించారు.తెలంగాణ ఉద్యమ తొలి, మలిదశ ఘట్టాలు, మలిదశ ఉద్యమాన్ని రగిలించిన తన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఎల సంతకాల సేకరణ, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి వివరించిన ఘట్టాలను, చరిత్రను కూడా రాబోయే తరానికి అందుబాటులో ఉంచాలని చిన్నారెడ్డి తెలిపారు.అనంతరం డాక్టర్ చిన్నారెడ్డిని ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ అధిపతి కెప్టెన్ పాండురంగారెడ్డి సన్మానించి, జ్ఞాపికను బహుకరించారు.ఈ సందర్భంగా ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ తో చిన్నారెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ చరిత్రకు సంబంధించిన రచనలను హెచ్ ఆర్ డీ సంస్థ ద్వారా ప్రచురించాలని శశాంక్ గోయల్ ను చిన్నారెడ్డి కోరగా, అందుకు ఆయన సమ్మతించారు. ఈ కార్యక్రమంలో ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి అధికారి మాధవి రావులపాటి, తదితరులు పాల్గొన్నారు.

**ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఇంజనీరింగ్, ' లా ' కాలేజీ మంజూరు:**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఇంజనీరింగ్, ' లా ' కాలేజీల మంజూరు అయినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో విద్యాభివృద్ధికి ఎంతో మేలు చేకూరుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆయన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## మూసీపై ముందుకే...

(మొదటి పేజీ తరువాయి)

పనులను ప్రారంభిస్తామని, నవంబరులో ప్రాజెక్టు పనులకు టెండర్లు ఆహ్వానిస్తామని వివరించారు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కిలో మీటర్ల వరకు అభివృద్ధి చేస్తామని, మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీటిని తరలిస్తామని, మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపు అంశంలో నవంబరులో టెండర్లను ఆహ్వానిస్తామని వివరించారు. మల్లన్న సాగర్ నుంచి రూ.7వేల కోట్లతో నీటిని ఉస్మాన్‌సారగ్‌కు మళ్లీస్తామని, అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు, ఆ తర్వాత బాపూఘాట్ వద్ద నీటిని శుద్ధి చేసి ఎస్‌టిపిల ద్వారా నీటిని మూసిలోకి వదులుతామని సిఎం వివరించారు. బాపు ఘాట్ నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు అభివృద్ధి చేస్తామని, ఇందులో భాగంగా పదకొండున్నర కిలోమీటర్ల ఒక స్ట్రెచ్, ఏడున్నర కిలోమీటర్లకు మరో స్ట్రెచ్‌నుతాను ఒక ప్రణాళికను రూపొందించి, ఆ తర్వాత ప్రజలను ఒప్పిస్తామని తెలిపారు. మూసీని మరొక సిటీగా అభివృద్ధి చేస్తానని, అక్కడ రాత్రి 7గంటల నుంచి ఉదయం 7గంటల వరకు మార్కెట్ ఉండేలా ప్రణాళికను రూపొందిస్తామన్నారు. రూ. 141 కోట్లతో డిపిఆర్ రూపొందిస్తున్నామని, మూడు నెలల్లో నివేదిక వస్తుందని తెలిపారు.

**వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర :**

అవసరమైతే తాను వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేయనున్నట్టు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. బిఆర్ఎస్ నేతలు మూసీ పునరుజ్జీవంపై ఉన్న అభ్యంతరాలను తమకు తెలియజేయాలని, తనను కలవడానికి ఇబ్బందని పిస్తే, మంత్రులు, అధికారులను కలిసి చెప్పవచ్చని వివరించారు. 'మూసీ' అభివృద్ధి నిమిత్తం నగర ఎంఎల్‌ఎలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపిస్తామని తెలిపారు. మూసీ పునరుజ్జీవంపై కావాలనే తాను చర్చకు తెరలేపానని, ఈ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన కలిగిందని, మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడనే విషయం ప్రజలకు తెలిసిందని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా టూరిజం అభివృద్ధి చెందుతుందని సిఎం అన్నారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు మీడియా సహకరించాలని కోరారు. మూసీ కోసం భూములను ఇచ్చేవారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తామని సిఎం రెవంత్ రెడ్డి భరోసనిచ్చారు. ప్రజలను కష్టపెట్టి, వారిని ఇబ్బంది పెట్టి, ఆ భూములను తీసుకోబోమని స్పష్టం చేశారు. ప్రాజెక్టును ఎన్‌జిఒలు వ్యతిరేకిస్తే అర్థం ఉన్నదని, కానీ పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావడం లేదన్నారు.

**కెటిఆర్ తన ఆలోచన చెప్పవచ్చు...**

కెటిఆర్ ప్రపంచస్థాయి మేధావి అనిని అనుకుంటారని, మూసీని బాగు చేసే అంశంలో ఆయన తన ఆలోచనలు చెప్పొచ్చని,అంతర్జాతీయ అవగాహన ఉన్న కెటిఆర్‌కు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా? అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుపై కెటిఆర్ నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నానని, ఈ ప్రాజెక్ట్‌పైన కెటిఆర్,హరీశ్‌రావు, ఈటల రాజేందర్ తమ ప్రతిపాదనలు తెలియజేయాలని సూచించారు. తాను ఫుట్‌బాల్ ప్లేయర్‌ను అని, తనకు గేమ్‌పైన స్పష్టత ఉన్నదని, 55 కిలోమీటర్ల మూసీ పునరుజ్జీవం పూర్తయితే అద్భుతనగరంగా అవిష్కృతం అవుతుందన్నారు. ఎంతో ఆలోచించి తాను హైడ్రాను రంగంలోకి దించానని, హైడ్రాను దేశమంతా తెలిసేలా బిఆర్ఎస్ ప్రచారం చేసిందన్నారు.

**అణచివేతలతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోను**

రాజకీయంగా తమకు నష్టం జరిగినప్పటికీ తాము ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలకు చేయాలనుకున్న మేలు మాత్రం చేసి తీరుతామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తనది చిన్నవయసని, తనకు రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉన్నదన్నారు. అణచివేతలతో తాను ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేనని, అందరి విషయంలోనూ తాను ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తానని సిఎం చెప్పారు. ముఖ్యమంత్రి కావాలన్న తన కల నెరవేరిందని, సిఎం పదవి కంటే పెద్ద కలలు తనకు వేరే ఏమీ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. సినిమాల్లో రాజమౌళి, వర్మ ఇద్దరిది వేర్వేరు స్టయిల్ అని, రాజకీయాల్లో తన స్టైల్ తనదని, కెటిఆర్ స్టైల్ కెటిఆర్‌రది అని అన్నారు.

## ప్రజాభిప్రాయం మేరకే

(మొదటి పేజీ తరువాయి)

ఉండేలా కమీషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, కులసంఘాలు, ప్రజల నుండి అభ్యర్థలనలు స్వీకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమీషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మిలతో కూడిన బృందం మంగళవారం నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. బీసీ సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు హాజరై వ్రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమీషన్‌కు అందిస్తూ మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. బహిరంగ విచారణ ప్రక్రియకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేసింది. నిర్ధేశిత నమూనాలో అఫిడవిట్‌తో కూడిన వినతులు కమీషన్‌కు సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలందించేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషన్ విధివిధానాలపై చైర్మన్ నిరంజన్ క్లుప్తంగా వివరించారు. స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీ కాలం పూర్తయి ఎన్నికలు జరగకపోవటంతో కేంద్రం నుండి వచ్చే నిధులు నిలిచిపోయాయన్నారు. దీంతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోందన్నారు. నవంబర్ 13 వరకు సర్వే పూర్తవుతుందని, అనంతరం ఆన్‌లైన్‌లో డేటాను నిక్షిప్తం చేసి డిసెంబర్ 9లోగా ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టుకు నివేదిక అందజేస్తామన్నారు. కాగా బహిరంగ విచారణ కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న కమీషన్ బృందానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు, వివిధ సంఘాల ప్రతినిధులు కమీషన్‌కు తమ అభిప్రాయాలను తెలిపారు. కమీషన్ బహిరంగ విచారణ ప్రక్రియలో స్పెషల్ ఆఫీసర్ సతీష్, జిల్లా బీసీ సంక్షేమాధికారిని స్రవంతి పాల్గొన్నారు.

# దేవాదాయ భూముల్లో సోలార్ ప్లాంట్లు




**91వేల ఎకరాల దేవాదాయ భూముల రీసర్వే**
**యాదగిరిగుట్టపై త్వరలో 24 గంటలు వెలిగే 'అఖండ దీపం'**
**బాసరలో గోదావరి హారతి**
**వేములవాడ, భద్రాచలం, బాసర దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లు**
**అన్ని దేవాలయాలకు కలిపి ఒకే వెబ్‌సైట్**
**'ప్రజాపక్షం'తో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ**

బిరుదరాజు వాసుదేవరాజు

''రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి, భూముల పరిరక్షణ, భక్తులకు సౌకర్యాలను కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి, సరిపడ నిధులను కూడా మంజూరు చేసింది. వేములవాడ, భద్రాచలం, బాసర దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేశాం. యాదగిరిగుట్టపై 24 గంటలు వెలిగేలా అఖండ దీపం ఏర్పాటు చేయనున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 91వేల ఎకరాల దేవాదాయ భూములను రక్షించేందుకు ప్రత్యేకంగా రీ సర్వే చేపట్టాం. ఖాళీగా ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. గత పాలకులు దేవాలయాలపై నిధులు ఖర్చుచేశారే తప్ప వాటి అభివృద్ధిని, భక్తుల సదుపాయాలను పట్టించుకోలేద'ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, భూముల పరిరక్షణ, భక్తులకు సదుపాయాలపై మంత్రి కొండా సురేఖతో 'ప్రజాపక్షం' ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

**ప్రశ్న: రాష్ట్రంలో దేవాదాయ పరిధిలో ఎంత భూమి ఉంది? వాటి పరిరక్షణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?**

**కొండా సురేఖ:** రాష్ట్రంలోని దేవాలయాల భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాం. దేవాదాయశాఖ పరిధిలో 91 వేల ఎకరాల భూములు ఉన్నాయి. అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలలో ఉన్న దేవాలయాల భూములను రక్షించేందుకు ప్రత్యేకంగా రీసర్వే చేపట్టాం. అన్ని భూములను జియో ట్యాగింగ్ చేయబోతున్నాం. భూములు అన్యాక్రాంతం కాకుండా ఖాళీ స్థలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తాం. దేవాలయ భూములలో లీజులు, ఆక్రమణలో ఉన్నవారిని ఖాళీ చేయించి అవసరమైన వారికి ప్రత్యామ్నాయ భూములు ఇవ్వడం అనేది పరిశీలనలో ఉంది.

**ప్రశ్న: రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా?**

**కొండా సురేఖ :** వేములవాడ, భద్రాచలం, బాసర తదితర పలు దేవాలయాల పునరుద్ధరణ, అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేశాం. అన్ని దేవాలయాల వెబ్‌సైట్‌లను కలిపి దేవాదాయ శాఖ సమగ్ర వెబ్‌సైట్‌ను తయారు చేయనుంది. క్యూఆర్ కోడ్ విధానం ద్వారా భక్తులు తమకు ఇష్టదైవం, దేవాలయాలకు సంబంధించిన చరిత్రను స్థల పురాణాన్ని తెలుసుకోవడమే కాకుండా ఎక్కడినుండైనా వారు విరాళాలు ఆన్‌లైన్‌లో ఇచ్చే విధంగా వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం త్వరలో దేవాదాయ శాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేయనుంది. యాప్ ద్వారా తమ సమీపంలో ఉన్న ప్రముఖ దేవాలయం వివరాలు, స్థల చరిత్ర క్షేత్రమహోత్సం, పూజల వివరాలు అందుబాటులో ఉంటాయి. తద్వారా టెంపుల్ టూరిజం అభివృద్ధికి బాటలు వేసినట్లవుతుంది. భక్తులు సైతం దేవాలయాల ఆవరణలో ఎక్కడైనా అపరిశుభ్రత, చెత్త ఉన్నట్లయితే ఫోటో తీసి అప్‌లోడ్ చేసి యాప్‌లో పెడితే అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో వికలాంగులకు, వృద్ధులకు, చంటి బిడ్డల తల్లులకు గర్భిణులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తున్నాం. దేవాలయాల అభివృద్ధితో పాటు టూరిజానికి అనుకూలంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.




**ప్రశ్న: గంగానదిలో ప్రతిరోజూ గంగా హారతి కార్యక్రమం లాంటిది తెలంగాణలోని బాసర వద్ద కూడా చేసే ఆలోచన ఏమైనా ఉందా?**

**కొండా సురేఖ :** బాసర ఆలయ పునర్నిర్మాణానికి మాస్టర్ ప్లాన్, ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అందులో భాగంగా బాసర పవిత్ర క్షేత్రంలో వినూత్నంగా గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రతి బుధవారం ఈ కార్యక్రమం కింద పూజ, హారతి నిర్వహిస్తారు. రూ.110 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు వచ్చారు. భక్తులు క్యూ లైన్‌లో నిల్చోకుండా బెంచీలు, కూలర్ల ఏర్పాటు ద్వారా భక్తులకు ఉపశమనం కలుగుతుంది. 100 శాతం ఆన్‌లైన్ సేవలతో వెబ్‌సైట్‌ను త్వరలో ప్రారంభించనున్నాం. అక్షరాభ్యాసం కోసం వచ్చిన తల్లులకు ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.

**ప్రశ్న : వేములవాడలో ఎలాంటి అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నారు**

**కొండా సురేఖ :** భక్తులు సమర్పించుకున్న కోడెల సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన రైతులకు 850 కోడెలను ఉచితంగా పంపిణీ చేశాం. కోటి రూపాయలతో అన్ని వసతులతో షెడ్ల నిర్మాణం, సిసి ఫ్లోరింగ్ నీటి సదుపాయం కల్పించతలపెట్టాం. విటిడిఏకి దేవాలయ అభివృద్ధి నిమిత్తం రూ.20కోట్లు విడుదల చేశాం. బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ బడ్జెట్‌లో రూ.50కోట్ల రూపాయలు విటిడిఎ అభివృద్ధికి కేటాయింపు చేశాం. మాస్టర్ ప్లాన్, క్యూ కాంప్లెక్స్, అన్నదానం బిల్డింగ్, ఆలయ పునర్నిర్మాణానికి దాతలు కూడా ముందుకు వచ్చారు. అందుబాటులో ఉన్న బంగారంతో రాజగోపురానికి బంగారు తాపడం చేయిస్తున్నాం.

**ప్రశ్న: భద్రాచలం దేవాలయం వద్ద రెండు రాష్ట్రాల మధ్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారంటున్నారు?**

**కొండా సురేఖ :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాం. దేవాలయానికి విస్తరణకు అదనంగా భూ సేకరణ కోసం ప్రభుత్వం రూ.60కోట్లు మంజూరు చేసింది. దాతలు ఇచ్చిన కోటి రూపాయల విరాళంతో భక్తులు నడిచే మార్గంలో నాణ్యమైన షెడ్లు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల కోసం రూ.3 కోట్లతో 'జానకీ సదనం'' 30 రూమ్‌లు నిర్మించ తలపెట్టాం. 500 కెవి సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం. దేవాలయం వద్ద భక్తుల సమస్యలపై ఎపి ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

**ప్రశ్న: వేల కోట్లు ఖర్చు చేసినా యాదగిరిగుట్టపై భక్తులు అవస్థలకు గురవుతున్నారని విమర్శలు వస్తున్నాయి కదా?**

**కొండా సురేఖ :** నిజమే.. యాదగిరిగుట్టలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసిందే తప్ప వాస్తవంగా దేవాలయం అభివృద్ధి జరగలేదు. భక్తుల సదుపాయాలు, అవసరాలను వారు పట్టించుకోలేదు. గుట్టపై భక్తులు నిమిషం సేపు నిల్చోవాలన్నా ఎలాంటి సౌకర్యాలు లేవు. తాజాగా భక్తులు కూర్చోడానికి ప్రత్యేక కట్టడాలు నిర్మిస్తున్నాం. వేసవిలో గుట్టపై నడవాలన్నా భక్తులు నరకం చూస్తున్నారు. వారికోసం ప్రత్యేకంగా జర్మన్ హ్యాంగర్స్ ద్వారా వేసవికాలంలో భక్తులకు ఉపశమనం కల్పిస్తాం. ప్రసాదాల కౌంటర్లను పెంచడంతో పాటు ఇక్కడ యుపిఐ ద్వారా చెల్లింపు సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రసాదాలు తీసుకున్న భక్తులు సేద తీరేందుకు ప్రత్యేక సదుపాయాలు సైతం కల్పిస్తాం. విష్ణుపుష్కరిణి, గిరిప్రదర్శన ప్రారంభిస్తున్నాం. అన్నదాన సత్రాలు కూడా నిర్మిస్తున్నాం. గుట్టపై భక్తులకు 24 గంటలు ఎల్‌సిడి ఏర్పాటు చేయడం ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించే సౌకర్యం కల్పిస్తున్నాం. యాదగిరిగుట్టపై త్వరలో 'అఖండ దీపం' ఏర్పాటు చేయనున్నాం. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి 60కిలోల బంగారంతో రాజగోపురానికి బంగారు తాపడం పనులు పూర్తవుతాయి. అన్నదాన సత్రాల కోసం ప్రత్యేకంగా హాల్స్ నిర్మిస్తున్నాం. యాదగిరిగుట్టపై సుమారు 500 మంది వరకు భక్తులు నిద్రించేందుకు ప్రత్యేక హాల్స్, లాకర్లు ఏర్పాటు చేస్తున్నాం.

## ప్రజాస్వామ్య పరిరక్షణ జనసేవాదళ్ కర్తవ్యం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
భాగం హేమంత్ రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో రోజు రోజుకు మతోన్మాద శక్తులు, అరాచక శక్తులు పెరిగిపోతున్నాయని.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ పరిరక్షణ కోసం జన సేవాదళ్ కార్యకర్తలు పాటుపడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం సభ్యులు భాగం హేమంత్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం, హిమాయత్‌నగర్‌లో జనసేవాదళ్ రాష్ట్ర సబ్ కమిటీ సమావేశం జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తుల ఉన్మాదం రోజురోజుకు పెరుగుతోందని, అరాచక శక్తుల ఆగడాలకు అంతులేకుండా హింస, ఉన్మాదం పెచ్చరిల్లిపోతున్నాయని అన్నారు. మహిళల మాన, ప్రాణ రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను శాస్త్రీయ దృక్పథం వైపు నడిపించవలసిన ప్రభుత్వాలు మూఢత్వంలోకి నెట్టివేస్తున్నాయని అన్నారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి జరుగుతున్నా రోజురోజుకు హింస నేరప్రవృత్తి పెరుగుతుందని అన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం కొరకు, క్రమశిక్షణతో కూడిన యువతరం కావాలి. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి అట్టడుగు వర్గాల హక్కులను కాలరాస్తుందన్నారు. దేశ సమైక్యత, సమగ్రతల కోసం, లౌకిక విలువల కోసం నేటి యువతరం కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగం మౌలిక పునాదులుగా ఉన్న ప్రజాస్వామ్యం ఫెడరలిజం సామాజిక న్యాయం, లౌకికత్వం నాలుగు మూల స్తంభాలను కాపాడుకోవాలని అన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో జన సేవాదళ్ పాత్ర చాలా కీలకమైనది. అలాంటి యువతను తయారు చేయుట కొరకు జనసేన రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరం నవంబర్ 25 నుండి నవంబర్ 30వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా కీసరలో నిర్వహించడం జరుగుతుంది. ఈ శిక్షణ తరగతుల విజయవంతం కోసం యువతీ యువకులు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గోషిక మోహన్, మారుపాక అనిల్ కుమార్, మేకల శ్రీనివాస్, కనుకుంట్ల శంకర్, కే.ధర్మేంద్ర, పుట్ట లక్ష్మణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలందరికీ డ్రగ్ టెస్ట్‌లు



పోలీసులకు రాజ్యసభ సభ్యులు
అనిల్ కుమార్ యాదవ్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలందరికీ డ్రగ్స్ టెస్ట్ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాద్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డ్రగ్స్ వ్యవహారం బయటకొచ్చిన ప్రతిసారి ఆ పార్టీ ఎంఎల్‌ఎలు బయటకి వచ్చి మాట్లాడుతున్నారని అన్నారు. సిగ్గు, శరం ఉంటే డ్రగ్స్ టెస్ట్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్ పాకాలా, విజయ్ మద్దూరిని వెనకేసుకు రావడానికి కెటిఆర్‌కు సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్ మద్దూరి కెటిఆర్ బినామీ అని అనిల్ యాదవ్ ఆరోపించారు. గత ప్రభుత్వం డ్రగ్స్ కేసును ఎలా దారి మళ్లించిందో అందరికీ తెలుసని అన్నారు. జన్వాడ ఫామ్ హౌస్ అంటేనే కాంట్రావర్సీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేస్తుంటే, వాళ్లు డ్రగ్స్‌ని ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణను కెసిఆర్ కుటుంబం ఏం చేయాలనుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్ పాకాల తనకు డ్రగ్స్ ఇచ్చారని విజయ్ ఒప్పుకున్నారని తెలిపారు.



## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై డిప్యూటీ సిఎం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర తహశీల్దార్ కార్యాలయం నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తయారుచేసిన ప్రణాళిక, సర్వే ఉద్దేశం, జిల్లా స్థాయిలో కలెక్టర్‌లు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను ఉపముఖ్యమంత్రి వివరించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామని అన్నారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతుందని, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను వారికి మెరుగుపర్చడానికి తగిన ప్రణాళికలు తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగిస్తామన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ అందించాలని, గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులను ఎంపిక చేయాలని అన్నారు. సర్వే షెడ్యూల్ వివరాలు ప్రజలకు చేరేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, తహశీల్దార్ రాంబాబు, మిషన్ భగీరథ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
ఈ.టి. నరసింహ డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ మహా నగరంలో నిత్యం పెరుగుతున్న మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని, రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారి విషకోరలపై ఉక్కుపాదం మోపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా జన్వాడ ఫామ్ హౌస్ డ్రగ్స్ వినియోగ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేసారు. మాదకద్రవ్యాల నిరోధానికి అనేక చట్టాలు ఉన్నప్పటికీ, రేవ్ పార్టీలు, పబ్‌లు, బార్లు, రిసార్ట్‌లు, హోటల్స్ లాంటి ప్రదేశాలలో డ్రగ్స్, గంజాయి ఇప్పటికీ చెలామణిలో ఉండడం ద్వారా రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదో స్పష్టమౌతున్నదని నరసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రగ్స్ పట్టుబడిన వారి కేసులలో సరైన ఆధారాలు, సాక్ష్యాలు కోర్టులలో ప్రవేశపెట్టడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నివారించడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని అయన విమర్శించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ హబ్‌గా గత ప్రభుత్వం మార్చివేసిందని నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ యువత మత్తులో తూలకుండా, బాధ్యతాయుత పౌరులుగా జాతి అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ప్రభుత్వం మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించడానికి కట్టుదిట్టమైన నియంత్రణ వ్యవస్థలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పిల్లలను, యువకులను డ్రగ్స్ ప్రభావానికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ప్రభుత్వాలపై ఉందన్నారు.

## జనగణనలో కులగణనకు కేంద్రంపై ఒత్తిడి

అన్ని రాజకీయ పార్టీలకు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ (హైదరాబాద్) :** వచ్చే ఏడాది జాతీయ స్థాయిలో నిర్వహించే జనగణనలో కులగణన కూడా చేపట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలు వచ్చే పార్లమెంట్ సమావేశంలో కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వంలోని భాగస్వామ్యపక్షాలతోపాటు ఆర్‌ఎస్‌ఎస్, కాంగ్రెస్, వామపక్షాలు, కుల సంఘాలు కులగణనకు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో సహ అనేక రాష్ట్రాల్లో కులగణన చేశారని గుర్తుచేశారు. జనగణనలో కులగణన చేయాలని, రైల్వే, ఎల్‌ఐసి, బిహెచ్‌ఇఎల్, బిడిఎల్, బ్యాంకింగ్, రక్షణ తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని డిమాండ్ చేస్తూ అన్ని రాజకీయ పార్టీలు ఏకమై వచ్చే పార్లమెంటు సమావేశంలో విస్తృతంగా చర్చించాలని కోరారు. కులగణనతో అన్ని కులాలకు జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా, కులాల కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు బడ్జెట్ కేటాయించి వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకొనే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బిసి ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నేతలు జిల్లపల్లి అంజి, లాల్ కృష్ణ, నందగోపాల్, కోలా జనార్దన్, పగిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కులగణనపై నేడు గాంధీ భవన్‌లో సమావేశం

హాజరుకానున్న సిఎం, డిప్యూటీ సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో బుధవారం ఉదయం 10:30 గంటలకు కులగణనపై సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, మంత్రులు, విప్‌లు, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డిసిసి అధ్యక్షులు హాజరు కానున్నారు. కులగణనపై లోతుగా చర్చించి, పార్టీపరంగా దీనిపై ఒక కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయించినట్లు టిపిసిసి తెలిపింది.

## కాంగ్రెస్ నాయకులు, మంత్రుల జేబుల్లోకి రాష్ట్ర ఆదాయం

సంక్షేమ పథకాల నుంచి తప్పుకునేందుకు ప్రభుత్వ ప్రయత్నం : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ నాయకులు, మంత్రులు తమ జేబులు నింపుకుంటున్నారని, అందుకే రాష్ట్ర ఆదాయం తగ్గిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఆదాయం తగ్గిందనే దొంగ ఏడుపులతో సంక్షేమ పథకాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కెటిఆర్ బావమరిది ఇంటిమీద దాడి చేసి ప్రభుత్వం తన పరువు తీసుకున్నదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రైతబంధు పూర్తిగా అమలు కాలేదని, మరోవైపు రాష్ట్ర ఆదాయంతో ఎవరు కడుపు నింపుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రతిఏటా ప్రభుత్వ ఆదాయం పెరగాలని, బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా 17 నుంచి 18 శాతం ఆదాయం పెరిగిందని, ప్రస్తుతం కూడా మరో వెయ్యి కోట్ల రూపాయల వరకు పెరగాల్సిన ఆదాయం ఎందుకు తగ్గిందని, ఏమైనా కరోనా వచ్చిందా అని మండిపడ్డారు. కరోనా కాలంలో కూడా ప్రభుత్వ ఆదాయం తగ్గలేదన్నారు. పేదలకు, రైతు రుణమాఫీకి,పెన్షన్‌దారులకు, మహిళలకు, రైతు కూలీలకు ఇస్తామన్న పైసలు, కాంగ్రెస్ మంత్రులు, నాయకుల జేబులోనికి పోతున్నాయని ఆరోపించారు. డిమాండ్‌కు సరిపడే విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదని, అందుకే విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యలు వస్తున్నాయని చెప్పారు. బాంబులు పేలడమంటే ప్రజలపై భారం మోపడమా అని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచకుండా తాము అడ్డుకున్నామని, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి రోడ్లను ప్రైవేటీకరించకుండా కూడా అడ్డుకుంటామని జగదీష్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసులు సమస్యల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాల్సిన ప్రభుత్వం, వారిని తొలగించడం అన్యాయమని చెప్పారు. సిఎం తన వద్ద ఉన్న స్పెషల్ పోలీసులను తొలగించి, ఆర్మడ్ పోలీసులను పెట్టుకున్నట్టు తెలిసిందని, ఒకవేళ వారు కూడా స్పెషల్ పోలీసుల తరహా వ్యవహరిస్తే వారిని కూడా తొలగించి, ఎపి పోలీసులను పెట్టుకుంటారా? అని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఎన్.బాల మల్లేష్




**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాల మల్లేష్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని యూనివర్సల్ మినీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అధ్యక్షతన ప్రజా సమస్యలుపరిష్కార మార్గాలు అనే అంశంపై డివిజన్ స్థాయి సెమినార్‌ను నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు గడుస్తున్నా నేటికీ అభివృద్ధి పూర్తి స్థాయిలో ఎక్కడా జరగలేదని అన్నారు. నేడు రాష్ట్రంలో రాజకీయాలు కులాల పేరు, మతాల పేరుపై జరుగుతున్నాయని, పేదలతో ఓట్లు వేయించుకొని కోట్లు గడిస్తున్నారని, ప్రజా సమస్యలను మాత్రం పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని వివరించారు. దేశ ప్రధాని నరేంద్రమోడి పేదల ఖాతాలో రూ.15వేలు వేస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి ఏమాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. దేశంలో బేటి పడావో..బేటి బచావో అని ఒకవైపు ప్రచారం చేస్తుంటే..మరోవైపు మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి పూర్తిగా ఎత్తి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందని వివరించారు.

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాటం చేసేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.2.61వేల కోట్లు కేటాయించి 200రోజులు పని దినాలు కల్పించాలని, కూలీకి ప్రతి రోజు రూ.700లు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అందుకు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయని, అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు పంపిణీ చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2500ఇవ్వడంతోపాటు పెంచిన ఫించన్లను త్వరగా పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన నిరుపేదలకు 120గజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు కృషి చేయాలని, రైతులందరికీ రుణమాఫీ చేయడంతోపాటు రూ.15వేలు రైతుబంధు సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎర్ర జెండా నేతృత్వంలో పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికే ఏకకాలంలో రుణమాఫీ రెండు లక్షలు చేశామని, త్వరలోనే పెండింగ్ పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి, సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి భాగాల నరసింహ, చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్, వ్యాకాస నాయకత్వం రమేష్, రాజు, కృష్ణ, రాములు, మంజుల, చిలకమ్మలతోపాటు కార్యకర్తలు ఉన్నారు.

**ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్ - కోస్గి**
నారాయణపేట్ జిల్లా.
**టెండర్ ప్రకటన**
టెండర్ నెం. KOSGI-STRS/STRS/STRS/5/2024, తేది: 28.10.2024
**టెండర్ వివరణ:** కోస్గి, జిఇసి వద్ద క్యాంటీన్ నడపడం, **బిడ్డింగ్ రకం:** ఓపెన్ టెండర్, **టెండర్ దాఖలుకు ప్రారంభం:** 18.11.2024న మ.3.00గం.ల నుండి, **టెండర్ డాక్యుమెంట్:** కోస్గి, జిఇసి, ప్రిన్సిపాల్ నుండి రూ.1000/- చెల్లించి టెండర్ డాక్యుమెంట్ పొందవచ్చు.
సం/- ప్రిన్సిపాల్,
ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్, కోస్గి
DIPR R.O. No. : 6002-PP/CL/ADVT/1/2024-25, Date: 29-10-2024

# ఫోకస్



## మొట్టమొదటి మహిళా శాస్త్రవేత్త

ఆధునిక చరిత్రలో మొట్టమొదటి మహిళా శాస్త్రవేత్తగా మేరీ క్యూరీ పేరును పేర్కొంటారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఆమె, ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి అందుకున్న తొలి మహిళగా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించింది. అంతేకాదు... రెండు వేర్వేరు విభాగాల్లో, రెండు పర్యాయాలు నోబెల్‌ను స్వీకరించిన ఘనత కూడా ఆమెదే. భౌతిక శాస్త్రం (ఫిజిక్స్)లో ఒకసారి, రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ)లో ఒకసారి ఆమెకు నోబెల్ పురస్కారం లభించింది. మొదటి నోబెల్‌ను ఆమె తన భర్త, ప్రఖ్యాత పరిశోధకుడు పియరీ క్యూరీతో పంచుకుంది. వారిద్దరికీ సంయుక్తంగా ఈ బహుమతిని అందచేశారు. నోబెల్‌ను సాధించిన తొలి భార్యాభర్తలు వీరే. ఇలావుంటే, మేరీ క్యూరీ రేడియాలజీలో అసాధారణ ప్రతిభ కనబరచింది. పరిశోధనలు చేసింది. ఎక్స్‌రే, రేడియో థెరపీతోపాటు న్యూక్లియర్ సైన్స్ ఆవిష్కరణ, ఆవిర్భావాలకు ఆమె ప్రయోగాలు పునాదులు వేశాయి. 'పొలోనియం', 'రేడియం' అనే రెండు రేడియోయాక్టివ్ ఎలిమెంట్స్‌ను కనిపెట్టింది. వీటిని వివరించడానికి 'రేడియోయాక్టివ్' అనే పదాన్ని ఆవిష్కరించింది. ఫ్రాన్స్‌లో పిహెచ్‌డి చేసిన మొదటి మహిళ ఆమె. ప్రసిద్ధ సోర్బోన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా సేవలు అందించే అవకాశాన్ని దక్కించుకున్న మొదటి మహిళగా కూడా రికార్డు సృష్టించింది. వార్సాలో వైద్య పరిశోధనా సంస్థను ఏర్పాటు చేసింది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మొబైల్ ఎక్స్‌రే యూనిట్లను నిర్వహించి, క్షతగాత్రులకు మెరుగైన సేవలు లభించడంలో కీలక పాత్ర పోషించింది. ఎన్నో విధాల ప్రత్యేకతలను చాటుకున్న మేరీ క్యూరీ మహిళా లోకానికి మార్గదర్శకురాలు.



## మహిళ





## నిద్ర లేచిన వెంటనే ఒంటి నొప్పులు!

చాలా మంది మహిళల్లో, ప్రత్యేకించి 40–45 సంవత్సరాలు దాటిన వారిలో, నిద్రలేవగానే ఒంటి నొప్పులు చాలా సహజం. విటమిన్ "డి" లోపం నుంచి ఊబకాయం వరకు ఈ సమస్యకు కారణాలు ఎన్నో. చాలా మందికి ఉదయం లేచిన వెంటనే శరీరంలోని కొన్ని భాగాల్లో నొప్పిగా ఉంటుంది. కండరాలలో నొప్పి, తీవ్రమైన తలనొప్పి లేదా శరీర నొప్పులు అనిపించినప్పుడు ఏ పని చేయడానికి ఇష్టం ఉండదు. ఓపిక కూడా ఉండదు. నిద్రలేచిన తర్వాత ఒంట్లో నొప్పులు ఉంటే మీ పరుపు, నిద్ర స్థానం, బరువు, నిద్ర రుగ్మతలు, అంతర్లీన ఆరోగ్య సమస్యలతో సహా ఎన్నో కారణాలు ఉన్నాయని గ్రహించండి. మీ శరీరంలో తగినంత విటమిన్ 'డి' లేనప్పుడు హైపోకాల్సెమియా లేదా రక్తంలో కాల్షియం తక్కువగా ఉండటం వల్ల ఈ సమస్య వస్తుంది. మీ మూత్రపిండాలు, కండరాలు వంటి మీ శరీరంలోని ఎన్నో ముఖ్యమైన అవయవాలు సరిగ్గా పనిచేయడానికి కాల్షియం చాలా అవసరం. మీ ఎముకలు ఆరోగ్యంగా ఉండటానికి కూడా కాల్షియం అవసరం. కాల్షియాన్ని గ్రహించడానపి మీకు తగినంత విటమిన్ 'డి' అవసరం. ఈ విటమిన్ లోపిస్తే ఈ అవయవాలలో, మీ ఎముకలలో నొప్పి కలుగుతుంది. కాగా, రక్తహీనత మరో కారణం. మీ శరీరం సక్రమంగా పనిచేయడానికి తగినన్ని ఎర్ర రక్త కణాలు లేనప్పుడు రక్తహీనత సమస్య వస్తుంది. అంటే మీ ఒంట్లో రక్తం తక్కువగా ఉంటుంది. కాబట్టి మీ శరీర కణజాలాలకు తగినంత ఆక్సిజన్ లభించదు. రక్తహీనతతో మీ శరీరంలోని చాలా భాగాలు అలసటకు గురవుతాయి. ఎందుకంటే ఇవి ఆరోగ్యంగా ఉండటానికి లేదా సరిగ్గా పనిచేయడానికి తగినంత ఆక్సిజన్‌ను పొందలేవు. అలసట, అసాధారణ హృదయ స్పందన రేటు, మైకం లేదా దిక్కుతోచని స్థితి, తల లేదా ఛాతీ నొప్పి, చల్లని పాదాలు లేదా చేతులు, పాలిపోయిన రంగు చర్మం వంటివి రక్తహీనత ఇతర లక్షణాలు. అధిక బరువు అనేది అనేక రుగ్మతలకు కారణం. అధిక బరువు సహజంగా వీపు, మెడపై ఒత్తి'డి'ని కలిగిస్తుంది. దీనివల్ల నొప్పి వస్తుంది. అధిక బరువు ఉండటం నిద్ర, శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయి. ఇది నిద్ర నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా నిద్రలేచిన తర్వాత ఒళ్లు నొప్పులు వస్తాయి. బరువు తగ్గితే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి పరుపులు మార్చాలని అంటారు. కానీ, మన దేశంలో ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోరు. ఆచరించరు. స్లీప్ ఫౌండేషన్ అధ్యయనం ప్రకారం నాణ్యతలేని పరుపుపై నిద్రపోవడం వల్ల కూడా ఒంటి నొప్పులు పెరుగుతాయి. అదే విధంగా నిద్రపోయే భంగిమ కూడా ఒక్కోసారి నొప్పులకు దారితీస్తుంది. ప్రత్యేక సందర్భాలను మినహాయిస్తే పక్కకు తిరిగి పడుకోవడం (సైడ్ స్లీపింగ్) చాలా ఉత్తమం. ముఖ్యంగా కలత నిద్రపోయే వారికి లేదా గాఢ నిద్రలేకుండా తరచు మెలుకవ వచ్చేవారికి ఈ విధంగా నిద్రించడం వల్ల ఉపశమనం ఉంటుంది.

**(ఇందులో ఇచ్చిన వివరాలు కేవలం సమాచారం కోసం మాత్రమే. సమస్య తీవ్రతను బట్టి వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించడం అవసరం)**

## వీరవనిత చిన్నమ్మకు అరుదైన గౌరవం

వీరవనితగా పేరు తెచ్చుకున్న కిత్తూరు రాణి చిన్నమ్మకు అరుదైన గౌరవం లభించింది. లభించింది. కిత్తూరు విజయోత్సవ 200 వార్షికోత్సవం సందర్భంగా ఆమె స్మారక తపాలా బిళ్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కిత్తూరు కోట ఆవరణలోనే నిర్వహించడం విశేషం. ఇంతకు ముందు 1977 అక్టోబర్‌లో ఆమె స్మారక తపాలా బిళ్ల విడుదైంది. ఇప్పుడు మరోసారి ఆమె పేరిట స్టాంప్‌ను విడుదల చేశారు. కర్నాటకలోని మెలగావి జిల్లా, కాకతి అనే కుగ్రామంలో చెన్నమ్మ జన్మించింది. దేశాయ్ కుటుంబానికి చెందిన రాజా మల్లా సర్జను వివాహం చేసుకోవడం ద్వారా ఆమె కిత్తూరు రాణి అయింది. 1816లో మల్లా సర్జ మరణానంతరం అతని పెద్ద కుమారుడు శివలింగరుద్ర సర్జా సింహాసనాన్ని అధిష్టించాడు. ఆయన తన మరణానికి ముందు శివలింగప్ప అనే బాలుడిని దత్తత ఈసుకున్నాడు. 1824లో అతనినే కిత్తూరుకు వారసుడిగా ప్రకటించాడు. అయితే, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ శివలింగప్పను రాజ్యానికి వారసుడిగా గుర్తించడానికి నిరాకరించింది. అంతేగాక, కిత్తూరును స్వాధీనం చేసుకోవడానికి చర్యలు ప్రారంభించింది. 1824 అక్టోబర్‌లో, ధార్వాడ్‌లోని బ్రిటిష్ అధికారి, కలెక్టర్ జాన్ థాకరే నేతృత్వంలో కిత్తూరుపై దాడి జరిగింది. ఈ యుద్ధంలో రాణి చెన్నమ్మ స్వయంగా సేనలకు నాయకత్వం వహించింది. వీరోచితంగా పోరాడింది. ఫలితంగా బ్రిటిష్ దళాలు చిత్తుగా ఓడిపోయాయి. థాకరేను కిత్తూరు దళాలు హతమార్చాయి. ఇద్దరు బ్రిటిష్ అధికారులు, సర్ వాల్టర్ ఇలియట్ , స్టీవెన్సన్‌లను బందీలుగా పట్టుకున్నాయి. ఆ తర్వాత కొద్ది కాలానికే కిత్తూరుపై ఈస్ట్ ఇండియా సేనలు మరోసారి దాడికి దిగాయి. ఆ యుద్ధంలో చెన్నమ్మ ఓడిపోగా, ఆమెతోపాటు ఆమె కుటుంబ సభ్యులను కూడా ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులు బందీలుగా పట్టుకున్నారు. బైల్హోంగల్ జైలులో ఖైదు చేశారు. అక్కడే ఆమె 1829లో మరణించింది. మొదటి కిత్తూరు యుద్ధంలో చెన్నమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు కీర్తిస్తూ, ఏటా అక్కడి కోట ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ విజయం సాధించి రెండు వందల సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ఆమె స్మారక తపాలా బిళ్ల విడుదలైంది.







## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- భారతదేశంలోని అతిపెద్ద జలపాతానికి పేరు.
  కుంచికల్ జలపాతం
- భారతదేశంలో అతిపెద్ద నదీ పరీవాహక ప్రాంతం ఏది?
  గంగా బేసిన్
- ఏదైనా మూడు హిమాలయ నదీ వ్యవస్థను పేర్కొనండి
  సింధు, గంగ, బ్రహ్మపుత్ర
- పువ్వు యొక్క బయటి భాగాన్ని ఏమంటారు?
  సెపాల్
- కుంకుమ పువ్వు ఏ పువ్వు నుండి వచ్చింది?
  బెండకాయ
- ఏ పువ్వులు ఉల్లిపాయలను వంటలో మసాలాగా మార్చగలవు?
  తులిప్స్
- అరటి మొక్కలు ఏ పువ్వులకు సంబంధించినవి?
  స్వర్గపు పక్షులు3
- గతంలో జిగురు చేయడానికి ఏ పూల రసాన్ని ఉపయోగించారు?
  బ్లూబెల్ ఫ్లవర్
- మాగ్నోలియాస్ ఎవరి పేరు పెట్టారు?
  పీటర్ మాగ్నోలియా
- నేల కంటే గాలి నుండి అవసరమైన పోషకాలను ఏ పువ్వు తీసుకుంటుంది?
  ఆర్కిడ
- పువ్వుల మగ భాగాలను ఏమంటారు?
  కేసరాలు
- పువ్వులలోని స్త్రీ భాగాలను ఏమంటారు?
  కార్పెల్స్
- ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?
  నైలు నది
- మోనాలిసాను ఎవరు చిత్రించారు?
  లియోనార్డో డా విన్సీ
- దక్షిణ కొరియాలో అతిపెద్ద టెక్నాలజీ సంస్థ పేరు ఏమిటి?
  శామ్సంగ్
- నీటికి రసాయన చిహ్నం ఏది?
  $H_2O$
- మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?
  చర్మం
- సంవత్సరంలో ఎన్ని రోజులు ఉంటాయి?
  (లీపు సంవత్సరంలో 366)
- పూర్తిగా మంచుతో చేసిన ఇంటి పేరు ఏమిటి?
  ఇగ్లూ
- పోర్చుగల్ రాజధాని ఏమిటి?
  లిస్బన్
- టెలిఫోన్‌ను ఎవరు కనుగొన్నారు?
  అలెగ్జాండర్ గ్రాహం బెల్.
- ఫ్రాన్స్ రాజధాని ఏది?
  పారిస్.
- 'టు కిల్ ఎ మోకింగ్ బర్డ్ అనే నవల ఎవరు రాశారు?
  హార్పర్ లీ.
- మొదటి మనిషి చంద్రునిపై ఏ సంవత్సరంలో నడిచాడు?
  1969.
- ఇనుముకు రసాయన చిహ్నం ఏది?
  ఫె.
- ప్రపంచంలోనే అతి పెద్ద సముద్రం పేరు ఏమిటి?
  పసిఫిక్.

# వెంటనే ట్రైకార్ నిధులు విడుదల

### గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యానాయక్ డిమాండ్






రంగారెడ్డి...

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ నిధులను వెంటనే విడుదల చేసి, నూతన యాక్షన్ ప్లాన్ వెంటనే ప్రకటించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమావత్ అంజయ్యానాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి జర్పుల శివనాయక్ అధ్యక్షతన రాష్ట్ర సమితి పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గిరిజన సమస్యలపై నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందిజేశారు. కార్యక్రమంలో అంజయ్యానాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 265 కోట్ల రూపాయలు 32,122 మంది లబ్ధిదారులకు గిరిజన కార్పొరేషన్ ట్రైకార్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశారని తద్వారా గిరిజనులు ప్రభుత్వం తరఫున వచ్చే బ్యాంకు లోన్లు సబ్సిడీలకు నాలుగు సంవత్సరాల నుంచి దూరమయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఎటువంటి యాక్షన్ ప్లాన్ లేనందున గిరిజనులు ఎంతో నష్టపోయారని వెంటనే నూతన యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ గిరిజనుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తండాలలో గూడెంలలో నివసిస్తున్న పేద గిరిజను లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సబ్సిడీ రుణాలు ఉపయోగపడతాయని గ్రామాలలో స్వయం ఉపాధి చేసుకొని బతకడానికి అవకాశం ఉంటుందని సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి యాక్షన్‌ప్లాన్ ప్రకటించి, పెండిం గ్ ట్రైకార్ రుణాల నిధులను విడుదల చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ముకుందం గారి చంద్రశేఖర్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఏ,రాజు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు గూగులోత్ శంకర్ నాయక్,జిల్లా నాయకులు వడ్యా శంకర్ నాయక్, మూడావత్ లోక్యా నాయక్, సరిలాల్ నాయక్, చత్రు నాయక్, జాజాల అంజయ్య, సారయ్య, రవి నాయక్, తిరుపతి నాయక్, టీక్య నాయక్, శ్రీలత, భారతి తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ నిధులను విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి బోడ వీరన్న, నాయకులు రాంకోటి, రాంబాబు, శ్రీను, రమేష్, రామకృష్ణ, వీరన్న, రామోజీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాచలం :** ట్రైకార్ నిధులు విడుదల చేసి యాక్షన్ ప్లాన్ వెంటనే ప్రకటించాలని గిరిజన సమాఖ్య జిల్లా బాధ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సోంది కుటుంబరావు, గోవింద్, లక్ష్మయ్య, నగేష్, సత్యనారాయణ, చందర్, వెంకటేశ్వర్లు, శంకర్, నరేష్, శ్రీనివాస్, జానకిరామ్, విజయ్, రమేష్, శివాజీ, చక్రవర్తి పాల్గొన్నారు.



మేడ్చల్



నల్లగొండ...



భద్రాచలం...



ఖమ్మం...



హన్మకొండ..

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి రాజుగౌడ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధంకావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈనెల 31న ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలను జిల్లాలో జయప్రదం చేయాలని ఆయన కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎఐటియుసి జిల్లా అద్యక్షుడు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన జరిగిన జిల్లా సమితి సమావేశంలో జక్కు రాజు గౌడ్, అధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడారు. ఎఐటియుసి ఆవిర్భావ వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్నికార్మిక అడ్డాల వద్ద జెండా ఆవిష్కరణలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు రామ రాజేష్‌కన్నా, బత్తిని సదానందంగౌడ్, ధర్ముల రామ్మూర్తి, గుంటి రాజేందర్, ఆర్.పూర్ణచందర్, రేణిగుంట్ల దుర్గాప్రసాద్, లంక దాసరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల ఫలితంగా కార్మికులకు లాభాల్లో వాటా : ఎఐటియుసి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో ఎఐటియుసి పోరాటాల ఫలితంగా కార్మికులకు లాభాల్లో వాటా లభించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్లో జరిగిన ఎఐటియుసి సమావేశంలో వారు మాట్లాడారు. అక్టోబర్ 31న సెలవు ఉన్నందున అక్టోబర్ 30న ఎఐటియుసి ఆవిర్భావ వేడుకల సందర్భంగా గనులు, డిపార్ట్మెంట్ల వద్ద ఎఐటియుసి పతాకాలను ఎగురవేయాలన్నారు. సమావేశంలో మాదన మహేష్, పర్లపెల్లి రామస్వామి, ఉప్పులేటి తిరుపతి, తాళ్ళపెల్లి శ్రీనివాస్, ఆశాల సారయ్య, గుంపుల కుమారస్వామి, తాళ్ళపెల్లి సురేందర్, వినయ్ కుమార్, ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి : రాములు

**ప్రజాపక్షం /సిరిసిల్ల :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియూసి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. మంగళవారం ఎఐటియూసి భవన నిర్మాణ కార్మిక అనుబంధ సంఘం ఆధ్వర్యంలో లేబర్ అడ్డాపై ఉన్న కూలీలతో కలిసి ఆయన మాట్లాడారు. వలస కూలీలతో స్థానిక కార్మికులకు ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కమిషనర్ గంగాధర్‌కు సోమవారం వినతిపత్రం ఇవ్వడంతో తక్షణ మే ఆయన స్పందించి ఒపెన్ చేస్తామని, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తామని రెన్యువల్ చేయాల్సిన కార్డులు రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, కలికోట దేవదాసు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

### సిపిఐ భద్రాచలం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా కోరారు. సుజాతనగర్ మండల కేంద్రంలో లైసెన్సు పత్తి కొనుగోలు కేంద్రాలను మంగళవారం అయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే అనుమతి పొందిన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని, కేంద్రం నిర్వాహకులు ఎలాంటి అవకతవకలకు పాల్పడొద్దన్నారు. కేంద్రాలకు తీసుకువచ్చిన పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నాణ్యత పేరుతో మోసానికి పాల్పడితే ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, భూక్య దస్రు, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, మల్లేష్, భూక్యా శ్రీను, గణేష్, దండు సురేష్, భీమ్లా, చంటి, కృష్ణ పాల్గొన్నారు.

## హక్కులు సాధించిన చరిత్ర ఎఐటియుసిదే

### మేకల దాసు




**ప్రజాపక్షం/మంచిర్యాల :** కార్మికులకు హక్కులు సాధించన ఘనత ఎఐటియుసిదేనని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. మంగళవారం ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మేకల దాసు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఏర్పడి దేశంలో కార్మిక వర్గానికి అనేక హక్కులు సాధించి పెట్టిన చరిత్ర ఎఐటియుసిదేనని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయినా ఇప్పటికీ దేశ సంపద కొద్ది మంది చేతుల్లో మాత్రమే ఉంటుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం, దేశంలో ఉన్న సహజ సంపదలను ప్రైవేటు వారికి అప్పగించడం వల్ల దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. సంపద సృష్టికర్తలు కార్మికులు అవుతున్నారని, ఆ కార్మికులకు హక్కులు లేకుండా ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, ముస్కే సమ్మయ్య, కార్యదర్శి ఖలిందర్ ఆలీ ఖాన్, దాగం మల్లేష్, కోశాధికారి తోకల సరస్వతి పాల్గొన్నారు.

# భారత్—చైనా సేనల తుది దశలో ఉపసంహరణ ప్రక్రియ



న్యూఢిల్లీ : తూర్పు లడఖ్‌లోని రెండు ఘర్షణాత్మక ప్రాంతాలనుండి భారత్ - చైనా సేనల ఉపసంహరణ ప్రక్రియ తుదిదశకు చేరుకుందని అధికారవర్గాలు మంగళవారంనాడు ప్రకటించాయి. ఈ రెండు ప్రాంతాల నుండి మాత్రమే సేనలను వెనక్కు మళ్ళించేందుకు ఒప్పందం జరిగింది. ఇతర ప్రాంతాల నుండి కూడా సేనలను వెనక్కు మళ్ళించే ప్రక్రియపై చర్చలు కొనసాగుతున్నాయి. డెమ్చోక్, డెస్పాంగ్ మైదాన ప్రాంతాల నుండి రెండు దేశాల సేనలూ పూర్వస్థానాలకు చేరుకుంటున్నాయి. ఇరుదేశాల చర్చల్లో కుదిరిన అంగీకారానికి అనుగుణంగా అక్టోబరు 25న సేనల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. నిర్ణీత ప్రకారం మంగళవారంనాటికి ఈ ఉపసంహరణ కార్యక్రమం పూర్తి కావాల్సి ఉంది. ఈ ఉపసంహరణ ప్రక్రియకు సంబంధించిన ఒప్పందం మొదట రెండు దేశాలమధ్య దౌత్యస్థాయిలో జరిగింది. సేనల ఉపసంహరణకు సంబంధించిన ఆచరణాత్మక పరిస్థితుల గురించిన ఒప్పందంపై సైనిక కమాండర్లస్థాయిలో చర్చల కసరత్తు పూర్తిచేశారు. గతవారంలోనే ఈ ఒప్పందంపై వారు సంతకాలు చేశారు. ఈ ఒప్పంద లక్ష్యాలకు అనుగుణంగా ఇరు దేశాల సేనలూ తమ తమ పూర్వ స్థానాలకు వెనక్కు వెళ్ళిపోతున్నాయి. ఘర్షణ చెలరేగిన డెమ్చోక్, డెస్పాంగ్ ప్రాంతాలను సేనలు ఖాళీచేయడం దాదాపు పూర్తయింది. ఇరు సైన్యాలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లు, గుడారాలు ఇతర నిర్మాణాలను తొలగించి పూర్తిగా పూర్వప్రదేశాలకు చేరుకున్న తర్వాత డెమ్చోక్, డెస్పాంగ్‌లలో 2020 ఏప్రిల్‌నెలకు పూర్వం ఉన్నస్థాయిలో గస్తీ కార్యకలాపాలు పునఃప్రారంభం అవుతాయి. 2020 జూన్‌నెలలో గాల్వాన్ లోయలో భారత్—చైనా సైనికులమధ్య ఆటవికుల తరహాలో ముష్టిఘాతాలతో తీవ్ర ఘర్షణ జరిగింది. ఆ తర్వాత రెండు దేశాలమధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. దశాబ్దాల తర్వాత రెండు దేశాలూ సరిహద్దులవెంబడి సైన్యాలను మోహరించాయి. ఐతే ఈనెల 21వ తేదీన భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రి మీడియాతో మాట్లాడుతూ, ఆ సమస్యపై గడచిన అనేక వారాలుగా రెండు దేశాలమధ్య సంప్రదింపులు జరిగాయని,ఆ సంప్రదింపుల్లో ఒక ఒప్పందాన్ని ఖరారు చేశామని చెప్పారు. ఆ తర్వాత రెండు రోజులకు అక్టోబరు 23న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రష్యాలోని కజన్‌లో జరిగిన 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యారు. అక్కడ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో జరిగిన ద్వైపాక్షిక సంభాషణల్లో వాస్తవాధీన రేఖ వద్ద గస్తీ, సేనలను పూర్వపు స్థావరాలకు వెనక్కు మళ్ళించే విషయంపై ఒక అంగీకారం కుదరడంతో ఆ మరునాడే రెండు దేశాల సేనల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది.

# పునరావాస కల్పనలో నిర్లక్ష్యం

## కేంద్ర ప్రభుత్వంపై ప్రియాంకాగాంధీ మండిపాటు



వయనాడ్ : కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకా గాంధీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇటీవల వయనాడ్ జిల్లాలో కొండ చరియలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. పలు ఊర్లపై తీవ్ర ప్రభావం పడగా, కొన్ని ఊర్లు నామరూపం లేకుండా పోయాయి. అయినప్పటికీ నిధులు ఇవ్వకుండా వారికి పునరావసం కల్పించడంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం వహించిందని ఆమె మండిపడ్డారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న వైఖరి ప్రజలకు, దేశం పట్ల గౌరవం లేకపోవడాన్ని సూచిస్తోందని, గత 10 ఏళ్ల పాలనలో చేసిన విధానాలను బట్టి కూడా అదే స్పష్టమవుతోందని ప్రియాంక అన్నారు. మంగళవారం ప్రియాంక ఎంగపుఝా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. నోట్ల రద్దు సహా మోదీ ప్రభుత్వ విధానాలు అన్ని కూడా తన మిత్రులైన ఐదారుగురు వ్యాపారవేత్తలకు అనుకూలంగా ఉన్నాయని, ప్రజలకు లబ్ధి చేకూర్చేలా ఏవీ లేవని ఆరోపించారు. వయనాడ్ కొండచరియల ఘటనను ప్రస్తావిస్తూ ప్రధాని జిల్లాలో పర్యటించి ప్రజలకు అన్ని రకాలుగా సహాయం చేస్తామని హామీనిచ్చారన్నారు. నెలల గడిచినప్పటికీ ప్రభావిత ప్రజలకు పునరావాసం కల్పించేందుకు ఎలాంటి నిధులు సమకూర్చలేదని మండిపడ్డారు. రైతుల పట్ల మోదీ ప్రభుత్వం ఏ మాత్రం కనికరం చూపడం లేదని, దేశ వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. పైగా ప్రజా అవసరాలకు కాకుండా భూములను బడా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా ఉపాధి, విద్య, ఆరోగ్య సంరక్షణ సహా ఇతర ముఖ్యమైన ప్రాంతాలను మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశ ప్రజల పట్ల మోదీ ప్రభుత్వం పూర్తిగా మర్యాదలేకుండా వ్యవహరిస్తుందన్నారు. ప్రజల గౌరవాన్ని కోల్పోతే, దేశ గౌరవాన్ని కోల్పోతారని హితవు పలికారు. నేడు దేశంలో రాజకీయాలు ప్రబలమైనవని, కేవలం అధికారమే లక్ష్యంగా పెట్టుకున్నారని ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం మారాల్సిన అవసరం ఉన్నదని ఆమె చెప్పారు. దాదాపు ఏడాదిపాటుగా మణపూర్‌లో కొనసాగుతున్న హింసను కూడా ఆమె ప్రస్తావించారు. ఏ విధంగానైనా అధికారంలో ఉండటానికి ప్రయత్నించడం 'తప్పుడు రాజకీయం' అని ప్రయాంకా అన్నారు. కార్నర్ మీటింగ్‌కు ఇక్కడ గుమిగూడిన వందలాది మందిని ఉద్దేశించి మాట్లాడుతూ తన సోదరుడి ప్రతిష్టను దిగజార్చడానికి భారీ ప్రచారం ప్రారంభించిన సమయంలో అతనికి మద్దతు ఇచ్చినందుకు, ఓటు వేసినందుకు తాను, తన కుటుంబం వయనాడ్ ప్రజలకు రుణపడి ఉంటామని కాస్త భావోద్వేగానికి గురయ్యారు. వయనాడ్ ప్రజలకు, రాహుల్ గాంధీకి మధ్య ఏర్పడిన ప్రేమ, విశ్వాసం, విధేయత అనే బంధానికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని, అందుకే ఆ నియోజకవర్గాన్ని వదులుకోవాల్సి వచ్చినప్పుడు చాలా బాధపడ్డారని ఆమె అన్నారు. కేంద్రంలో కానీ, కేరళలో కానీ కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా వయనాడ్ ప్రజల సమస్యలను పార్లమెంటులో లేవనెత్తుతానని ప్రియాంక అన్నారు.

# డ్రగ్స్ తయారీ ల్యాబ్ గుట్టురట్టు..

## 95 కిలోల మాదకద్రవ్యాల పట్టివేత

న్యూఢిల్లీ : రహస్యంగా డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టయింది. నార్కోటిస్క్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) అధికారులు గౌతమ్‌బుధ్ నగర్ జిల్లా కాసన ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం దాడులు జరిపి మెథాంఫెటమైన్ డ్రగ్‌ను రహస్యంగా తయారు చేస్తున్న ల్యాబ్‌ను గుర్తించారు. 95 కిలోల మెథాంపెటమైన్ డ్రగ్‌ను ఘన, ద్రవరూపంలో పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులను ఎన్‌సిబి అరెస్టు చేసినట్టు డిడిజి (ఆపరేషన్స్) జ్ఞానేశ్వర్ సింగ్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, రెయిడ్స్ సమయంలో ఫ్యాక్టరీలో ఉన్న ఢిల్లీకి చెంది ఒక వ్యాపారి తీహార్ జైల్ వార్డెన్‌తో కలిసి ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అనధికారికంగా గత కొన్నేళ్లుగా ఈ ఫ్యాక్టరీ నడుపుతున్నట్టు గుర్తించారు. గతంలో డ్రగ్స్ సరఫరా కేసులో ఢిల్లీ వ్యాపారి అరెస్టయ్యాడని, తీహార్ జైలులో అతను ఉన్నప్పుడు జైలు వార్డెన్‌తో కలిసి ఒప్పందం చేసుకుని డ్రగ్స్ తయారీ ల్యాబ్‌ను రహస్యంగా ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు. మెథాంఫెటమైన్ డ్రగ్ తయారీకి అవసరమైన కెమికల్స్‌ను వివిధ మార్గాల ద్వారా ల్యాబ్ సేకరించి, మెషనరీని దిగుమతి చేసుకున్నట్టు కూడా అధికారులు గుర్తించారు. కాగా, పట్టుబడిన 95 కిలోల డ్రగ్స్ విలువ వందల కోట్లలో ఉంటుందని చెబుతున్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఉద్యోగాలు: మోదీ



న్యూఢిల్లీ : యువతలో ప్రతి ఒక్కరికి అవకాశం లభించే విధంగా, వారి ఆకాంక్షలు పరిపూర్తి చేసుకు నే వ్యవస్థను సృష్టిస్తున్నామని ప్రధా న మంత్రి నరేంద్రమోదీ అన్నారు. అత్యధిక యువతకు ఉద్యోగాలు కల్పించాలనే తమ ప్రభుత్వ నిబద్ధతతకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. సుమారు 51వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప త్రాల ను అందించిన అనంతరం 'రోజ్‌గార్ మేళా'లో ప్ర ధాని ప్రసంగిస్తూ తమ ప్రభుత్వం అంతరిక్షం, సె మీ కండక్టర్ తదితర నూతన టెక్నాలజీలు, ఆధునిక రంగాలలో నూతన అవకాశాలు లభించే వి ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్ర భుత్వాలకు ఒక పాలసీ, ఉద్దేశం లేకపోవడంతో ప్ర పంచంలో ఎదిగే రంగాలలో భారతదేశం వెనుకబడిందని వీడియో సందేశంలో మోదీ పేర్కొన్నారు. పాత, కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి తీసుకువచ్చేవారని, ఆధునిక సాంకేతికత దేశాన్ని అభివృద్ధి చేయలేదనే ఆలోచన ధోరణి ఉండేదని అన్నారు. ఈ ఆలోచన విధానం ఎంతో హానికరమైనదని, ఆధునిక ప్రపంచంలో ఉద్యోగా లు కల్పించే పరిశ్రమలు మనదేశంలో లేకపోతే కొత్త అవకాశాలను సృష్టించడం కష్టమన్నారు. 20 22లో రోజ్‌గార్ మేళా ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 7.5 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలు ఇచ్చినట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్ హైవేలు, హైవేలు, ఓడరేవులు, రైల్ నెట్‌వర్క్‌లు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టు చేపట్టడం ద్వారా భారీగా ప్రజలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. భారతీయ యువతకు ఉద్యోగాలు ల భించేలా మన దేశం 21 దేశాలకు ఇమ్మిగ్రేషన్ ఒ ప్పందాలను కుదుర్చుకున్నదన్నారు. ప్రపంచవ్యాప్తంగా చెప్పుకునే విధంగా మన ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరించాలని, వారు పాలకులు కాదు సేవలు అని మోదీ అన్నారు.

# అధికారం కోసం కుటుంబాన్ని చీల్చుతారా?

## అజిత్‌పవార్‌పై శరద్ పవార్ ఆగ్రహం

బారామతి: మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్‌పై ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బారామతిలో ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థి యుగేంద్ర పవార్ తరఫున ప్రచారంలో పాల్గొన్న శరద్ పవార్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కుటుంబంలో విభేదాలు తలెత్తకుండా సీనియర్లు వ్యవహరించాలంటూ అంతకుముందు అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడాన్ని తన తల్లిదండ్రులు, సోదరులు ఎప్పుడూ తనకు నేర్పించలేదని..అనంతరావు పవార్ (అజిత్ పవార్ తండ్రి) సహా తన సోదరులందరితో కలిసి ఒకే కుటుంబంగా నివసించానని అన్నారు. తన సోదరుల సహకారంతోనే పూర్తి స్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టగలిగానని..వారి పిల్లల పట్ల ఎప్పుడూ వివక్ష చూపలేదని ఆయన అన్నారు. పార్టీలో ఉన్న పలువురు నేతలకు ఉన్నత పదవులు ఇచ్చినా..తన కుమార్తె సుప్రియా సూలేకు ఒక్క పదవి కూడా అప్పగించలేదని పేర్కొన్నారు. తాను స్థాపించిన ఎన్‌సిపి గుర్తును తనకు కాకుండా చేసి కోర్టుకు లాగారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సార్లు పదవిలో ఉండి..ఒక్కసారి పదవి లేకపోతే దానికోసం కు టుంబాన్ని చీల్చుతారా? అని అజిత్ పవార్ ప్రశ్నించారు. 'ఇప్పు డు నేను కుటుంబాన్ని విచ్ఛిన్నం చేశానని అంటున్నారు. ఇది వి నడానికి చాలా తమాషాగా ఉంది. కుటుంబంలోని ఎవరు ఏ నిర్ణయం తీసుకున్నా వారి ఇష్ట ప్రకారం నడుచుకొమ్మని చెప్తానే కానీ వ్యతిరేకించను. నా కుటుంబం ఎప్పుడూ ఐక్యంగా ఉండాలని అనుకుంటాను. గతంలో మహారాష్ట్రను ముందుకు నడిపించే బాధ్యతను ప్రజలు నాకు అప్పగించారు. ప్రస్తుతం నేను మార్గదర్శకుడిని మాత్రమే కొత్త తరానికి పార్టీ వ్యవహారాలను అప్పగించాను. మేము అధికారంలో లేనపుడు మా కుటుంబసభ్యులు మమ్మల్ని వదిలి వెళ్లారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశ లో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

# స్థిర, చరాస్తులు ప్రకటించిన అజిత్ పవార్

## మొత్తం విలువ రూ.45.37 కోట్లు



పుణె : మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ (65) తన స్థిర చరాస్తులను ప్రకటించారు. వాటి మొత్తం విలువను రూ.45.37 కోట్లుగా పేర్కొన్నారు. తన చరాస్తుల విలువ రూ.8.22 కోట్లు కాగా, తన స్థిరాస్తుల విలువ రూ.37.15 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. నవంబరు 20వ తేదీన మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. దాంతోపాటు ఆస్తుల వివరాలు కూడా ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు. పుణె జిల్లా కేంద్రంలో ఆయన ఈ అఫిడవిట్ అందజేశారు. దీని ప్రకారం, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ (ఎన్‌సిపి) నాయకుడైన అజిత్ పవార్‌కు ఒక టయోటా కామ్రీ, మరో హోండా సిఆర్‌వి కారు ఉన్నాయి. ఒక ట్రాక్టరు, వెండి వస్తువులు, ఫిక్సెడ్ డిపాజిట్లు, షేర్లు, బాండ్లు కూడా ఉన్నాయి. టర్ఫ్ నియోజకవర్గం నుండి ఎనిమిదోసారి ఆయన ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. సోమవారంనాడు ఆయన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన భార్య సునేత్ర పవార్ రాజ్యసభ సభ్యురాలు. ఆమెకు రూ.14.57 కోట్లు విలువైన చరాస్తులున్నాయి. మరో రూ.58.39 కోట్లు విలువై స్థిరాస్తులున్నాయి. ఈ ఎన్నికల్లో అజిత్ పవార్‌కు ప్రధాన పోటీదారుడు ఆయన మేనల్లుడు యోగేంద్ర పవార్. ఆయన ఎన్‌సిపి (శరద్ పవార్) తరపున ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. మొదటిసారి ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. యోగేంద్ర పవార్ కూడా సోమవారంనాడే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన చరాస్తులను రూ.39.79 కోట్లుగా, స్థిరాస్తులను రూ.10.79 కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు.

# కేరళలో బాణసంచా పేలుడు

తిరువనంతపురం: కేరళ రాష్ట్రం కాసర్‌గోడ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఓ ఆలయంలో ఉత్సవం జరుగుతుండగా బాణసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు జరిగాయి. ఈ ప్రమాదంలో 150 మంది గాయపడగా 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంజోతంబలం వీరర్కపు ఆలయంలో కాళియాట్లం ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయానికి కూతవేటు దూరంలోనే బాణసంచా ఫ్యాక్టరీ ఉంది. బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఉత్సవానికి వచ్చిన భక్తులకు మంటలు అంటుకోవడంతో 150 మందిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

# ఒక్కరైతును కూడా భూముల నుండి వెళ్ళగొట్టం

## వక్ఫ్ వివాదంపై సిద్ధరామయ్య వివరణ



బెంగళూరు : తమ భూములను కూడా వక్ఫ్ భూముల పరిధిలో చేర్చారన్న ఆరోపణలతో కర్ణాటక విజయపురిలో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు వివరణ ఇచ్చారు. ఒక్కరైతు నుండి వారి భూముల నుండి వెళ్ళగొట్టబోమని, రైతులకు ఇచ్చిన నోటీసులను వెనక్కు ఉపసంహరించుకుంటామని భరోసా ఇచ్చారు. ''ఒక్కరైతును కూడా వారి భూమి నుండి బయటకు వెళ్ళగొట్టం, నిన్న రెవెన్యూమంత్రి కృష్ణ బైర్ గౌడ, పరిశ్రమలమంత్రి, విజయపురిజిల్లా ఇన్‌ఛార్జిమంత్రి ఎం.బి.పాటిల్, వక్ఫ్ మంత్రి జమీర్ అహ్మద్ కాన్‌లు సంయుక్తంగా ప్రకటన చేస్తూ విజయపురిలో ఒక్క రైతును కూడా భూముల నుండి వెళ్ళగొట్టబోమని వివరణ ఇచ్చారు'' అని సిద్ధరామయ్య గుర్తుచేశారు. ముఖ్యమంత్రి మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ, ఒకవేళ రైతులకు ఎలాంటి నోటీసులైనా బట్వాడా చేసినట్లయితే ఈ నోటీసులను ఉపసంహరించుకుంటామని కూడా భరోసా ఇచ్చారు. యాద్గిర్, ధ్వాడ్‌జిల్లాలలో రైతులకు నోటీసులు ఇచ్చారని ఒక పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానమిస్తూ, ''నేను రెవెన్యూ మంత్రిని వివరణ అడుగుతాను, ఆ విషయాన్ని పరిశీలిస్తాను, ఏ ఒక్క రైతును కూడా భూముల నుండి వెళ్ళగొట్టబోం'' అని హామీ ఇచ్చారు. తికోటా తాలూకాలోని హనోవదలో ఉన్న 1,200 ఎకరాల బూమిని వక్ఫ్ భూములుగా గుర్తులుపెట్టారన్న విషయంపై గందరగోళం ఏర్పడింది. ఈ విషయంపై విరణ కోరినప్పుడు ఇటీవల కర్ణాటక రెవెన్యూమంత్రి ఎం.బి.పాటిల్ మాట్లాడుతూ, గెజిట్ నోటిఫికేషన్‌లో తప్పు దొర్లిందని వివరణ ఇచ్చారు. 1,200 ఎకరాలలో 11 ఎకరాలు మాత్రమే వక్ఫ్ ఆస్తులుగా ఉన్నాయని, డిప్యూటీ కమిషనర్ సారథ్యంలో ఉన్న కర్తవ్య నిర్వహణా బృందం ఈ విషయాన్ని పరిశీలించి ఈ సమస్యను పరిష్కరించగలదని చెప్పారు.

# కమిటీ చైర్మన్‌పైకి బాటిల్ విసిరే ఉద్దేశం నాకు లేదు

## అభిజిత్ గంగోపాధ్యాయ రెచ్చగొట్టడంవల్లే అలా చేశానని టిఎంసి సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ : బిజెపికి చెందిన వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంట్ జాయింట్ కమిటీ చైర్మన్ జగదాంబికాపైకి పగిలిన బాటిల్‌ను విసిరేయాలనే ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని, గత వారం జరిగిన కమిటీ సమావేశంలో బిజెపికి చెందిన అభిజిత్ గంగోపాధ్యాయ తనను బాగా రెచ్చగొడు తూ వ్యాఖ్యలు చేసినందువల్లే పగిలిన సీసాను విసిరేయాల్సివచ్చింది తప్ప ఉద్దేశపూర్వకంగా వ్యవహరించలేదని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)కు చెందిన కమిటీ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ స్పష్టంచేశారు.అయితే ఈ విషయంలో వెంటనే తాను కమిటీ చైర్మన్ జగదాంబికాపాల్‌కు క్షమాపణ కూడా చెప్పానని బెనర్జీ చెప్పారు. మంగళవారం నాడు ఇక్కడ కళ్యాణ్ బెనర్జీ విలేకరుల తో మాట్లాడారు. వక్ఫ్ బిల్లు కమిటీ సమావేశంలో కళ్యాణ్ బెనర్జీ వికృత ప్రవర్తనకు అదేరోజు ఆయన్ను వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంట్ జాయింట్ కమిటీ నుంచి సస్పెండ్ చేశారు. కళ్యాణ్ బెనర్జీని హౌస్ నుంచి సస్పెండ్ చేయాలని, ఆయపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంట్ జాయింట్ కమిటీ చైర్మ న్ జగదాంబికాపాల్ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాయడంతో కళ్యాణ్ బెనర్జీ సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. అక్టోబరు 22న జాయింట్ కమిటీ సమావేశంలో అభిజిత్‌గంగోపాధ్యాయ తనపై తీవ్రస్థాయిలో వ్యక్తిగత ఆరోపణల దాడికి దిగుతూ దుర్భాషలాడటంతో తాను ఒత్తిడికి గురై మాటా మాటా పెరిగిందని, దీంతో మంచినీటి గ్లాసును పగులగొట్టి విసరాల్సి వచ్చింది తప్ప ఎవరినీ బాధ పెట్టాలన్న ఉద్దేశం తనకు లేదని సీనియర్ అడ్వకేట్ కూడా అయిన తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ చెప్పారు. అయితే బాటిల్‌ను పగలగొట్టినప్పుడు తన వేళ్లకు గాయాలయ్యాయని బెనర్జీ తెలియజేశారు. మరుసటి రోజు జరిగిన సమావేశంలో తాను మాట్లాడానని, చైర్మన్ మీదకు బాటిల్‌ను విసరాలన్న ఏ మాత్రం ఉద్దేశం తనకు లేదని వివరణ ఇచ్చానని పేర్కొన్నారు. బిజెపి నాయకుడు గంగోపాధ్యాయ టిఎంసి నాయకుడు కళ్యా ణ్ బెనర్జీని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతూ కోల్‌కతా హైకోర్టు జడ్జిగా వివాదాస్పద రికార్డు కలిగి ఉన్నారని ఆరోపించడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది.

# ప్రతిపక్షాలపై పోలీసుల ప్రయోగం : సంజయ్ రౌత్

ముంబయి : మహారాష్ట్రలోని అధికార మహాయుతి ప్రభుత్వంపై ప్రతిపక్షాలపై పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. డిజిపి రష్మీ శుక్లాను ఆ పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) కూటమి అభ్యర్థులపై దాడులకు పాల్పడుతోందని.. ఎన్నికల్లో ఓటమి భయంతోనే పోలీసుతో ఒత్తిడి పెంచుతుందని మండిపడ్డారు. శివసేన యుబిటి అభ్యర్థి అద్వయ్ హిరాయ్ పాటిల్‌పై శివసేన మంత్రి దాదాజీ బూసే గూండాలు నాసిక్‌లోని మాలెగావ్ ఔటర్ నియోజకవర్గంలో దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. పోలీసులదాడిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇది మాలేగావ్‌కి మాత్రమే పరిమితం కాదన్నారు. డిజిపి రష్మీ శుక్లాను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేయడా నికి కారణం అదేనన్నారు. ఇదిలా ఉండగా.. సీట్ల సర్దుబాటుపై స్పందిస్తూ.. మిత్రపక్షాల భిన్నవాదనల మధ్య మిరాజ్, షోలాపూర్ సౌత్ స్థానాల్లో శివసేన (యుబిటి) పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్ధవ్ థాక్రే నేతృ త్వంలోని పార్టీతో పాటు ఎంవీఏలో కాంగ్రెస్, ఎన్‌సిపి (శరద్ పవార్) ఉన్నాయన్నారు. శివసేన పార్టీ నిలబెట్టిన స్థానాల్లోనూ సమా జ్‌వాదీ పా ర్టీ నామినేషన్లు దాఖలు చేసిందన్నారు. రాయ్‌గఢ్‌లో పెసెం ట్స్ అండ్ వర్కర్స్ పార్టీకి రెండు మూడు సీట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



# అవి కుటుంబ ఆస్తులే

- వైఎస్ బతికుండగా పంచలేదు
- నాకు ఇద్దరూ సమానమే
- నా పిల్లల గురించి తక్కువగా మాట్లాడొద్దు
- వైఎస్ఆర్ అభిమానులకు వైఎస్ విజయమ్మ లేఖ

అమరావతి: అమ్మగా నాకు (వైఎస్ జగన్, షర్మిల) ఇద్దరూ సమానమేనని, అలాగే రాజశేఖర్ రెడ్డి మాట సమానమేనని, ఆస్తులు కూడా ఇద్దరికీ సమానం అనేది నిజమని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్న వైఎస్ఆర్ ఆజ్ఞ నిజం అని, ఆస్తులు వద్దిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది వాస్తవమని విజయమ్మ స్పష్టంచేశారు. కానీ అన్ని ఆస్తులు కుటుంబ ఆస్తులే అన్నది నిజం అని, జగన్ బాధ్యత గల కొడుకుగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలి అనేదీ నిజమని ఆమె సూచించారు. వైఎస్ఆర్ అభిమానులకు వైఎస్ విజయమ్మ బుధవారం బహిరంగ లేఖ రాశారు. నా కుటుంబానికి ఏ దిష్టి తగిలిందో అర్థం కావట్లేదని, జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే చాలా చాలా బాధేస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జరగకూడనివన్నీ నా కళ్లముందే జరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని, ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే మనసుకి చాలా చాలా బాధేస్తుందన్నారు. ఈ వ్యవహారంలో నేను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా, జరగకూడనివి అన్ని నా కళ్లముందే జరిగి పోతున్నాయని వాపోయారు. ఈ కుటుంబం గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని, అబద్ధాల పరంపర కొనసాగుతోందన్నారు. తెలిసి కొంత, తెలియకుండా కొంత మాట్లాడుతున్నారని, అవి ఎక్కడెక్కడికో పోతున్నాయన్నారు. నా పిల్లలిద్దరికీ కాదు, చెప్పాలంటే ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదని, నేను మీ ముందుకు ఈ విషయంగా రాకూడదని అనుకున్నప్పటికీ, రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్ఆర్‌కు మేమెంతో, మీరు కూడా అంతేనని ఆమె తెలిపారు. ఈ కుటుంబం గురించి తప్పుగా మాట్లాడే వారందరినీ ఒకటి అడుగుతున్నానని, ఈ కుటుంబాన్ని ప్రేమించిన వారు మీరు అని, మా జీవితంలో మీరందరూ భాగమే అనుకుంటున్నానని పేర్కొన్నారు. ఆయన మమ్మల్ని ఎలా ప్రేమించారో, మిమ్మల్ని అంతగానే ప్రేమించారన్నారు. రాజశేఖర్ రెడ్డి మన మధ్యనుంచి వెళ్లిపోయాక మీరు నా పిల్లలను, ఆయన ఉన్నప్పటి కంటే ఎక్కువగా ప్రేమించి, ఆదరించి అక్కున చేర్చుకున్నానని గుర్తుచేశారు. దానికి నేను ఎన్నటికీ మరిచి పోలేనని, అందుకు నా జన్మంతా మీకు రుణపడి ఉంటానంటూ ఆమె హదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు చేతులు ఎత్తి మనవి చేసుకుంటున్నానని, దయచేసి ఈ కుటుంబం గురించి, నా పిల్లల గురించి తక్కువ చేసి మాట్లాడవద్దని, ముఖ్యంగా సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయవద్దు అని, దూషణలు చేయవద్దు అని విజ్ఞప్తి చేశారు. ఈ కుటుంబం మీద నిజమైన ప్రేమ ఉంటే, ఇంత కంటే ఎక్కువ మాట్లాడవద్దని, మీరెవరూ రెచ్చగొట్టవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. నేను నమ్మిన దేవుడే..నా బిడ్డల సమస్యలకు పరిష్కారం చూపిస్తాడన్న నమ్మకం నాకుందన్నారు. వైఎస్ బతికి ఉండగానే ఆస్తులు పంచేశారన్నది అవాస్తవమని ఆమె పేర్కొన్నారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి ఇతరులు అందరూ మాట్లాడుతూ, వైఎస్ఆర్ బ్రతికి ఉండగానే ఆస్తులు పంచేశారని వ్యాఖ్యానించడం అవాస్తవమని ఆమె తెలిపారు. వైఎస్ఆర్ పిల్లలు ఇద్దరు పెరుగుతున్న రోజుల నుంచి, కొన్ని ఆస్తులు షర్మిల పేరు మీద, కొన్ని ఆస్తులు జగన్ పేరు మీద పెట్టారని వివరించారు. అది ఆస్తులు పంచడం ముమ్మాటికీ కాదని, వైఎస్ఆర్ బ్రతికి ఉండగనే షర్మిలకు ఆస్తులు ఇచ్చేశారని లిస్ట్ చదివారని, అలాగే జగన్ పేరు మీద పెట్టిన ఆస్తుల లిస్ట్ చదివి ఉండాల్సిందని వారికి విజయమ్మ సూచించారు. ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు అని తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి ఈ ఇంటి బంధువుగా ఎంవోయూపై సాక్షి సంతకం చేశారని, అయినా మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం నాకు చాలా బాధ కలిగించిందన్నారు. అబద్దాల పరంపర కొనసాగకుండా ఉండటానికి సూటిగా నిజం చెబుతున్నానని, వారిద్దరూ నా పిల్లలు అని, వారిని నేను, వైఎస్ఆర్ ఎంతో అపురూపంగా ప్రేమగా పెంచుకున్నామని పదేపదే లేఖలో ఆమె పునరుద్ఘాటించారు. అమ్మగా నాకు ఇద్దరు సమానమేనని, అలాగే రాజశేఖర్ రెడ్డి మాట సమానమేనని, ఆస్తులు కూడా ఇద్దరికీ సమానం అనేది నిజమని వైఎస్ విజయమ్మ తెలిపారు.వైఎస్ఆర్ చివరి రోజుల్లో, జగ న్ ఆయనకు ఇచ్చిన మాట ''నాన్న నీ తర్వాత ఈ లోకంలో, షర్మిల మేలు కోరే వారిలో నేను మొదటి వాడిని' అని మాట ఇచ్చింది కూడా నిజం అని, ఇది 'నాలో నాతో వైఎస్ఆర్ అనే పుస్తకం'లో ఎప్పుడో రాశానని అభిమానులకు రాసిన లేఖలో విజయమ్మ తెలిపారు.

# పోలీసుల కస్టడీకి సిపిఐ(ఎం)నేత దివ్య

## ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన థలస్సెరీ సెషన్స్ కోర్టు



కన్నూర్ (కేరళ) : కన్నూర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ (ఎడిఎం) నవీన్ బాబు ఆత్మహత్య కేసులో నిందితురాలైన సిపిఐ(ఎం) నేత పిపి.దివ్యను కేరళ పోలీసులు మంగళవారం కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు ఆమెకు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన కొద్ది గంటల వ్యవధిలోనే పోలీసులు ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. కన్నూర్ నగర పోలీస్ కమిషనర్ అజిత్‌కుమార్ ఇక్కడ విలేకరులకు ఈ విషయాన్ని వెల్లడించారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్‌ను ఆత్మహత్మకు ప్రేరేపించిందన్న అభియోగంపై సిపిఐ(ఎం)నేత దివ్యపై కేసు నమోదైంది. మంగళవారం ఉదయం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి థలస్సెరీ, కెటి.నిస్సార్ అహ్మద్ దివ్యకు యాంటిసిపేటరీ బెయిల్‌ను తిరస్కరించారు. దివ్య అక్టోబరు 14న ఎడిఎం నవీన్‌బాబు వీడ్కోలు కార్యక్రమానికి హాజరైన సందర్భంగా చెంగలయి పెట్రోల్ పంపు అనుమతి అనేక మాసాలుగా ఆలస్యం కావడాన్ని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ ఆరోపణలు చేశారు. బదిలీకి రెండు రోజుల ముందు మాత్రమే ఆయన చెంగలయి పెట్రోల్‌పంపుకు అనుమతి ఇచ్చేందుకు అంగీకరించారని, అంత అకస్మాత్తుగా అనుమతి ఇవ్వడం వెనకు కారణాలు తనకు తెలుసని దివ్య హెచ్చరించడంతో ఆయన మనస్థాపానికి గురయ్యారు. కన్నూర్‌లోని తన క్వార్టర్‌లో ఆత్మహత్యకు పాల్పడటంతో దివ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యతో ఆమెకు సంబంధం ఉన్న కేసు అయినప్పటికీ అరెస్ట్ చేయడంలో ఆలస్యం ఎందుకు అయ్యిందని విలేకరులు అడిగిన ప్రశ్నకు కన్నూర్ నగర పోలీస్ కమిషనర్ అజిత్‌కుమార్ స్పందిస్తూ ఈ కేసు ఆత్మహత్యకు సంబంధించినదని, జ్యుడిషియల్ పరిధిలో ఉన్నందున ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకోలేరని ఆయన సమాధానం ఇచ్చారు. కోర్టు యాంటిసిపేటరీ బెయిల్‌ను నిందితురాలికి నిరాకరించడంతో మా బృందం రంగంలోకి దిగి ఆమె ఎక్కడ ఉన్నారో కనుగొని కస్టడీలోకి తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ విలేకరులడిగిన ప్రశ్నకు జవాబు ఇచ్చారు. పోలీసులు ఎడిఎం ఆత్మహత్యను ప్రేరేపించినట్లు తనపై కేసు నమోదుచేశారని, యాంటిసిపేటరీ బెయిల్ ఇవ్వాలని కోరుతూ అక్టోబరు 19న దివ్య థలస్సెరి సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలైన దివ్య అరెస్ట్‌పై వామపక్ష ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి కూడా పెరిగింది. తన భర్త ఆత్మహత్యకు కారకురాలైన దివ్యను వెంటనే అరెస్ట్ చేయకుంటే న్యాయం కోసం ఎంత దూరమైనా వెళతానని ఆత్మహత్యకు పాల్పడ్డ ఎడిఎం నవీన్‌బాబు భార్య మంజూషా విలేకరులకు చెప్పారు.

# మరో ఇద్దరు ఉగ్రవాదులు హతం

## అంబులెన్స్‌పై దాడి చేసిన ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైన్యం

జమ్ము : జమ్ముకశ్మీర్‌లో అఖ్నూర్ సెక్టార్‌లో భద్రతా దళాలు మరో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. సైనిక అంబులెన్స్‌పై దాడి చేసిన ఉగ్రవాదుల్లో హతమార్చి వారి సంఖ్య మూడుకు చేరింది. సోమవారం సైన్యం చేపట్టిన భీకర ఆపరేషన్ మంగళవారం కూడా కొనసాగింది. తొలి రోజు ఒక ఉగ్రవాదిని అంతం చేసిన దళాలు మంగళవారం మరో ఇద్దరిని హతమార్చాయి. అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ సమీపంలో ఉన్న ఓ గ్రామం మీదుగా వాహనం వెళ్తోన్న క్రమంలో సోమవారం ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అనంతరం సమీపంలోని అడవుల్లోకి పారిపోయారు. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులపై 'ఆపరేషన్ అసన్'ను ప్రారంభించారు. దీంతోపాటు కశ్మీర్‌లో పాగా వేసిన ఎన్‌ఎస్‌జి దళాలు ఆ అడవులకు చేరుకున్నాయి. ఈ ఆపరేషన్ కోసం సైన్యం ఏకంగా 'బిఎంపి2 శరత్' ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వాహనాలను రంగంలోకి దించింది. ఫలితంగా మన దళాలకు ఆ ప్రాంతంపై బలమైన పట్టు లభించినట్లయింది. వీటిపై నుంచి యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులను ప్రయోగించే అవకాశం కూడా ఉంది. వీటికి కవచాలు ఉండటంతో అడవుల్లో నక్కిన ఉగ్రవాదులు మన సైన్యంపై కాల్పులు జరిపినా.. ప్రాణనష్టం చోటుచేసుకోకుండా చేయగలిగారు. దీనికితోడు ఈ ట్యాంక్‌లపై ఉన్న భారీ మిషిన్‌గన్‌లు, గ్రనేడ్ లాంఛర్లు ఉగ్రవాదులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నిన్ననే ఒక టెర్రరిస్టును హతమార్చగా.. మంగళవారం మరో ఇద్దరిని అంతం చేశాయి. ఇదిలా ఉండగా, ఈ మొత్తం ఆపరేషన్‌లో భద్రతా దళాలు ఫాంటమ్ అనే జాగిలాన్ని కోల్పోయాయి. 'ఫాంటమ్ అంకితభావం, విశ్వాసం, ధైర్యాన్ని మేము ఎప్పటికీ మరచిపోము' అం టూ వైట్‌నైట్ కోర్ దానికి సంతాపం తెలిపింది. బెల్జియం జాతికి చెందిన ఈ జాగిలం 2020 మేలో జన్మించింది. అది 2022 ఆగస్టులో సైనిక దళాల్లో చే రింది. నాటినుంచి చాలా కీలక ఆపరేషన్లలో మన జవాన్లకు చేదోడువాదోడుగా నిలిచింది. తాజాగా ఆపరేషన్ 'అసన్'లో కూడా అఖ్నూర్ సెక్టార్‌లోని చిక్కటి అడవుల్లో నక్కిన ఉగ్రవాదులు, పేలుడు పదార్థాలను గుర్తించింది. గతేడాది కూడా ఓ ఆపరేషన్‌లో 21వ ఆర్మీ డాగ్ యూనిట్‌కు చెందిన శునకం ప్రాణాలు కోల్పోయింది. దానికి సైన్యం పూర్తి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, అక్టోబరు 30

## 2025లో సెన్సెస్ తప్పనిసరి

వచ్చే సంవత్సరం (2025)లో దేశంలో జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్) జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకపోయినా, ప్రభుత్వ వర్గాలనుంచి ఈ మేరకు బలమైన సంకేతాలు లీక్ చేయబడినాయి. దేశంలో బ్రిటిష్ వారి పరిపాలనలో లార్డ్ మయోవైస్రాయ్‌గా ఉండగా 1872లో తొలిసారి పూర్తిస్థాయిలో జన గణన చేపట్టడం జరిగింది. ఒక దేశ ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులు తెలుసుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించే నిమిత్తం ప్రతి పదేళ్లకు ఒకసారి సెన్సెస్ సేకరణ జరుగుతోంది. ఆ లెక్కన 2011నాటికి మొత్తం 15సార్లు జనగణన జరిగింది. 2021లో చేబట్టాల్సిన దశాబ్ది జనగణన కోవిడ్ మహమ్మారి కారణంగా వాయిదాపడింది. కోవిడ్ దాదాపుగా అదృశ్యమై రెండేళ్లు గడిచినా జనగణన నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. కడసారి 2011లో నిర్వహించిన జాతీయ జనాభా గణన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం 28 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు, 497 నగరాలు, 5767 తహసిల్‌లు, 6 లక్షలకుపైగా గ్రామాలతో భారతదేశ జనాభా 121 కోట్లు, ఇప్పుడు దేశజనాభా 140 కోట్లు పైమాటే. జనాభాలో చైనాను అధిగమించి ప్రథమ స్థానానికి చేరామంటున్నారు. తాజాగా సెన్సెస్ చేబడితే తప్ప కచ్చితమైన జనాభా సంఖ్య తేలదు. గత 1314 సంవత్సరాల కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో జనాభా పొందికలో, మిశ్రమంలో వచ్చిన మార్పులు తెలియవు. సామాజిక జీవనంలో, ఆర్థిక పురోగమనంలో, జీవన స్థితిగతుల్లో, జనాభా వలసలు, వృద్ధిలో, వయోభేద స్థితిగతులు వచ్చినా తెలియవు. అందుకే ప్రపంచవ్యాప్తంగా దశాబ్దానికొకమారు సెన్సెస్ చేబడతారు. కోవిడ్ కారణంగా మన దేశం ఆ క్యాలండర్ తప్పింది. వచ్చే సంవత్సరం గనుక చేబడితే ఇకపై 20252035, 203545 లెక్కన సెన్సెస్‌ను పిలవాల్సివస్తుంది.

మనలాంటి అధిక జనాభాగల దేశంలో సెన్సెస్ నిర్వహణ మహాక్రతువు. ఊరూవాడ ఇంటింటికి వెళ్లాలి. ముందు గృహాల లెక్కలు తీసుకోవాలి. ఇందుకోసమే ఐదారు మాసాలు పడుతుంది. రెండవ రౌండ్‌లో ఇంట్లో జనాలు, సౌకర్యాలు, వృత్తులు, చదువు, ఉద్యోగాలు వగైరా 31 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి ఎన్యూమరేటర్లు నమోదుచేయాలి. ఇంటి పెద్ద షెడ్యూల్డు కులం లేదా షెడ్యూల్డు తెగకు చెందినవారు కాదో నమోదు చేయాలి. అది రాజ్యాంగ ఆదేశం. అయితే సమాజంలో అత్యంత వెనెకబడినవారికి సైతం వనరుల పంపిణీలు, రిజర్వేషన్ కల్పనలో న్యాయం చేసే నిమిత్తం బిసి కులాల జనగణనను ఈ సెన్సెస్‌లో చేర్చాలనే రాజకీయ డిమాండ్ ఇప్పుడు పెద్దగా ముందుకువచ్చింది. దీనిపై ప్రభుత్వం నోరు విప్పలేదు. పార్టీగా బిజెపి వ్యతిరేకత తెలియజేస్తుంది. కొన్ని రాష్ట్రాలు తమకు తాముగా బిసి కులజనగణన నిర్వహిస్తున్నందున ఈ సమస్యను ఎంతో కాలం దాటవేయటం సాధ్యంకాదు. అందువల్ల సెన్సెస్ కోసం ఉత్తర్వుచేసే ముందే బిసి కుల జనగణనను అందులో చేర్చటం తప్పనిసరి అవుతుంది.

వచ్చే సంవత్సరం జనవరిలో సెన్సెస్ చేబడితే పూర్తికావటానికి 2026 మార్చి–ఏప్రిల్ వరకు సమయం పడుతుంది. 2000సం.లో ఆమోదించిన 82వ రాజ్యాంగ సవరణ ఆదేశం కూడా 2026లో సెన్సెస్ పూర్తిజేయాల్సిన అవసరాన్ని వక్కాణిస్తున్నది. చట్టసభల నియోజకవర్గాల పునర్విభజనను 2026 తదుపరి తొలి సెన్సెస్ తదుపరి చేబట్టాలని రాజ్యాంగ ఆదేశం. నియోజకవర్గాల సంఖ్యపై కూడా అప్పటివరకు ఆంక్ష ఉంది. ఇక్కడొక చిక్కు సమస్య ఎదురవుతున్నది. నియోజకవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికపై పదేళ్లకొకసారి జనాభా లెక్కల ప్రచురణ తర్వాత జరగాలి. అయితే భారత ప్రభుత్వ జనాభా నియంత్రణ విధానాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఓ 25 లోక్‌సభ సీట్లు కోల్పోయే, ఆ విధానాన్ని అమలు జరపటంలో విఫలమై జనాభా వృద్ధిచేసిన ఉత్తరాది రాష్ట్రాలు ఆ సీట్లను పొందే విచిత్రమైన పరిస్థితి తలెత్తుతున్నది. ఇందుకు దక్షిణాది రాష్ట్రాలు అభ్యంతరం చెబుతున్నాయి. ఉత్తర–దక్షిణ భారత్‌ల మధ్య సమతౌల్యాన్ని రక్షించాల్సిన ఈ సున్నితమైన సమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం సాధించలేకపోతే తీవ్ర పర్యవసానాలు ఎదురవుతాయి. మరో అంశం– మహిళకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ చట్టం కూడా ఈ డీలిమిటేషన్‌తోనే అమలులోకి వస్తుంది. అందువల్ల 2025లో సెన్సెస్ నిర్వహించటం తప్పనిసరి అవుతున్నది.

# బిహార్‌లో సిపిఐ 85వ వ్యవస్థాపక దినోత్సవ వేడుక

### సమున్నత స్థానంలో ఎర్రజెండా రెపరెపలు: మండుటెండలో వేలాదిమంది భారీ ర్యాలీ

**ల**ఖిసరాయ్: ''కేంద్రంలోని ప్రభుత్వం పేదల ప్రభుత్వం కాదు, అదానీ, అంబానీల ప్రభుత్వం. దేశభక్తి అనే బూటకపు ప్రదర్శనతో బిజెపి ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నది. ప్రాణాలతోసహా తమకున్న సర్వస్వాన్నీ యావత్‌దేశం త్యాగం చేస్తున్న సమయంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి స్వాతంత్ర్యపోరాటానికి ద్రోహం చేసిన చరిత్ర వారిది'' అని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ)ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. అక్టోబరు 20,21 (2024) తేదీలలో లఖిసరాయ్ జిల్లాకేంద్రంలో జరిగిన బిహార్‌లో సిపిఐ 85వ వ్యవస్థాపన దినోత్సవ వేడుకలలో డి.రాజా ప్రసంగించారు. వ్యవస్థాపన దినోత్సవం మొదటిరోజున కె.ఆర్.కె.హైస్కూలు మైదానంలో వేలాదిమందితో భారీ ర్యాలీ జరిగింది. ఈ మైదానానికి కర్యానంద్ నగర్‌గా నామకరణం చేశారు. సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.రామేంద్ర కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జన సేవాదళ్ వలంటీర్లు పార్టీ పతాకానికి గౌరవ వందనం చేశారు. సభాప్రారంభానికి ముందుగా అమరవీరులకు డి.రాజా పుష్పనివాళులు అర్పించారు. అనంతరం పలువురు పుష్పగుచ్ఛాలతో అమర వీరులస్తూపం వద్ద జోహార్లు అర్పించారు. ''లెనిన్ కా వర్‌దాన్ – షాహీదాన్ కో మేరా సలామ్'' అంటూ ఇప్టా గాయకుల బృందం గీతాలాపన చేసింది. సభావేదికకు బిహార్‌లో భారత కమ్యూనిస్టుపార్టీ నిర్మాతలలో ఒకరైన కామ్రేడ్ సునీల్ ముఖర్జీ పేరు పెట్టారు. ఒక వైపు భానుడు ఎర్రటి ఎండతో తన ప్రతాపం ప్రదర్శిస్తున్నప్పటికీ లెక్కచేయకుండా వేలాదిమంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో ఈ ర్యాలీకి హాజరయ్యారు. ''బిహార్‌లో అధికారం కోసమే ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బిజెపితో అంటకాగారు. మితవాద అణచివేత చర్యలకు మద్దతు ఇచ్చే ఈ శక్తులన్నింటినీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం నుండి తొలగించాల్సిన అవసరం ఉంది'' అని డి.రాజా తన ప్రసంగంలో పేర్కొన్నారు.



రామేంద్రకుమార్ తన ప్రసంగంలో బిహార్ ప్రభుత్వం అన్నివిధాలుగా పరిపాలనలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో అధిక భాగం వరదలలో కొట్టుమిట్టాడుతుండగా, మిగిలిన ప్రాంతం కరువు కాటకాలతో కష్టాలు పడుతోందని అన్నారు.మద్యనిషేధ మహానాటకంలో ఇంతవరకూ రాష్ట్రంలో ఎంతోమంది కల్తీ మద్యం అక్రమ విక్రయాలవల్ల ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇక బిజెపి–జెడియు కూటమి రాష్ట్రాన్ని వదలివెళ్ళిపోవాల్సిందేనన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి, పార్లమెంటు మాజీ సభ్యుడు కె.నాగేంద్రనాథ్ ఓఝా తన ప్రసంగంలో, బిజెపి పరిపాలనలో రోతపుట్టించే నీచ రాజకీయాలే దేశాన్ని శాసిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో తన సొంత ప్రభుత్వపాలనలోనే దేశ ప్రజలను అల్లర్లు, హింసాకాండ జ్వాలల్లోకి నెట్టేసి, రాజకీయాధికారాన్ని జాతీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా నిర్లక్ష్యం చేసిన ఏకైన పార్టీ ప్రపంచంలో బిజెపి ఒక్కటేనని ఆయన నిశితంగా విమర్శించారు. దేశంలోఉన్న ఎంతో విలువైన,అపురూపమైన ఆస్తులను అంబానీకి కట్టబెడుతున్నారని విమర్శించారు. ''రైతులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, మైనారిటీలు, వ్యాపారుల భవిష్యత్తును నాశనం చేసేవిధంగా దేశ సందపదను కేంద్ర పాలకులు తమ మిత్రుల ఇళ్ళకు జేరవేస్తున్నారు. మనల్ని మనం ఒక నిర్ణయాత్మకశక్తిగా మార్చుకుని బలంపుంజుకునే ప్రయత్నాలు చేయనంతకాలం ఈ విధమైన దుర్మార్గాలు కొనసాగుతూనే ఉంటాయి, బిహార్‌లో పరిస్థితులు కూడా ఇందుకు ఏమాత్రం భిన్నంగా లేవు'' అని నాగేంద్రనాథ్ ఓఝా అన్నారు.

#### ప్రజలకోసం సరికొత్త బిహార్ నిర్మిద్దాం

మండుటెండను కూడా లెక్కచేయకుండా ధైర్యంగా లఖిసరాయ్ వీధుల్లో ర్యాలీలో పాల్గొన్నవేలాదిమంది ప్రజలకు ఈ సందర్భంగా సిపిఐ బిహార్ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ర్యాలీ ద్వారా బిహార్‌లో సరికొత్త మార్పు పవనాలు వీస్తున్నాయన్నారు. కోట్లాదిరూపాయల ఖర్చుతో నితీశ్ కుమార్ ప్రభుత్వం నిర్మించిన పెద్ద పెద్ద నిర్మాణాలు, చిన్న చిన్న వంతెనలు కూడా కొద్దిపాటి వర్షాలకే ధ్వంసమైపోతున్నాయన్నారు. ఒక్కరూపాయి కూడా లంచం తీసుకోకుండా ప్రజా పనులు నిర్వహించిన ప్రభుత్వంలో ఏ ఒక్కశాఖనీ మనం తప్పుపట్టలేమని, కానీ బిజెపి–జెడి(యు) ఉమ్మడి ప్రభుత్వం బిహార్‌ను ఆటవికరాజ్యంగా మార్చేసిందని విమర్శించారు. తాను జిల్లాలలో జరిగే విషయాలు మాట్లాడటంలేదని, సాక్షాత్తూ రాష్ట్రరాజధానిలో కూడా నేరస్తులు స్వైరవిహారం చేస్తూ ఉత్సవం చేసుకుంటున్నారని విమర్శించారు. ఇంత సంక్షోభ పరిస్థితులమధ్య కూడా బిహార్‌లో మహిళలు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువకులు తమ తమ సంఘాల పరిధిలో సమైక్యంగా కదులుతున్నారన్నారు. వీరంతా పార్టీని బలోపేతం చేయడం ద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో మనం గణనీయమైన పాత్ర పోషించగలుగుతామని రామ్ నరేశ్ పాండే అన్నారు. బిహార్ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు పోరాటాలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ నాయకుడు, పార్లమెంటు మాజీ సభ్యుడు శత్రుఘ్నన్ ప్రసాద్ సింగ్ పిలుపు ఇచ్చారు. శ్రామికవర్గం చదువుకుని చైతన్యవంతులు కావాలని కోరారు. బిహార్ ముంగెర్ జంటనగరాలలో పుట్టి పెరిగిన సునీల్ ముఖర్జీ, రాహుల్ జీ తదితర భారతకమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపక నాయకులు రాష్ట్రంలోని ప్రతిజిల్లాల్లో మహత్తర పోరాటాలు చేశారని, వారి పోరాటాల స్ఫూర్తితో ఈనాడు రాష్ట్రంలో ప్రజలకోసం ప్రజలద్వారా ఒక సరికొత్త బీహార్‌ను నిర్మించుకోగలమని ఎంతో విశ్వాసంతో ఉన్నామన్నారు. ప్రత్యేకించి ఈ ర్యాలీ జరుగుతున్న లఖిసరాయ్ పట్టణానికి స్వాతంత్ర్యపోరాట ఉద్యమంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని గుర్తుచేశారు. ఈ చిన్న జిల్లాలో కార్యానంద్ శర్మ, భోలా ప్రసాద్, లోక్‌నాథ్ అజాద్, లఖన్ లాల్ సింగ్, సుక్కర్ మహతో, ప్రొఫెసర్ రాజనందన్, ద్వారకా దాస్, అర్జున్ యాదవ్, కుల్‌దీప్ చౌధరి, సింఘేశ్వర్ వింద్ లాంటి వారెందరో అరుణపతానికి కొత్త వెలుగులు సమకూర్చారని శత్రుఘ్నన్ ప్రసాద్ సింగ్ జ్ఞప్తికి తెచ్చారు. బిహార్‌లో మనది పెద్ద పార్టీ, దేశంలో, రాష్ట్రంలో మన అరుణపతాకాన్ని నిర్ణయాత్మకస్థానంలో ఉంచుదామని అన్నారు.

#### బిహార్‌కు కొత్తదిశానిర్దేశం చేసిన ర్యాలీ

లఖిసరాయ్‌లో సిపిఐ ర్యాలీ విజయవంతమైన ఘట్టం బిహార్‌కు ఒక కొత్త దిశానిర్దేశం, మార్గదర్శనం చేయగలదని, మనం ఎన్నికలకు ముందు అంతిమ పోరాటం చేపట్టాలని ఆ రాష్ట్ర జనసేవాదళ్ ఇన్‌ఛార్జ్ కె.జితేంద్ర కుమార్ అన్నారు. మాజీ ఎంఎల్‌సి ఓంప్రకాశ్ నారాయణ్, ఎంఎల్‌సి సంజీవ్ కె.సింగ్, ప్రమోద్ ప్రభాకర్, చంద్రమహతో, నివేదితా ఝా, అవధేశ్ రాయ్, ఎంఎల్‌ఏ అజయ్ కుమార్, నావల్ కిషోర్ సింగ్, రాజశ్రీ కిరణ్, ఉషా సాహ్ని, అనీశ్ అంకుర్, కోశాధికారి హర్షిత్ యాదవ్, రామ్ ప్రసాద్ సింగ్ తదితర ప్రముఖులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆహ్వాన కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయేంద్ర ప్రతాప్‌సింగ్, కార్యనిర్వాహక ఛైర్మన్ రవి విలోచన్ వర్మ ఈ సభకు అధ్యక్షత వహించారు. సమీపంలోని ఖగారయా, బెగుసరాయ్, ముంగెర్, జముయి, షేక్‌పురా, పాట్నాలనుండి పెద్దసంఖ్యలో ప్రజలు ఈ ర్యాలీకి తరలివచ్చారు. మహిళలు, యువకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# శ్రమజీవులకు అండ... ఏఐటియుసి

### 31న 105వ ఆవిర్భావ దినోత్సవం

**ఆ**ల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటియుసి) 105 వ ఆవిర్భావ దినోత్సవము అక్టోబర్ 31న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఘనంగా జరుపుకుంటున్న శుభదినం.

20 శతాబ్దం ప్రారంభంలో భారతదేశంలో ఏర్పడిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి.1920 అక్టోబర్ 31న ఆనాటికే పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న బొంబాయి నగరంలో భారత జాతీయోద్యమ నాయకులైన లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏర్పడిన సంఘం.

**నేపథ్యం :** బ్రిటిష్ వలస పాలనలో ఉన్న భారతదేశంలో శ్రమజీవులకు ఎలాంటి రక్షణలు, పనిగంటలు, వేతన విధానం లేకుండా రోజుకు 14 నుండి 18 గంటల వరకు పనిచేసే నికృష్టమైన పని పరిస్థితులలో వెట్టిబానిస విధానము కొనసాగుతున్న పరిస్థితులు ఉండేవి. బ్రిటిష్ పాలనలో ప్రభుత్వ రికార్డుల మేరకు 1830లో బానిస నిర్మూలన చట్టం చేయబడిన తర్వాత దాని స్థానంలో డేంజర్ లేబర్ పేరుతో దాదాపు 20 లక్షల మంది స్త్రీలు, పురుషులు బ్రిటీష్ వలస దేశాలు (దక్షిణాఫ్రికా, మలేషియా జమైకా తదితర 17 దేశాలు ) చక్కెర, కాఫీ, తేయాకు, రబ్బరు తోటల్లోనూ, గనుల్లోనూ పనిచేయుటకు నెలల తరబడి పడవలలో సముద్ర యానం చేసి దుర్భరమైన జీవితాలు గడిపిన చరిత్ర తెలిసిందే. ఇండియా ఆధునిక చరిత్రను 1857 సిపాయి తిరుగుబాటు లేక ప్రథమ స్వాతంత్ర పోరాటంతో మొదలైనదని చెప్పక తప్పదు. వాణిజ్య పెట్టుబడులను కాలక్రమములో పారిశ్రామిక పెట్టుబడులుగా ఎదిగిన తదుపరి రైల్వే, డాక్, కాఫీ, టీ తోటలు, టెలిగ్రాఫ్, పోస్టల్, గనులు, ముద్రణల కంటే ముందుగానే టెక్స్ టైల్, జూటు పరిశ్రమలు 1880వరకు ఏర్పడినవి. అస్సాం టీ కంపెనీ 1839లోను, 1853లో మొట్టమొదటి రైల్వే లైన్,1854లో కలకత్తాలో జ్యూట్ మిల్ ఏర్పాటుతో కార్మిక వర్గం విస్తరిస్తూన్న నేపథ్యం.

రోజుకు 16 నుండి 17 గంటల పని చేసేవారు. వేతనాలు తక్కువ, అమానీయ పరిస్థితులు ఉండేవి. కార్మిక సంఘాలు లేనప్పటికీ 1862మేలో హౌరాకు చెందిన 1200 మంది రైల్వే కార్మికుల సమ్మె, 1866లో అమెరికాలో 60 ట్రేడ్ యూనియన్లు సంఘటితమై 8 గంటల పనికొరకు సమ్మె, 1886లో చికాగోలో కార్మికులు రక్తాన్ని చిందించారు. ఇండియాలో1882–1890వరకు 8సంవత్సరాల కాలంలో 25సమ్మెలు జరిగాయి.

ఇండియన్ లేబరు మూమెంట్ 1890 నుండి 1917వరకు సాంప్రదాయంగా ఇన్ డేంజర్డ్ లేబర్ విధానానికి వ్యతిరేకంగా ఒక క్రమంలో జరిగిందని చెప్పవచ్చు. కార్మికుల జీవన పరిస్థితి మెరుగు కోసం సమ్మెలో నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో కొన్ని కార్మిక చట్టాలను రూపొందించింది. 1908లో ఏర్పడిన ఫ్యాక్టరీ కమిషన్ రిపోర్టును, వీక్లీ కమిషన్ పరిగణలోకి తీసుకొని కనీసం 13గంటల నుంచి 15గంటల వరకు పని గంటలు ఉన్నాయని తేల్చింది. 1911 ఫ్యాక్టరీస్ చట్టం ప్రకారంగా పనిగంటలను 12 గంటలకు కుదించటం జరిగింది. 9 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల పిల్లలు 7 గంటలు, మహిళలు 11 గంటలు, పురుషులకు ఏ పరిమితులు ఉండేవి కావు.

**ఏఐటియుసి ఆవిర్భావం :** 1917 సంవత్సరం బొల్సేవిక్ అక్టోబర్ రష్యన్ విప్లవం జయప్రదం.. ఉవ్వెత్తున కార్మిక వర్గంలో చైతన్యం, భారత రాజకీయ వ్యవస్థపై విప్లవ ప్రభావం, జాతీయ ఉద్యమంపై ప్రభావం, బాల గంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ తదితర జాతీయ ఉద్యమ నాయకులు కార్మికులతో ప్రత్యేక సంబంధాలు ఏర్పాటు చేసుకోవటం, దేశంలో కార్మికు ఉద్యమం బలపడటం జరిగింది. 1920 వచ్చేవరకు దేశవ్యాప్తంగా ఏర్పడిన కార్మిక సంఘాలను ఐక్యపరిచి జాతీయస్థాయిలో 64 యూనియన్‌లకు దేశవ్యాప్తంగా 1,40,845 మంది సభ్యత్వానికి ప్రాతిద్యం వహిస్తూ 101 ప్రతినిధులు పాల్గొన్నారు.ఏఐటియుసికి అంకురార్పణ జరిగింది.

1921లో జరిగిన ఏఐటియుసి జాతీయ మహాసభలోనే దేశ సంపూర్ణ స్వాతంత్రానికి పిలుపునిచ్చింది. 1922 సంవత్సరం ఫ్యాక్టరీస్ చట్టంలో పనిగంటలు 10 గంటలకు తగ్గించబడ్డాయి. కార్మిక నష్టపరిహార చట్టం 1923లో సాధించబడగా, 1920 నుండి 1925వరకు నిర్వహించబడిన నిరంతర పోరాటాల ఫలితంగా 1926లో ట్రేడ్ యూనియన్ చట్టం సాధించుకోవడం జరిగింది. 1927లో ఏఐటియుసి జాతీయ అధ్యక్షులుగా జవహర్లాల్ నెహ్రూ, 1929లో సుభాష్ చంద్రబోస్ ఎన్నుకోవడం జరిగింది. స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర వహించింది.

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 1945 అక్టోబర్ 3న స్థాపనలో ఏఐటియుసి ముఖ్య పాత్ర పోషించింది. భారతదేశ స్వాతంత్రం పొందిన 1947 నుండి దేశవ్యాప్తంగా అనే ఉద్యమాలు చేపట్టిన ఫలితంగా కార్మికులకు రక్షణకు, సామాజిక భద్రత కోసం అనేక చట్టాలను సాధించడంలో ఏఐటియుసి ముఖ్యపాత్ర వహించింది. దేశంలో ప్రైవేట్‌రంగంలో ఉన్న ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, బొగ్గు గనులను జాతీయం చేయాలని ఉద్యమించి జాతీయ కరణలో ముందు వరుసలో నిలిచింది. శ్రామికవర్గ సంక్షేమానికి చట్టాలను సాధించుకొనుటంలోను కనీసవేతన విధానం తీసుకురావటానికి ముందు వరుసలో నిలబడింది.

1991 నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, సరళీకరణ విధానాలను (ఎల్‌పిజి) నూతన ఆర్థిక విధానాలపై కార్మిక సంఘాల ఐక్య వేదిక ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించినటములో ముందువరుసలో ఏఐటియుసి నిలిచింది.

2014లో అధికారములోకి వచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో 44కార్మిక చట్టాలను నాలుగు కోడుల కిందికి మార్చారు. చివరికి పని గంటలను సైతం 8 నుండి 12 గంటలకు పెంచటం, అసంఘటిత కార్మికులకు కార్మిక హక్కులు నిరాకరించటం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ కార్మిక సంస్థలతో అంగీకరించిన హక్కులను సైతం నిరాకరిస్తున్నది

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాలదన్నుతూ ప్రతిపక్షాలు సభలో లేనప్పుడు సిగ్గు విడిచి మూడు వ్యవసాయ బిల్లులను ఆమోదింప చేసుకున్నది. ఎన్నికలముందు సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా తీవ్రంగా నిరాసపరిచింది.. ప్రభుత్వరంగ పరిశ్రమలను ఒక్కొక్కటిగా ప్రైవేటీకరించటం లేదా అమ్మ వేయడం జరుగుతుంది. మ్యానిటైజేషన్ పేరుతో దేశ సంపదలైన రైల్వే, రోడ్డు, విమాన, పోర్టులు, విద్యుత్ లైన్లు, టెలి కమ్యూనికేషన్స్ తదితల సేవారంగాలను లీజు పేరుతో ప్రైవేటు వారికి అప్పచెబుతున్నారు.

ఇప్పటికే పెరుగుతున్న ధరలు పడిపోతున్న వేతన విధానం కార్మిక సంఘాలతోను, భారత లేబర్ కాన్ఫరెన్స్లో ద్వైపాక్షిక చర్చలు జరపకుండా దాటవేస్తున్న కేంద్ర ప్రభుత్వము కార్మిక వ్యతిర విధానాలు అమలుపరుస్తుంది. ఏకపక్షంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను ప్రవేశపెట్టడం అనేది భారత కార్మిక వర్గంపై ప్రత్యక్ష దాడికి పాల్పడుటమే.

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఇప్పటికీ 25 సార్లు దేశవ్యాప్తంగా సమ్మెలు చేపట్టడం జరిగింది. నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూ ప్రజలపై ధరాభారం మోపడం, మత ఉద్రేకాలను రెచ్చగొడుతూ మరల అధికారానికి రావడమే ధ్యేయంగా అడుగులు వేయడం జరుగుతుంది.ఈ విధానాలకు వ్యతిరేకంగా. దేశవ్యాప్తంగా 10కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మె ఆందోళనలు చేపట్టడం జరిగింది. 2023లో దేశవ్యాప్తంగా నిరసనలను మే 22న, జులై 3న, ఆగస్టు 9న, సెప్టెంబర్ 23న నిర్వహించటం జరిగింది. బిజెపి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని, 2024 నవంబర్26 న దేశవ్యాప్తంగా సారస్వత నిరసనకు కార్మిక రైతు సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో యావత్ కార్మిక వర్గం, ఉద్యోగులు' బిజెపి హటావో.. దేశ్కో బచావో' ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది.

సమానత్వం, సమన్యాయ ప్రాతిపదికలపై దోపిడీ రహిత సమాజ స్థాపన కోసం, కార్మిక వర్గ హక్కులు పరిరక్షణ కోసం పోరాటాలు కొనసాగిస్తూనే ఐక్య ఉద్యమాలతో ముందుకు సాగుతుండాలి.

# మత సామరస్యానికి ప్రతీక 'లతీఫ్ సాహెబ్'

**ద**క్షిణ భారతదేశంలోనే గుట్టపైన ఉన్న ఏకైక దర్గా లతీఫ్ సాహెబ్ దర్గా. మత సామరస్యానికి ప్రతీకైనా సయ్యద్ హజ్రత్ లతీఫుల్లాఖాద్రి దర్గా పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లా పట్టణ నడిబొడ్డున గల ఆహ్లాదకరమైన ప్రశాంత ప్రదేశమైన గుట్టపై ఉన్నది. లతీఫ్ సాహెబ్ దర్గా హిందూ ముస్లిం అను మత పరమైన బేదం లేకుండా భక్తులకు కొంగుబంగారంగా కోరిన కోర్కెలు తీర్చి దైవంగా ప్రసిద్ధి చెందిది. దర్గాను వెయ్యేళ్ళుగా భక్తులు కొలుస్తున్నారు. ఇక్కడ ప్రతి శుక్రవారం ఆదివారం రోజున కందూరు నిర్వహించి మేకపోతులను లతీఫ్ సాహెబ్‌కు అర్పిస్తారు భక్తులు. ఇరాక్ దేశ రాజధాని బాగ్దత్‌కు చెందిన లతీఫుల్లాఖాద్రి మత ప్రచారం చేసేందుకు ప్రజలకు మంచి బోధనలు చేయడానికి క్రీస్తుశకం 960 నుంచి 1050ఏళ్ల మధ్య జిల్లాలోని దేవర కొండ ప్రాంతానికి వచ్చారు. అక్కడ ప్రజలకు నీతి నియమాలు బోధించి ప్రజల ఆదరణ పొందాడు. అక్కడ నుండి బోధనలు చేయడానికి నల్లగొండ పట్టణ నడిబొడ్డున ఉన్న గుట్టపైకి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రజల కష్టనష్టాలను తెలుసుకొని వాటిని పరిష్కరించే వారు. గుట్టపైనే ఆయన అనేక ఏండ్లుగా నివాసం ఉండటంతో ఆ గుట్టకు లతీఫ్ సాహెబ్ గుట్ట అని పేరు వచ్చింది. లతీఫ్ సాహెబ్ గుట్టపైనే బోధనలు చేస్తూ అక్కడే సమాధి అయ్యారు. ఆయన అన్న కుమారులు అల్లావుద్దీన్, ఫరీద్‌లు కూడా మత బోధనలు చేస్తూ ఆ గుట్టపైనే సమాధి అయ్యారు. వారి బోధనలు వినడానికి 500 మెట్లు ఉన్న గుట్టపైకి భక్తులు సులువుగా ఎక్కి తమ సమస్యలను ఆయన ముందుంచేవారు. ఆయన బోధనలు చేసే సమయంలో ఈ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండేనని నానుడీ ఉంది.

ప్రతి ఏడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ , నెలలో ఈ దర్గా కింద మెట్ల వద్ద ఉర్సు ఉత్సవాలు వారం రోజుల పాటు నిర్వహిస్తారు. యావత్ తెలంగాణ జిల్లాకు చెందిన భక్తులతోపాటుగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు కూడా వస్తారు. ఉరుసు ఉత్సవాలు నిర్వహించే సమయంలో దర్గా మెట్ల వద్ద బెంగుళూరు నుండి వచ్చే కవ్వాలి బృందం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తాయి. ఉర్సు ప్రారంభం రోజున పట్టణంలో గ్రంధాన్ని ఊరేగించడం ఆనవాయితీగా మారింది. నల్లగొండ పట్టణంలోని మదీనా మసీదు నుండి గ్రంధాన్ని ఊరేగించి లతీఫ్ సాహెబ్ గుట్టపై ఉన్న దర్గా వద్దకు ఆనవాయితీగా జిల్లాకు చెందిన మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లా యంత్రాంగం తీసుకెళ్తారు.

# దేశ శ్రేయస్సుకు సమగ్ర నైతిక సమాజ సంస్కృతి!

### విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా

ఎక్కడ, ఎప్పుడూ చూసినా అవినీతి దుర్వాసనలు గుప్పుమంటున్నాయి. అనాదిగా స్థానిక సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల వరకు అన్ని విభాగాల్లో/స్థాయిల్లో అవినీతి భూతం రెచ్చిపోతున్నది. వార్డు మెంబర్ నుంచి కేంద్ర మంత్రుల వరకు అన్ని విభాగాల్లో ఆయా స్థాయిలో అవినీతి చెదలు దేశ శ్రేయస్సును భోంచేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో పని కావాలంటే అమ్యామ్యాలు ముట్టచెప్పాల్సిన అనివార్య అగత్యం ఏర్పడింది. అక్రమార్జనలకు అంతు లేకుండా పోతున్నది. అవినీతి నిరోధక శాఖలు ప్రతి రోజు ఏదో ఒక అవినీతి చేపను వలపన్ని పట్టుకుంటున్నది, తర్వాత అవినీతికి తలవంచి వదిలేస్తున్నది. స్కామ్‌లు, లంచాలు నిత్యకృత్యం అయ్యాయి. ప్రభుత్వ శాఖలో పని జరగాలంటే ముట్టచెప్పాల్సిందే అని ప్రజలు దృఢ అభిప్రాయానికి వస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పెంచి పోషిస్తున్న యంత్రాంగాలు, ఆహార సరుకుల కల్తీల లీలలు, నాణ్యతకు తిలోదకాలిస్తూ ప్రాజెక్టుల నిర్మాణాలు, పట్టపగలే లంచాలు తీసుకుంటున్న ప్రబుద్ధులు మన ముందు కాలరెగిరేస్తూ కార్లల్లో షికార్లు కొడుతున్నారు. మనిషిలో నైతికతకు గండి పడితే అవినీతి వరదలు ప్రవహిస్తాయని తెలుసుకోవాలి. అవినీతి చెదలుకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం విజిలెన్స్ లేదా అప్రమత్తత విభాగాలను ఎన్ని ఏర్పాటు చేసినా ఆయా శాఖల స్వయం ప్రతిక్తికి భంగం కలిగించే విధంగా ప్రభుత్వ ప్రబుద్ధుల్లో చిత్తశుద్ధి లోపించి అనవసర స్వార్థ పూరిత జోక్యంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా అక్రమార్కులు విర్రిల్లడం విచారకరం.

**అవినీతి రహిత నవ భారత నిర్మాణానికి&:**

భారత కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల్లో పని తీరును మెరుగు పరచడం, పారదర్శకత పెంచడం, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు నిర్వహించడం, పిర్యాదుల విభాగాలను బలోపేతం చేయడం, ఆరోపణలు గుప్పుమన్నపుడు వెంటనే నిష్పాక్షిక విచారణ జరపడం, విజిలెన్స్ విషయంలో అత్యాధునిక డిజిటల్ సదుపాయాలను వినియోగించుకోవడం లాంటి లక్ష్యాలతో ప్రతి ఏట 28 అక్టోబర్ నుండి 03 నవంబర్ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు లేదా విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసింది. ఈ వారోత్సవాల్లో భాగంగా దేశ సమగ్రతను కాపాడడం, అవినీతి నిర్మూలన, బంధు ప్రీతి చూపడం, పక్షపాతాన్ని పెంచి పోషించడం, లంచం ఇవ్వడమా కాదు లంచాన్ని తీసుకోవడం కూడా నేరమని అవగాహన పర్చడం కొనసాగుతున్నది. నవ భారతదేశాన్ని నిర్మించడానికి మన జీవితాల్లో నైతిక విలువలను పెంపొందించడం, ప్రోత్సహించడం అత్యవసరమని అవగాహన కల్పించడం కొనసాగుతున్నది.

**దేశ శ్రేయస్సుకు నైతిక సమాజ స్థాపన:**దేశ శ్రేయస్సుకు నైతిక సమగ్ర సమాజ సంస్కృతి (కల్చర్ ఆఫ్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ) అనే థీమ్‌ను తీసుకొని ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నది. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు పూర్వ కార్యక్రమాలుగా గత మూడుమాసాల నుంచి(16 ఏప్రిల్ 15నవంబర్ వరకు)పలు వేదికలను ఏర్పాటుచేసి అవగాహనను నిర్వహిస్తున్న విషయం మనకు తెలుసు. భారత రత్న సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జన్మదినాన్ని (31అక్టోబర్) పురస్కరించుకొని ప్రతి ఏట విజిలెన్స్ అవగాహన వారాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి'భారతీయుడు'అప్రమత్తంగా ఉండాలని, ఎల్లవేళల నిజాయితీ/చిత్తశుద్ధి అత్యున్నత ప్రమాణాల్లో ఉండాలని, అవినీతిరహిత సమాజ స్థాపనకు ప్రతినబూనాలని ప్రజలను కోరుతున్నారు.

**సెంట్రల్ విజిలెన్స్ కమీషన్(సివిసి):**సంతానం కమిటీ సిఫార్సుల ఆధారంగా దేశ సమగ్రత కాపాడడం, పారదర్శకత పెంచడం, జవాబుదారీతనాన్ని అమలు చేయడం, అవినీతి నిర్మూలన లాంటి ధ్యేయాలతో 1964లో భారత ప్రభుత్వం 'సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ లేదా సివిసీ' అనబడే అత్యున్నత ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేసింది. విజిలెన్స్ కార్యకలాపాల్లో సున్నితమైన ప్రాంతాల్లో సిబ్బంది పర్యవేక్షణ, పిర్యాదుల విచారణ, దుష్ప్రవర్తనలకు ఆస్కారం లేకుండా విధుల నిర్వహణకు సలహాలు ఇవ్వడం, కాంట్రాక్టుల పర్యవేక్షణ/ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం లాంటి ప్రధాన విధులతో సివిసీ, ఇతర విజిలెన్స్ శాఖలు పని చేస్తున్నాయి. విజిలెన్స్ అవగాహన వారోక్సవాల్లో భాగంగా విద్యాలయాల్లో నైతిక ప్రవర్తన ప్రాధాన్య అంశాలను తీసుకొని పలు పోటీలను నిర్వహించడం, విజిలెన్స్ విభాగాలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, నైతిక ప్రవర్తన ప్రదర్శించిన సిబ్బందిని సన్మానించడం, విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞను సామూహికంగా చేయించడం, దేశ శ్రేయస్సు కోరి నీతి నిజాయితీలను పెంచి పోషించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రాజకీయ నాయకుల్లో నైతిక ప్రవర్తన పెరిగితే ప్రభుత్వ శాఖల్లో కూడా అవినీతి తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేడు మెజారిటీ ఎంఎల్‌ఏ, ఎంపీలు అవినీతి ఆరోపణల అభియోగాలను ఎదుర్కొంటున్నారు. దీపావళి పర్వదిన వేళల్లో మన జీవితాల్లో వెలుగులు ప్రసరించడానికి నైతిక సమాజ స్థాపన జరగాలని, ప్రతి ఒక్కరు అసలుసిసలైన 'భారతీయుడు' కావాలని, అవినీతి రహిత భారత కలలను సాకారం చేయడానికి అందరం చేయి చేయి కలిపి అవినీతి అనకొండలను ఆమెడ దూరం తరిమేద్దాం, నీతి నిజాయితీ వర్ధిల్లే సమాజ స్థాపనకు కృషి చేద్దాం.

## ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఖాళీగా ఉన్న 12 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు http.suryapet.telangana.gov.in వెబ్ సైట్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉంచనున్నట్లు తెలిపారు. డిస్టిక్ట్ క్వాలిటీ అష్యూరెన్స్ మేనేజర్ 1, ల్యాబ్ క్వాలిటీ మేనేజర్ 1, డిస్టిక్ డాటా మేనేజర్ 2, రేడిఓగ్రాఫర్ 2, ఎఎన్ఎం 2, సపోర్టింగ్ స్టాఫ్ 1 చొప్పున ఉద్యోగాల ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు నవంబర్ 2 తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

## జాయింట్ కలెక్టర్ బిఎస్ లతకు వీడ్కోలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సూర్యాపేట జాయింట్ కలెక్టర్‌గా సేవలు అందిస్తూ బదిలీపై వెళ్తున్న బిఎస్ లతకు మంగళవారం కలెక్టరేట్ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ బిఎస్ లత జాయింట్ కలెక్టర్‌గా అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఏ పనిలోనైనా వెంటనే నిర్ణయం తీసుకోని పూర్తి చేసేవారని గుర్తు చేశారు. ఆమె బదిలీ కావడం రెవెన్యూ విభాగానికి లోటేనని చెప్పారు. గతంలో కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాలలో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న ఆమె కింది స్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, సిపిఓ ఎల్ కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఎడి శ్రీనివాస్ నాయక్, కలెక్టరేట్ ఎఓ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పౌరసరఫరాల గిడ్డంగుల గోదామును ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరా సంస్థ,నియోజకవర్గ స్థాయి గిడ్డంగి గోదాంను మంగళవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా పంపిణీ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జనవరి నుండి పౌర సరఫరాల రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు. డీలర్లు రేషన్ ప్రజలకు అందేలా చూడాలని వారే అక్కడక్కడా లబ్ధిదారుల నుండి బియ్యం కొనుగోలు చేసి దళారులకు అమ్ముకుంటున్నట్లు సమాచారం ఉందని అలాంటి వారు తక్షణమే మానుకోవాలని లేకుంటే కఠిన చర్యలుంటాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పౌర సరఫరాల అధికారులు, పోలీసులు సమన్వయంగా రేషన్ అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి అరుణ సురేష్ గౌడ్,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కిన్నెర హరికృష్ణ, డిటిసిఎస్ హన్మంతు, శ్రీనివాస్ గౌడ్, డిల్లర్ కొర్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘం అభివృద్ధికి సంఘటితం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సంఘం అభివృద్ధికి సభ్యులు సంఘటితంగా ముందుకు సాగాలని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలగడప గిరిధర్ పిలుపునిచ్చారు. ధన్వంతరి జయంతి వేడుకలను పురస్కరించుకోని మంగళవారం పట్టణ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల కులదైవమైన ధన్వంతరి జయంతి వేడుకలను కులస్తులు ప్రతి సంవత్సరం కన్నుల పండుగా జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కులస్థుల అభివృద్ధి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సంఘం సభ్యులు తమవంతుగా బాధ్యత పోషించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాయించు నరసింహ, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, స్వామి, వెంకన్న, శ్రీకాంత్, నగేష్, వీరయ్య, కిరణ్, సైదులు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు బిసిలు ఏకం

ఒబిసి గౌరవ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ పిలుపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హక్కుల సాధనకు బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఓబీసీ న్యాయవాదుల సంఘం మిర్యాలగూడ గౌరవ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ పిలుపునిచ్చారు. నవంబర్ 3న ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో జరిగే బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల నేటికి బీసీలు అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పించినప్పుడే బీసీల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పాలక ప్రభుత్వాలు బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే పరిగణిస్తున్నారని తప్ప వారి అభివృద్ధికి చేపడుతున్న చర్యలు శూన్యమన్నారు. ఐక్యమత్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధింపబడుతాయని అన్నారు. గర్జనకు బీసీలు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, న్యాయవాదులు మోదాల మల్లేష్, పరమేష్, సైదులు, ఆంజనేయులు, ప్రసాద్, శ్రీనివాస్, వేణు, ఎల్లయ్య, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.



# కెసిఆర్‌కు అసెంబ్లీకి వచ్చే ముఖం లేదు

బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు ఇల్లు లేవు

11 వేల మందికి డిఎస్‌సి ద్వారా ఉద్యోగాలు కల్పించాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** కెసిఆర్‌కు అసెంబ్లీకి వచ్చే ముఖం లేదని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం పగిడిమర్రి గ్రామం సమీపంలోని సోమన్న వాగు వద్ద రూ.38 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మూడు డబుల్ రోడ్లు, హై లెవెల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ మట్టి రోడ్డు లేకుండా గ్రామాల నుండి మండల కేంద్రానికి,మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి సుమారు 12 వేల కిలో మీటర్ల మేర ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ కెసిఆర్ ,కెటిఆర్, హరీష్ రావులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏండ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని ఎక్కడ కూడా పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతుందని అన్నారు. కెసిఆర్‌కు అసెంబ్లీకి వచ్చే మొఖం లేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, పేదలకు డబల్ బెడ్ రూములు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై తాము నిలదీస్తామని భయంతోనే కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా భయపడుతున్నాడన్నారు. ఇప్పటికి మూడుసార్లు అసెంబ్లీ జరిగిన భయంతో కెసిఆర్ ఒక్కసారి కూడా అసెంబ్లీకి లేదని ఎద్దేవా చేశారు. కెసిఆర్‌కు కొడుకు, బిడ్డ, అల్లుడు బాగోగులు తప్పా పేదల గురించి ఎన్నడూ పట్టించుకోలేదని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో నల్లగొండ జిల్లా బిడ్డలంతా కెసిఆర్ ను బయటికి రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితం చేశారని పేర్కొన్నారు. కెటిఆర్, హరీష్ రావులు ప్రతిరోజు ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మూసితో నల్లగొండ జిల్లా ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం మూసి ప్రక్షాళనకు పూనుకోగా బిఆర్ఎస్ నేతలంతా అడ్డు తగలడం సిగ్గుచేటన్నారు.మూసి ప్రక్షాళనతో రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలు సశ్యశ్యామలం అవుతాయని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆలస్యమైన రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేసి తీరుతామని వెల్లడించారు. అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానని స్పష్టం చేశారు. రోడ్లన్నింటిని అభివృద్ధి చేసి గ్రామీణ ప్రాంతాల రోడ్ల రూపురేఖలు మారుస్తానని తెలిపారు. దీపావళి తర్వాత ఇల్లు లేని నిరుపేదలకు అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున ఇల్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ,ఆర్ అండ్ బి ఎస్ ఈ సత్యనారాయణ రెడ్డి, డి ఈ గణేష్,ఇతర అధికారులు ఉన్నారు.



## పకడ్బందీగా సమగ్ర ఇంటింటి సర్వే : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఉదయాదిత్య భవన్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని, శిక్షణలో నేర్చుకున్న విషయాలను మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు తెలియజేయాలని చెప్పారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే పారదర్శకంగా ఉండాలని, సర్వే విషయాలను గోప్యంగా ఉంచాలని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే పక్కగా చేయాలని, ఏ ఒక్క విషయం తప్పిపోకుండా అన్ని వివరాలు సేకరించాలని తెలిపారు. వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కాగా నిర్వహించాలని చెప్పారు. సర్వే సందర్భంగా అన్ని వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ,సిపిఓ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, ఇతర అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు ముందస్తు చర్యలు



**ప్రజాపక్షం /నల్లగొండ :** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటినుండే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్‌పిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఇతర విద్యుత్తు అధికారులతో విద్యుత్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు నల్లగొండ పట్టణంతో పాటు, గ్రామాలలో అవసరమైన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. అంతేకాకుండా, విద్యుత్ ఓవర్ ఓడ్ సమస్య లేకుండా చూసేందుకు అవసరమైన అదనపు ట్రాన్స్ఫార్మర్లను సైతం ఏర్పాటు చేయాలని, అలాగే ఎక్కడైనా అనుకోకుండా విద్యుత్ సమస్య తలెత్తితే తక్షణమే విద్యుత్తు సరఫరా చేసే విధంగా సంచార ట్రాన్స్ఫార్మర్లను సైతం సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ఇందుకు అవసరమైన ఇతర సామాగ్రి, బడ్జెట్ పై అంచనాలు రూపొందించి తక్షణం తనకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు మంత్రికి ఫిర్యాదులను సమర్పించారు. విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ నవీద్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు. అనంతరం మంత్రి తన క్యాంపు కార్యాలయంలోనే ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## ట్రాన్స్‌కో కార్యాలయంలో వినూత్న ప్రతిజ్ఞ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని టాన్స్ కో కార్యాలయంలో విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మేం లంచం తీసుకోం... నిస్వార్థంగా విధులు నిర్వహిస్తాం అని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ డీఈ గాలి నాయుడు, విజిలెన్స్ సిఐ డి లింగయ్యలు మాట్లాడుతూ ఎవరైనా సరే లంచం తీసుకోవడం నేరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేందర్, దుర్గప్రసాద్, ఉపేందర్, మధు, ఎస్ఈ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 31న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం




ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.మంగళవారం ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షతన నల్లగొండలోని మగ్దూం భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో దేవేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలని 4 కోడ్‌లుగా మార్చి హక్కులు లేకుండా చేసి యాజమాన్యంలకు తొత్తులుగా చట్టాలు మార్పులు చేశారని ఆరోపించారు. దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని నాటి నుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతుందన్నారు. కాంటాక్ట్ వ్యవస్థ రద్దు కోసం కనీస వేతనాలు అమలు కోసం ఉద్యోగ భద్రత కోసం రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయిూద్, జిల్లా కోశాధికారి దొనకొండ వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ సి రాజు, దోమల శ్రీను,రెవల్లి యాదయ్య, ఏ మల్లయ్య, ఎస్‌కె అమీర్, పి నరసింహ, జె విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి : జడ శ్రీనివాస్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఈ నెల 31 న జరగనున్న ఏఐటియూసి 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కార్మికులకు పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే 1920 అక్టోబర్ 31న ఏఐటియూసి యూనియన్ కార్మికుల హక్కుల సాధనకై ఏర్పడిందని, నాటి నుండి నేటి వరకు 44 కార్మిక చట్టాలను సాధించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, కార్మికులు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలా లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. 50సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికుడికి రూ.5వేల పెన్షన్ అందజేయాలన్నారు. బాణావత్ సైదులు, పండగ వెంకన్న, జక్కుల మల్లయ్య, వెంకటాద్రి, గోపి,అంజయ్య, రామ్మూర్తి, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఈనెల 31 నుండి నవంబర్ 5వ తేదీ వరకు జరిగే ఎఐటియుసి ఆవిర్భావ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎఐటియుసి ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎఐటియుసి హెచ్‌సిఎల్ ఆయిల్ టాంకర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31న జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో సంఘ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్స్ యూనియన్ అధ్యక్షులు బాబా, నాయకులు సైదులు, రాములు, గణేష్, వెంకన్న, లింగయ్య, నరేష్, ప్రవీణ్, నాగరాజు, రవి, శ్రీను పాల్గొన్నారు.



## పదవీ బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ త్రిపాఠీ



**ప్రజాపక్షం /నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వం పలువురు జిల్లా కలెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న సి.నారాయణరెడ్డిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయగా,ఆయన స్థానంలో ( 2017) ఐఏఎస్ బ్యాచ్ అధికారిణి ఇలా త్రిపాఠిని నియమించింది. రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులుగా పనిచేస్తున్న ఆమె సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలను చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కు కార్యాలయ పరిపాలనాధికారి మోతిలాల్,పలువురు విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలియజేశారు.

**నల్లగొండను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి : కోమటిరెడ్డి**

నల్లగొండ జిల్లాను అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నూతన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. జిల్లా నూతన కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు తీసుకున్న జిల్లా కలెక్టర్ మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సైతం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్. ఎస్‌పిలతో వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి ప్రాధాన్యతలు, తన శాఖ రోడ్లు భవనాల తోపాటు, ప్రస్తుతం ప్రాధాన్య కార్యక్రమాలైన ధాన్యం సేకరణ, తదితర అంశాలపై మాట్లాడారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయడమే కాకుండా, అన్ని అంశాలలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు చెప్పారు.

## ప్రజల్లోకి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు

కలెక్టర్ హనుమంతురావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతురావు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్‌లోని అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్‌లో నూతన బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలకు చెందిన అధికారులు అందరు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపాలని అన్నారు. జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి వారి ఆశీస్సులతో యాదాద్రి భువనగిరి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడపటానికి నావంతు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. వివిధ విభాగాల జిల్లా అధికారులతో డిపార్ట్మెంట్ వారీగా సమీక్షించారు. అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు అందేలా కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు మనందరం పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యనిర్వాహక అధికారి శోభా రాణి, ఆర్‌డిఓలు, చౌటుప్పల్ శేఖర్ రెడ్డి, భువనగిరి కృష్ణా రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** నల్లగొండ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంను వీక్షించారు. ప్రతి ఒక్క పౌరుడు ఆయుష్మాన్ భారత్ కార్డు పొందేలా కృషి చేయాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణికి సూచించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాదుల బారిన పడకుండ ప్రజలకు అవగాహన కల్పిస్తు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటి డిఎంహెచ్ఓ కేస రవి, సి.హెచ్.ఓ సుగుణా బాయి, రాణి, పార్మసిస్టు లక్ష్మ య్య, డిఈఓ హరీష్ తదితరుల ఉన్నారు.

# వ్యవసాయ మోటార్లే టార్గెట్

కాపర్ వైర్లు చోరీ చేస్తున్న దుండగులు

లబోదిబోమంటున్న రైతులు

ఫిర్యాదుల చేసినా పట్టించుకోని పోలీసులు

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** వ్యవసాయ మోటార్లే టార్గెట్ చేసుకొని కొంతమంది దుండగులు అన్నదాతలను నష్టపరుస్తున్నారు. మోటార్లలో ఉన్న కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి, నేరేడుచర్ల, మఠంపల్లి, మేళ్ళ చెరువు, పెన్‌పహాడ్ మండలాల్లోని సాగర్ ఆయకట్టు పరిధిలో వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

ఇటీవల కాలంలో సూర్యాపేట జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధిలో పంట సాగు కోసం రైతులు కాల్వలపై బిగించిన విద్యుత్ మోటార్లలోని కాపర్ వైర్లను దొంగలు పెద్ద ఎత్తున దోచుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు వందలాది మంది రైతుల మోటార్ల వైర్లను ఎత్తుకెళ్లారు. గత యాడాది నుండి కొందరు దొంగలు ముఠాగా ఏర్పడి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. గత మూడు నెలల క్రితం ఈ దొంగల ముఠాను గరిడేపల్లి పోలీసులు అదుపులో తీసుకోని కొంత మేరకు కాపర్ వైర్లు రికవరీ చేశారు. అప్పట్లో పట్టుపడిన ఓ దొంగ పోలీసుల కళ్లుకప్పి స్టేషన్ నుండి తప్పించుకుపోయిన విషయం అందరికి తెలిసిందే. పోలీస్ విచారణలో మేళ్ళచెరువు, మఠంపల్లి, నేరేడుచర్ల, గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాల్లోని ఆయకట్టు ప్రాంతాల్లో మోటార్లలోని కాపర్ వైర్లను చోరీ చేసినట్లు దొంగలు ఒప్పుకున్నారు. ఆ తరువాత కొంత కాలం దొంగతనాలు ఆగిన తాజాగా పెన్‌పహాడ్ మండలంలోని దోసపహాడ్, అన్నారం పరిధిలోని సాగర్ ఆయకట్టుపై బిగించిన మోటార్ల కాపర్ వైరును దుండగులు మళ్లీ ఎత్తుకెళ్లారు. ఏడాది కాలంలో నాలుగు సార్లు కాపర్ వైర్లు చోరీకావడంతో ఒక్కోక రైతు దాదాపు రూ. 10వేలకు పైగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది.



విద్యుత్ మోటార్లలోని కాపర్ వైరు చోరీకి గురైందని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏ మాత్రం పట్టించుకోకపోవడంతోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని వారిని పట్టుకున్న రికవరీ మాత్రం కొంతే ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటార్లలోని కాపర్ వైర్ల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకోని తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయం

రైతులకు ఇబ్బందులు రాకుండా

వ్యాపారులు, అధికారులు సహకరించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోళ్ల కేంద్రంలోనే రైతులు తమ పత్తిని గాని ధాన్యం గాని అమ్ముకుని ప్రభుత్వం ఇచ్చే మద్ధతు ధర పొందాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రైతులను కోరారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణం పరిదిలోని అర్‌కె జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం పత్తి తేమ శాతం పరిశీలించి తూకం వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాటన్ కార్పోరేషన్ అధ్వర్యంలో కేంద్రప్రభుత్వం నిర్దేశనలో రాష్ర్టప్రభుత్వ సహకారంలో కొనుగోళ్లు చేపడుతారని తెలిపారు. అలాగే పత్తి కొనుగోలు పూర్తి అయ్యే వరకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు పూర్తిగా సహకరించి రైతులకు అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 322 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. రైతులు ఎవరూ తొందరపడి తమ పత్తిని తక్కువ ధరకు అమ్మవద్దని సూచించారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని మూడు జిల్లాల కలెక్టర్‌లు పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం సేకరించిన ధాన్యం డబ్బులు నేటికి రూ.20వేల కోట్లు బకాయి ఉందని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా రైతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి , అర్‌డిఒ రామూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ అకుల రజిత, సహకార సంఘం చైర్మన్ బొల్లిశెట్టి శివయ్య, వైస్ చైర్మెన్ అనితరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు , స్థానిక ప్రజాప్రతినిధులు, ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.

### గల్ఫ్ బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

**కరీంనగర్ ప్రతినిధిః** గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ఎక్స్‌గ్రేషియాను కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లిన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య జూన్ 27, 2024న మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఈ మేరకు ప్రభుత్వానికి ధరఖాస్తు చేసుకున్నారు. దీంతో పులి అంజయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. అంజయ్య బార్య పులి రేణుకకు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి పభాకర్ మాట్లాడుతూ గల్ఫ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండ గా నిలుస్తున్నదన్నారు.గల్ఫ్ కార్మికులు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం సూచించారు.

## జీప్యాట్ నైపర్ ర్యాంకర్లను అభినందించిన విసి ఉమేష్‌కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ చదివి జీప్యాట్, నైపర్ పరీక్షలలో అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్ అభినందించారని కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్ తెలిపారు. మంగళవారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థినులు వై.స్నేహ, జి.నందినిలకు విసి ల్యాప్‌టాప్‌లను బహుకరించారు. ఒక ల్యాప్‌టాప్‌ను అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్ జూనియర్, హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ వాసి, ప్రస్తుతం అమెరికాలోని ప్రపంచంలోనే అతిపెద్ద సైబర్ సెక్యురిటీ సంస్థ పాలో ఆల్టో నెట్‌వర్క్ అధిపతి రమేష్ నాంపెల్లి దాతృత్వంతో అందజేయగా, మరొక ల్యాప్‌టాప్‌ను కోవిడ్ సమయంలో దివంగతులైన లెంకల మల్లేశ్వరి దేవి, నారాయరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమార్తె అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్‌కు సీనియర్ అయిన లెంకల సుజాతదేవి దాతృత్వంతో అందజేశారు. ఈ ఇద్దరు విద్యార్థులతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన మరో ఇద్దరు విద్యార్థులు యం.సాయికిరణ్, బి.పల్లవిలకు పదివేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని విశ్వవిద్యాలయం తరపున బహుకరించారు. ఈ సంధర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీశైలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, అధ్యాపకులు పి.క్రాంతి రాజు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వేణు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా డి.వేణు మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బదిలీలలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న డి.వేణును పెద్దపెల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఛాంబర్ కలెక్టర్ కోయ శ్రీహర్షను అదనపు కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఎగుమతి, దిగుమతులను ఆపొద్దు

ఆధునిక మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** వరి కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఎంఎల్‌ఎస్ పాయింట్ ఎండి జైనోద్దిన్‌ను అదేశించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అధుని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం నిల్వ ఉంచేందుకు షెడ్లన్ను సిద్ధంగా ఉంచాలని అధికారులను అదేశించారు. ఎప్పటికప్పుడు వడ్ల తేమశాతం పరిశీలించి గోదాంలో నిల్వ చేయడానికి రక్షణ పద్ధతులు పాటించాలని అధికారులను అదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ రామూర్తి, తహసీల్దార్ రవిందర్ రెడ్డి , తదతరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న కస్తూర్బా విద్యార్థుల పరిస్థితి విషమం?

హైదరాబాద్ తరలింపు

**ప్రజాపక్షం/ముత్తారం :** గత రెండు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అస్తవ్యస్తకు గురైన సంగతి విధితమే. అస్తవ్యస్తకు గురైన విద్యార్థులను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మొదటి రోజు చికిత్స పొందిన కొంత మంది విద్యార్థులను ఆరోగ్యం నిలకడగా ఉండడంతో డిశ్చార్జి చేయగా, అక్కడ చికిత్స పొందుతున్న మరో ముగ్గురు విద్యార్థులు తీవ్రమైన అనారోగ్యంతో ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థుల పరిస్థితి మంగళవారం విషమంగా ఉందని విద్యార్థులను హైదరాబాద్ ఆసుపత్రికి తరలించినట్లుగా సమాచారం తెలిసింది.

## బాలుడి వైద్యానికి సాయం



**ప్రజాపక్షం /ధర్మపురి :** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాలుడి వైద్యం కోసం ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.29లక్షలు సాయం అందించి అండగా నిలిచారు. ధర్మపురి మండల కేంద్రానికి చెందిన నారవేని కుమార్ మమత దంపతులకు ఓ కుమారుడు, కూతురు ఉండగా, కుమార్ దుబాయిలో కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత సెప్టెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో కూతురు శ్రీనిధి మరణించగా, కుమారుడు మల్లిఖార్జున్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరి పరిస్థితిని గమనించిన ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ వీరికి సాయం అందించాలని ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, ఇతరులు బాలుడి తల్లి మమత బ్యాంక్ ఖాతాకు రూ.లు 1.29లక్షలు విరాళాలు అందించారు. వాటిని స్థానిక తహశీల్దార్ కృష్ణ చైతన్య మంగళవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ అశిష్‌తో కలిసి మమతకు అందించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తం

**ప్రజాపక్షం/రామగిరి :** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువత చెడు అలవాట్లకు బానిసయై ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజలు సహకరించాలని గోదావరిఖని సిఐ ఏన్. ప్రసాద్ రావు కోరారు. కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ముల్కలపల్లి గ్రామంలో మంగళవారం కమాన్ పూర్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసాద్‌రావు మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలతో ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్డెన్ సెర్చ్‌లో ధ్రువ పత్రాలు సరిగా లేని ద్విచక్ర వాహనాలు 40, ఆటోలు 2 పోలీసులు సీజ్ చేశారు. కార్యక్రమంలో గోదావరి ఖని వన్ టౌన్ సీ. ఐ తో పాటు కమాన్ పూర్ ఎస్ఐ కొట్టె ప్రసాద్, మరో ముగ్గురు ఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్ళు, తొమ్మిది మంది పోలీసులు, ఏడుగురు స్పెషల్ పార్టీ సభ్యులు ఉన్నారు.

## అస్వస్థతకు గురైతే ఆస్తమా అనడం అవివేకమే

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** అధికారంలోకి రాగానే మంథని ఎమ్మెల్యే అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని, ముత్తారం మండలంలోని కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులు అస్వస్థతకు గురైతే పూర్తి వివరాలు తెలుసుకోకుండా మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన ఆయన జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గురుకుల పాఠశాల ఆవరణలో రెండు మూడు రోజుల క్రిందటే పరిశుభ్రత కోసం గడ్డి మందు కొట్టించారని, అయితే విద్యార్థులకు పనిష్మెంట్ పేరుతో గడ్డి తొలగించే పని అప్పగించడంతో అస్వస్థతకు గురైనట్లు తమకు పూర్తి సమాచారం అందిందన్నారు. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురైతే పరామర్శించిన మంథని ఎమ్మెల్యే శీతాకాలం కావడంతో చలి ప్రభావంతో విద్యార్థులు అస్వస్థతగా గురయ్యారని, ఆస్తమా కారణమనే రీతిలో మాట్లాడారన్నారు. చలికాలంలో ఒక్కరో ఇద్దరో అస్తమా ఉంటే అస్వస్థతకు గురవుతారే కానీ పదుల సంఖ్యలో ఒకేసారి అస్వస్తతకు ఎలా గురవుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని గురుకులాల పనితీరు అధ్వాన్నంగా మారి పోయిందన్నారు. అక్కడక్కడా ఇలాంటి సంఘటనలే జరుగుతున్నాయని వాపోయారు. గురుకుల పాఠశాలల చదువుతున్న పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అర్థం అవుతున్నారు. అలాగే ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను పనిష్మెంట్ పేరుతో ఇబ్బందికి గురి చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో విద్యార్థుల పట్ల చులకనగా మాట్లాడిన మంత్రి క్షమాపణలు చెప్పాలని, అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కరీంనగర్ జిల్లా ఓటర్లు 10,79,058

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాలో 10,79,058 మంది ఓటర్ల వివరాలతో ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితా విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా పరిధిలో గల కరీంనగర్, చొప్పదండి (ఎస్సీ), మానకొండూర్ (ఎస్సీ), హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రజల వివరాలతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తంగా 3,66,646 మంది ఓటర్లు, చొప్పదండి నియోజకవర్గంలో మొత్తం 2,34,501, మానకొండూర్ నియోజకవర్గంలో మొత్తం 2,26,567, హుజురాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,51,344 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 5,28,823 మంది పురుషులు, 5,50,174 మంది స్త్రీలు, 61 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారని , మరో 588 పురుషులు, 30 మహిళలు సర్వీసు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రజలు తమ పేర్లను డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో చెక్ చేసుకోవాలని, లేని పక్షంలో నవంబర్ 29లోగా ధరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 9,10 తేదీలలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక క్యాంపులను సైతం ఏర్పాటు చేస్తామని, వీటిని వినియోగించుకుని అర్హులైన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

### పకడ్బందీగా ఇంటింటి సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే సామాజిక విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై నిర్వహించే సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాలులో ఇంటింటి సర్వే ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్‌లో నిర్వహించే ఇంటింటి సర్వేకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌డిఒ శ్రీధర్, జడ్పి సిఇఒ పవన్ కుమార్, సిపిఒ కొమురయ్య, మాస్టర్ ట్రైనర్లు తదితరులున్నారు.

### జిల్లా కారాగారం సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని కారాగారాన్ని మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పది స్మార్ట్ టివిలను జైలు సూపరిండెంట్ కె.శ్రీనివాస్‌కు అందించారు. జైలులోని ఖైదీల బ్యారక్‌లు తిరుగుతూ వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కిచెన్, క్యాంటీన్, ఖైదీలు స్వయం ఉపాధి పొందే ఫ్యాక్టరీ, టైలరింగ్ రూములను, టెలిఫోన్ రూం, లైబ్రరీ, హాస్పిటల్ బ్యారక్ పరిశీలించి జైలులో ఖైదీలకు అందిస్తున్న భోజనం వివరాలను తెలుసుకున్నారు. స్టోర్‌రూం వెళ్లి సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జైలు జీవితం గడుపుతున్న వారిలో మానసిక ఆందోళనను దూరం చేస్తూ వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. అండర్ ట్రయల్ ముద్దాయిలు, ఖైదీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, జైలు నిబంధనలకు అనుగుణంగా అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జైలర్లు పి.శ్రీనివాస్, రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ ఉన్నారు.





# జీవన్‌రెడ్డిని అధిష్టానం గౌరవిస్తుంది..

ఆయన ఆశీర్వాదంతోనే ఎదిగాను

ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి గౌరవానికి భంగం కలుగకుండా అధిష్టానం గుర్తిస్తుందని ఆయనకు కష్ట కాలంలో మనం అండగా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఇటీవల హత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు మారు గంగారెడ్డి సంతాపసభ మంగళవారం జగిత్యాలలో నిర్వహించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి , చొప్పదండి ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనగా లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 10 ఏండ్లు రాచరిక పాలనసాగించారని విమర్శించారు. కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులు పెట్టిన భరించమని తెలిపారు. కొత్తగా చేరినవారికి కాకుండా పాత కార్యకర్తలకు గుర్తింపును ఇచ్చేవిధంగా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించే విధంగా సిఎం, పిసిసి అధ్యక్షుడి దృష్టికి తీసుకుపోతానని లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి కార్యకర్తలకు కంటికి రెప్పలా కాపాడుకున్నారని, మారు గంగారెడ్డి లాంటి సీనియర్ నాయకుడు చనిపోతే తన కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లు భాద పడ్డారని అటువంటి నాయకుడు మనకు దొకడం అదృష్టంగా భావించాలన్నారు. మామూలు కార్యకర్తలుగా ఉన్న తాను. చొప్పదండి ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం లను జీవన్‌రెడ్డి ఈ స్థాయిలో నిలిపారని కొనియాడారు. అధిష్టానంతో కోట్లాడి తామకు టిక్కెట్లు ఇప్పించారని చెబుతూ జీవన్‌రెడ్డి ఆశీర్వాదం తో తాము ఇంత ఉన్నత పదవిలో ఆయనకు రుణపడి ఉంటామని తెలిపారు. కోరుట్ల ఎంఎల్‌ఏ సంజయ్ ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కార్యకర్తలు కోసం పరితపించే ఆయకుడు జీవన్‌రెడ్డి అన్నారు. జీవన్‌రెడ్డి ఒంటరి కాదని రాష్ట్రంలోని లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, విజయలక్ష్మీ దేవేంధర్‌రెడ్డి, శోభారాణి, అనిత, నందయ్య కొండ్ర రాంచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, జితేందర్, జున్ను రాజేందర్, దుర్గయ్య, నక్క జీవన్, వేముల సుభాష్, మన్సూర్, రాంచంద్రా రెడ్డి, మునింధర్‌రెడ్డి, గంగాధర్, గోళ్ల తిరుపతి, చిట్ల లత, తదితరులు పాల్గొన్నారు.

### గంగారెడ్డి హత్యపై పోలీసులు లోతుగా విచారించాలి...

కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపిటిసి మారు గంగారెడ్డి హత్య విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీకి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. హత్య విషయంలో తూతూ మంత్రంగా ఎఫ్ఐఆర్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపిస్తే సరిపోదని హత్య వెనుక ఎవరున్నారో కనిపెట్టాలన్నారు. కార్యకర్తలు అదైర్యపడొద్దని సూచించారు

## పక్కాగా ఇంటింటి సర్వే

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పక్కాగా ఇంటింటి సర్వే నిర్వహణకు సంసిద్ధం అయి ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను సిద్ధం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయమును సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహణ సన్నద్ధతను తనిఖీ చేశారు.కుటుంబాల సామాజిక ఆర్థిక విద్యా స్థితిగతులు తెలుసుకునేందుకు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టేందుకు సన్నద్ధం కావాలఅన్నారు. రాష్ట్రంలోని కుటుంబాల ఆర్థిక, విద్య, సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీనికి తగిన విధంగా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులక్కు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ప్రతి 150 కుటుంబాలను సర్వే చేసేందుకు ఒక ఎన్యుమరేటర్ ను ఎంపిక చేయాలని, ఎన్యుమరేటర్ లకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు అందజేయాలని, ఇంటింటి సర్వే నిర్వహించేందుకు వారికి అవసరమైన పరికరాలు రూట్ మ్యాప్ మొదలగు సహాయ సహకారాలు అందజేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కుటుంబాల ఆర్థిక సామాజిక విద్యా స్థితిగతుల వివరాలను పక్కాగా సేకరించాలన్ని, కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాకొద్దీ పనిభారం..!

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎఇఒల వినతి

కొండలు, గుట్టల్లో ఒక్కరితో సర్వే ఎలా సాధ్యం..?

పనికి మించిన భారంతో

ఎఇఒల ఆందోళనపై 'ప్రజాపక్షం' కథనం



**ప్రజాపక్షం/అక్కన్నపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే(డిసిఎస్) మొబైల్ యాప్ ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఒలు) పంట సాగు వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేయాల్సి వుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎఇఒలపై పనిభారం మోపడంతో నిరసన వ్యక్తం చేయడంతో పాటు విధుల్లో చేరకపోవడంతో పలువురి ఎఇఒ ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వారు విధుల్లో చేరి యాప్‌లో పంటల నమోదు సర్వేతో వ్యవసాయ విస్తరణ అధికారులు అధిక పని ఒత్తిడితో సతమవుతున్నారు. సర్వేతో క్షేత్రస్థాయిలో ప్రాణాపాయ పరిస్థితులతో భద్రత కొరవడిందని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధి మహిళా ఎఇఒలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం హుస్నాబాద్ సమీకృత కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులను నియమించి పని భారం తగ్గించాలంటూ వినతిపత్రం అందజేశారు. కాగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా సర్వే నామమాత్రంగానే సాగుతోంది. జిల్లాలో 26 మండలాలు ఉండగా 127 క్లస్టర్లకు గానూ 127 మంది ఎఇఒలు పనిచేస్తున్నారు. అందులో 34 మంది కాంట్రాక్టు ఎఇఒలు ఉన్నారు. ఏడేళ్లుగా ఎలాంటి సదుపాయాలు లేకున్నా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నామని, పనిభారం మోయడంతో ఒత్తిడికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తూ వారుకూడా డిజిటల్ సర్వే చేయలేమని చేతులెత్తేశారు.

### వేల ఏకరాలు ఎలా సాధ్యం?

విజయ్, ఎఇఒ, అక్కన్నపేట



ఒక్కో క్లస్టర్లలో 5 వేల ఏకరాల నుంచి 12 వేల ఏకరాల వరకు సర్వే చేయాల్సివుంది. 25 మీటర్ల దూరంలో ఉండి యాప్‌లో వివరాలు నమోదు చేయవలసి వుంటుంది. ఇందంతా ఒక్క మహిళా ఎఇఒతో ఎలా సాధ్యం. సత్వరమే మా సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి సహాయకులను నియమించాలి.

### పనిభారం మోయలేం..

సబీహా, ఎఇఒ, పందిల్ల, హుస్నాబాద్



కొండలు, గుట్టలు, వాగులు, వంకలు అడవుల్లో సాగు చేస్తున్న పంట పొలాలు క్షేత్ర స్థాయిలో మహిళా ఎఇఒలు వేల ఏకరాల్లో సర్వే చేయడం సాధ్యం కాదు, ఇతర రాష్ట్రాల మాదిరి సహాయకులను కేటాయించాలి.

## మంత్రి తుమ్మలను కలిసిన సొసైటీ అధ్యక్షులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వి. వెంకటాయపాలెం, నాగుల వంచ సొసైటీ అధ్యక్షులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వి.వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షులు రావూరి సైదబాబు, నాగులవంచ సొసైటీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, సొసైటీ కార్యదర్శులు ఐత గాని తిరుపతిరావు, శ్రీనివాసరావులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. సొసైటీలో రైతుల కోసం చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి మంత్రి వివరించారు. అదేవిధంగా హైదరాబాద్ అకా భవన్‌లో సీడ్ కార్పొరేషన్ సమావేశంలో సీడ్ కార్పొరేషన్ ఎండి ఉదయ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో తెలంగాణ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్, ఖమ్మంజిల్లా సహకార అధికారి గంగాధర్, వి.వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షులు రావూరి సైదబాబు, నాగులవంచ సొసైటీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, సొసైటీ కార్యదర్శులు ఐతగాని తిరుపతిరావు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు. రైతులకు విత్తనాల విక్రయం, వారి నుంచి మరల కొనుగోలు చేయడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

## ప్రజా సంక్షేమానికి పెద్దపీట

సిసి రోడ్లు ప్రారంభించిన ఎంఎల్ఎ పాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామ పంచాయితీలో రూ 15లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లును ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కృష్ణసాగర్ ఎస్సీ కాలనీలో కొమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా ముసలమడుగు గ్రామ పంచాయితీలో రూ 10లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథకంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, పాయం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంకు తరలించి అధిక ధరలు పొందాలని, ప్రభుత్వం 500 రూపాయలు బోనస్‌గా అందిస్తుందని వివరించారు. కొనుగోలు కేంద్రాలకు పరదాలు, గాలి పంకాలు, యంత్రాలు కాంటాలు, ఉచితంగా అందిస్తామని వివరించారు. రైతులు దళారులు పాలు కాకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి ప్రభుత్వ ధరలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి పంతులు, పర్యవేక్షకులు జగదీష్, సొసైటీ బోబోలు లక్ష్మణరావు, కార్యదర్శి బీరవల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్‌రావు లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్పిటల్ లోని అన్ని రికార్డులను పరిశీలించి, పిహెచ్‌సిలో ఫార్మసిస్ట్ ప్రభాకర్ విధులు నిర్లక్ష్యం పట్ల డాక్టర్ శివకుమార్‌పై పాయం మండిపడ్డారు. విధులలో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం హాస్పిటల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హాస్పిటల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని మున్సిపాలిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని మండాలపాడు రెవెన్యూ గ్రామంలో మంగళవారం విద్యుత్‌శాఖ లంకపల్లి సెక్షన్ ఆధ్వర్యంలో పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ భుజేంద్రకుమార్ మాట్లాడుతూ రైతులు పంట పొలాలకు వినియోగించుకొనే కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, వీటి వలన విద్యుత్తులో వోల్టేజి సమస్య రాదని, నాణ్యమైన విద్యుత్తు అందుతుందని తెలిపారు. పంట పొలాల్లో విద్యుత్తు వైర్లు కిందకు వ్రేలాడిన, స్థంభాలు విరిగినా రైతులు వాటిని ముట్టుకోకుండా వెంటనే తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంకపల్లి సెక్షన్ పరిధిలోని విద్యుత్తు శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చింతకాని మేజర్‌కు నీరు నిలిపివేత

**ప్రజాపక్షం/చింతకాని:** ఎన్ఎస్‌పి కెనాల్ పరిధిలోని చింతకాని మేజరు కాల్వకు బస్వాపురం వద్ద యూటీకి బుంగ ఏర్పడింది. దీంతో నీరు వృథాగా పోతుండటంతో ఎన్ఎస్‌పి అధికారులు చింతకాని మేజర్‌కు నీటిని నిలుపుదల చేశారు. మరమత్తులు చేపట్టి త్వరలోనే తిరిగి నీటిని విడుదల చేస్తామని ఏఈ సురేష్ పేర్కొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి. శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత పి. శ్రీనివాసరెడ్డి కలెక్టర్ మజమ్మిల్ ఖాన్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమక్షంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి. శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

# గత పాలకుల అప్పులు తీర్చే పనిలో ఉన్నాం

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/ మధిర :** గత పాలకులు ఏడు లక్షల కోట్ల అప్పుచేసి ఖర్చులుపెట్టి పోయారు... వాటిని తీర్చే పనిలో మేము ఉన్నామని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బోనకల్ మండలంలోని రూ.26కోట్లతో నిర్మించనున్న రావినూతల నుండి ప్రొద్దుటూరు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సిరిపురం నుండి నెమలికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న సిరిపురం జూనియర్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వసతులు తదితర అంశాలను సమగ్ర విచారణ చేసి నివేదికలు పంపించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను ఆదేశించారు. అనంతరం నియోజకవర్గ కేంద్రం మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో



ఇందిరా పాల ఉత్పత్తి కేంద్రం లోగో ప్రారంభ సభలో ఆయన ప్రసంగించారు. ముందుగా ఇందిరా మహిళా డెయిరీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి నిమిషం ప్రజల కోసమే ఈ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజల అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అన్నారు. దేశం మనవైపు చూసేలా ఇందిరా మహిళా డెయిరీ విజయం సాదించాలన్నారు. మధిర అసెంబ్లీసెగ్మెంట్ సంబంధించి మహి ళల చేతపాలవ్యాపారం చేయించేందుకు 2011లోరూపకల్పన చేసుకున్న ఇందిరా మహి ళా డెయిరీ ఆకాంక్ష నేడు నెరవేరుతుందని అ న్నారు. అలాగే నాగార్జున సాగర్ బహుళ సార్థక ప్రాజెక్టు ద్వారా మధిర నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో ఆయకట్టుకు సాగునీరురావడం వల్ల పంటలు పండిస్తూ పిల్లలను చదివిస్తున్నారని తెలిపారు. మధిర ప్రాంతం పరిధిలో వ్యవసాయాధారిత జీవనం తప్ప మరో దారి లేదని, దీనిని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నాగార్జునసాగర్‌తో పాటు కట్టలేరుపై, మున్నేరుపై ఆనకట్ట నిర్మించుకుని సాధ్యమైనంతవరకు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నామని, డ్రిప్ ఇరిగేషన్ కూడా తయారు చేసుకున్నామని తెలిపారు. మహిళలు పాడి పరిశ్రమలపై దృష్టిసారించి ఆదాయం సంపాదించేలా స్వశక్తి మహిళా సంఘాలచే పాడి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. పాలు ఉత్పతి అవుతుందని, నెలకు రూ.25కోట్లకుపైగా మహిళలు సంపాదించే అవకాశం ఉందని తెలిపారు. పాలు మాత్రమే కాకుండా మజ్జిగ, నెయ్యి, వెన్న, స్వీట్స్ అమ్మకాలు కూడా కలిపితే సంవత్సరానికి ఇందిరా మహిళా డెయిరీ టర్నోవర్ రూ.500 కోట్లు దాటుతుందన్నారు. అనంతరం మాటూరులోని జిన్నింగ్ మిల్లులో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,డిఆర్‌డిఓ సన్యాసయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వేణు మనోహర్, ఇందిరా మహిళా డైరీ చైర్మన్ అన్నపూర్ణ, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మినీట్యాంక్ బండ్‌గా చింతకాని నల్లచెరువు



**ప్రజాపక్షం–/చింతకాని:** మండలంలో ఒక్కోచెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేయాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క చింతకాని నల్లచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధిచేసేందుకు ।ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐబీ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో మంగళవారం అధికార బృందం చింతకాని నల్లచెరువును పరిశీలించారు. స్థానిక రైతులు ప్రజాప్రతిధులతో చెరువు ఆయకట్టు వివరాలు సేకరించారు. త్వరలోనే అంచనావిలువ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఏఈ సురేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్పీ ఏఈ సురేష్ ,నయాబ్ తహసీల్దార్ వీరభద్రునాయక్ ,ఆర్ఐ రఘు,సర్వేయర్ నవీన్,ఎంపీడీవో రామయ్య,సహకారసంఘం డైరక్టర్ కిలారు మనోహర్‌బాబు,మాజీ మార్కెట్‌కమిటి వైస్ చైర్మన్ మడిపల్లి భాస్కర్ ,రైతులు కిలారు బాబురావు,బండి సైదేశ్వరరావు,మల్లెల వెంకటేశ్వర్లు,మజీద్,శ్యాం,శ్రీను ,బండి తిరపయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటిలో యాంటీ నార్కోటిక్స్ సదస్సు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇం జనీరింగ్ కళాశాలలో యాంటీ నార్కోటిక్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్ర స్తుత సమాజంలో చెడు అలవాట్లకు లోనుకాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. తోటి విద్యార్థులను జాగ్రత్త పర్చడం లో సహకరించడం ద్వారా దేశ పురోగతికి తో డ్పాటునందించాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నార్కోటిక్స్ విభాగం మ ధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వ ల్ల విద్యార్థులు తమ విలువైన జీవితాన్ని, ఉజ్వల భవిష్యత్తును కోల్పోతారని నార్కోటిక్స్‌గా పరిగణించబడి డ్రగ్, వాటి పర్యవసనాలు బాధితులు మరియు వ్యాపారులపై చట్టప్రకారమైన చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి, ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, శ్రీనివాసరా వు, రవీంద్రబాబు, హెచ్‌వోడిలు అమిత్ బిం దాజ్,చరణ్‌సింగ్,స్ఫూర్తి పాల్గొన్నారు.



## ఇండ్ల స్థలాల సాధనే ఏకైక లక్ష్యం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నియోజక వర్గం లో అర్హులైన జర్నలిస్టులందరికీ వీలైనంత తొందరగా ఇండ్ల స్థలాలు సాధించడమే జర్నలిస్టు సం ఘాల లక్ష్యమని ఆయా సంఘాల నేతలు తెలిపా రు. ప్రభుత్వ గుర్తింపు పొందిన మూడు జర్నలిస్టు సంఘా సంయుక్త సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇండ్ల స్థలాల ప్రక్రియ ఆలస్యమైందని దీనిని వేగవంతం చేసేందుకు మూడు సంఘాలు స్థంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీకి సంపూర్ణ సహకారం అందించాలని నిర్ణయించారు. పదవులు ముఖ్యం కాదు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కడమే తక్షణ కర్తవ్యంగా ముందుకు సాగాలని సమావేశం అభిప్రాయపడింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు దక్కేందుకు సొసైటీతో కలిసి జిల్లాకు చెందిన మంత్రుల ద్వారా ప్రయత్నించాలని సమావేశంలో నిర్ణయించారు. సొసైటీ కూడా సంఘాల సూచనలను, సలహాలను పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. నవంబరు రెండున జర్నలిస్టు యూనియన్లకు చెందిన సమన్వయ కమిటీ సభ్యులు తొలి దఫా సొసైటీ డైరెక్టర్లతో సమావేశం కావాలని నిర్ణయించారు. ఐజెయు పక్షాన వనం వెంకటేశ్వర్లు, మాటేటి వేణుగోపాల్, నర్వనేని వెంకట్రావు, టియుడబ్ల్యూజె, టిజెఎఫ్ పక్షాన ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, ఉదయ్, టియుడబ్ల్యూజెఎఫ్ నుండి పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు ఆస్తులకు రక్షణేదీ?

ఇన్సాఫ్ నేత సలాం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భూములకు విలువ పెరిగిన నేపథ్యంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నారని ఇన్సాఫ్ నేత, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం ఆరోపించారు. ఇన్సాఫ్ నగర కమిటీ సమావేశం ఎండి రెహ్మాన్ అధ్యక్షతన మంగళవారం ఖమ్మంలో జరిగింది. ఈ సమావేశంలో సలాం మాట్లాడుతూ ఈద్గా స్థలం 70 ఎకరాలు ఉండగా కబ్జా చేస్తూ ఇండ్లు నిర్మించుకుంటున్నారని పూటకొక నాయకుడు పుట్టుకొచ్చి ఈ స్థలాలను ఆక్రమిస్తున్నారన్నారు. ఈద్గా మిగులు భూములను నిరుపేద ముస్లింలకు పంపిణీ చేయాలని సలాం కోరారు. కాల్వొడ్డులో షాహీద్ దర్గాకు 16 ఎకరాల భూమి ఉండగా కబ్జాకు గురైందని ఆయన ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మామూళ్ల మత్తులో భూ ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రులు వక్ఫ్‌బోర్డు స్థలాల పై దృష్టి సారించాలని రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సలాం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో షరీఫ్, ఎస్‌కె చానా, ముజమిల్, డా॥ ఖాసిం పాషా, ఎస్‌కె కరీం, ఎస్‌డి ఆస్రఫ్, ఎస్‌కె రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



## భూ సర్వే అడ్డగింత

**ప్రజాపక్షం/ బోనకల్ :** వరద నష్టం అంచనాలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని కొందరు రైతులు ఫిర్యాదు చేయగా సర్వేకు వెళ్లిన అధికారులను కొందరు అడ్డుకున్న ఘటన మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో జరిగింది. రాపల్లి గ్రామంలో వరద బాధిత రైతుల ఎంపికలో తీవ్ర గందరగోళం నెలకొంది. భూమి లేని పలువురిని పరిహారం జాబితాలో చేర్చారు. ఈ విషయమై సోమవారం విచారణ జరపగా పలు అక్రమాలు వెలుగు చూశాయి. మంగళవారం కూడా అధికారులు సర్వే చేసి వాస్తవ వాస్తవాలను తెలుసుకునేందుకు వెళ్లగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కొందరు అడ్డుకుని మా భూములను సర్వే చేయడానికి వీలు లేదంటూ అధికారులను అడ్డగించారు. వాస్తవంగా నష్టపోయినప్పుడు నీకెందుకు భయమని అధికారులు ప్రశ్నిస్తే కొందరు దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ గ్రామంలో పంట వేయని వారికి, భూమి లేని వారికి పరిహారం రావడం గమనార్హం. తప్పిదాలకు పాల్పడిన వారే ఈ సర్వేను అడ్డుకున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి.

## హామీలు అమలు చేయరూ..

గిరిజన సమాఖ్య నేతలు కల్లూరి, భూక్యా

**ప్రజాపక్షం/భద్రాచలం:** పెండింగ్‌లోని ట్రైకార్ సబ్సిడి నిధులు విడుదల చేసి నూతన యాక్షన్ ప్లాన్ వెంటనే ప్రకటించాలని గిరిజన సమాఖ్య జిల్లా బాధ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ అన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దొరలపాలన పాలద్రోలేందుకు రాష్ట్రంలో ఆదివాసీలు, గిరిజనుల పాత్ర ఎంతో ఉందని, కానీ గిరిజనులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని లేదంటే ప్రభుత్వం గిరిజనుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవుతున్నా నేటికి కూడా గిరిజనులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. ఇంత వరకు గిరిజన మంత్రత్వ శాఖను కూడా ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంగిరిజనలుపై సవతి తల్లి ప్రేమను చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 సం. నుండి సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు కావడం లేదని, ట్రైకార్ నుండి 201718, నుండి 2020 వరకు రూ.265 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.



సబ్సిడి నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం వెంటనే చొరవచూపాలని కోరారు. గత నాలుగేళ్లుగా యాక్షన్ ప్లాన్ ఇవ్వకపోగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నిరుద్యోగ యువతీ యువకులు నిరుత్సాహానికి గురవుతున్నారని, వీటి పరిష్కారం కోసం కలెక్టరేట్ల ముందు రాష్ట్ర వ్యాప్తంగా నిరసలు తెలుపుతున్నట్లు చెప్పారు. మరో ప్రక్క రాష్ట్రంలో ఏదో మూల ఆదివాసీలు, గిరిజనులపై భౌతికదాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం పోలీస్ యంత్రాగాన్ని ప్రక్షాళన చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సోంది కుటుంబ రావు, గోవింద్, లక్ష్మయ్య, నగేష్, సత్యనారాయణ, చందర్, వెంకటేశ్వర్లు, శంకర్, నరేష్, శ్రీనివాస్, జానకిరామ్, విజయ్, రమేష్, శివాజీ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఆకట్టుకున్న ఓపెన్ హౌజ్

అడిషనల్ డిసిపి నరేష్‌కుమార్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓపెన్ హౌజ్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుందని అడిషనల్ డిసిపి అడ్మిన్ నరేష్‌కుమార్ తెలిపారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సిటీ ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అడిషనల్ డిసిపి స్వయంగా పోలీసులు వినియోగించే ఆయుధాల పనితీరును విద్యార్థులకు వివరించారు. ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, శ్రమించే తీరు, పని విధానం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అసాంఘిక శక్తులు, సంఘ విద్రోహ శక్తులు, గుమిగూడి అల్లర్లకు పాల్పడే సందర్భాల్లో నివారించేందుకు ఉపయోగించే వివిధ అత్యాధునీక ఆయుధాలు, వాటి పనితీరు, టియర్ గ్యాస్ షెల్, వైర్లెస్సెట్, బాడీవోర్న్, కెమెరాలు, బాంబు డిస్పోజల్స్, సిబ్బంది వినియోగించే పరికరాలు, సైబర్ నేరాలను పసిగట్టే విధానాలు, బ్రిత్ ఎనలైజర్స్, సమాచారం కోసం ఉపయోగించే పరికరాలు తదితర వాటిపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. చోరీలు, హత్యల సందర్భంలో పోలీస్ జాగీలాలు, నేరగాళ్లను గుర్తించే విధానం, బాంబులు కనిపెట్టే తీరు తదితరాల ప్రదర్శన విద్యార్థులను ఆశ్చర్యచకితులను చేసింది. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు అలరించాయి. నేరస్తులను, బాంబులను గుర్తించడం క్రమశిక్షణతో డాగ్ హ్యాండిలర్స్ పాటించే తీరు విద్యార్థులను ఆకర్షించాయి. పోలీస్ శాఖ వినియోగించే ఆధునీక సాంకేతిక పరిజ్ఞానం, క్లూస్‌టీం, కమ్యూనికేషన్, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, 303 తుపాకీ, 7.62ఎంఎం, సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్, 9ఎంఎం ఫిస్టల్, కార్బైన్, ఎంపి5కె. సబ్మెషిన్ గన్, 0.22 రైఫిల్, 5.56 ఎంఎం ఇన్సాస్, వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, ఐటి కోర్ టీం ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



## రక్తదానంతో ప్రాణదాతలు కండి

ఖమ్మం సిపి సునీల్ దత్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రక్తదానం తోఆపద లో ఉన్న వారికి ప్రాణదాతలు కావాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఖమ్మం పోలీస్ సబ్ డివిజన్ వారి ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిభిరం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు...ప్రతీ రెండు సెకన్లకు ఎవరికో ఒకరికి రక్తం అవసరం పడుతుందని అన్నారు. మీ రక్తం ఒకేసారి ఒకరి కన్నా..ఎక్కువ మంది కి సహాయపడుతుందని అన్నారు. సకాలంలో రక్తం అందించలేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఆరోగ్యంగా ఉన్నా... ప్రతీ ఒక్కరూ రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడాలని సూచించారు. యువత సన్మాన మార్గంలో పయనించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు కోసం రక్తదానం చేయటానికి ముందుకు వచ్చి ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. రక్తదానం చేసిన మొత్తం 735 మందికి సర్టిఫికెట్ అందించారు. ఈఅడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు, ఎసిపి తిరుపతిరెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గండు సతీష్, కాంగ్రెస్ నాయకులు కొర్లకుంట్ల నాగేశ్వరరావు, జానకిరామయ్య, వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, గుండా బ్రహ్మం, కడియాల నరేష్, హనుమంతరావు ఆఫ్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేలపై కూర్చొని ఎఇఒలు నిరసన

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** వ్యవసాయ విస్తీరణాధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నేలపై కూర్చు ని ఎఇఒలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఈవోల సంఘం జిల్లా నాయకులు అవినాష్ మాట్లాడారు...ఇటీవల సస్పెండ్ చేసిన ఏఈవో లను వెంటనే విధులలోకి తీసుకోవాలని సూచించారు. డిజిటల్ సర్వే మూడు రోజుల చేసిన తరువాత వాటిలోని ఇబ్బందులు గురించి చర్చిస్తామని చెప్పి సర్వే చేయించారని అన్నారు. కానీ నేటి వరకు యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరపలేదని అన్నారు. ఏఈవో ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బీ.శిరీషా, అరవింద్, శశిరేఖ,సాయి నిఖిల, నవీన్, ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి అభివృద్ధికి సహకారం

సిఎంకు ఎంపి,ఎంఎల్ఎ వినతి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎంపి పోరిక బలరాం నాయక్, స్థానిక ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావు తదితరులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్ వెళ్లిన వారు ఆయన నివాస గృహంలో కలుసుకుని భద్రాద్రి రామాలయ షాలువా కప్పి, జ్ఞాపికను బహుకరించారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, గత పాలకులు ఈ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించారని, ఎలాంటి అభివృద్ధికి కనీసం నిధులు కూడా విడుదల చేయలేదని, రామాలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తలేదని, వరద శాశ్వత నివారణ చర్యలు తీసుకుంటామని చెప్పి నోరు కూడా మెదపలేదన్నారు. యాదాద్రి తరహాలో భద్రాద్రి అభివృద్ధి చేసి తీరతామని చెప్పిన పాలకులు ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని, ప్రజాపాలనలో ప్రభుత్వం భద్రాద్రిపై దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుడగం శ్రీనివాసరావు, బోగాల శ్రీనివాస రెడ్డి, వెంకటరెడ్డి, నవాబ్ తదితరులున్నారు.




## చంద్రమౌళికి సన్మానం

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన నూకల చంద్రమౌళి మంగళవారం కేటీకే 8 ఇంక్లైన్ గని కి మొదటిసారిగా రావడంతో ఆయనను సన్మానించారు. ఎఐటియుసి ఫిట్ సెక్రటరీ ఎల్ శంకర్ ఆధ్వర్యంలో నూకల చంద్రమౌళిని ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ విజేందర్ అధ్యక్షతన కాంట్రాక్ట్ కార్మికులంతాసన్మానించారు. పూరెల్ల శ్రీనివాస్, జనగాం శంకర్, జాఫర్, రాము, నాగరాజు, బాలు, రామారావు, కాంట్రాక్ట్ కార్మికులు తిరుపతి, లక్ష్మి, రాజు, సంపత్, దేవేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా కందికొండ జాతర



ప్రజాపక్షం/మరిపెడ: ప్రజా సంక్షేమం లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రాచంద్రునాయక్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని మరిపెడ, కురవి, సిరోల్ మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. కురవి మండలం కందికొండ లక్ష్మి నరసింహ ఆలయం జాతర పగడ్బంధీగా నిర్వహించాలని, భక్తులకు మెరుగైన వసతులు కల్పన చేయాలని అధికారులకు అదేశించారు. అనంతరం సిరోల్ మండలంలో మాజీ ఎమ్మెల్సీ వెంకటరెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుఉ పెండ్లి రఘువీరా రెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ అఫ్జల్, తాజూద్ధీన్, ముదిరెడ్డి నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండ ఎఆర్ఐగా శోభారాణి

ప్రజాపక్షం/నెక్కొండ : నెక్కొండ తహసిల్దార్ కార్యాలయ ఏఆర్ఐ గా శోభారాణి మంగళవారం వీదుల్లో చేరారు. వాస్తవానికి ఏఆర్ఐ శోభారాణి గత రెండు నెలల క్రితమే నెక్కొండకు బదిలీపై వచ్చారు. ఆర్డిఓ కార్యాలయంలో పని ఒత్తిడి వల్ల డిప్యూటేషన్ గా అక్కడికి తీసుకున్న డివిజన్ అధికారులు, నేడు ఆమెను రిలీవ్ చేయడంతో నెక్కొండలో మళ్లీ వీధుల్లోకి చేరారు. దీంతో 39 గ్రామ పంచాయతీలకు ఒకే ఒక ఆర్ఐ గా పని చేస్తున్న హంస నరేందర్ కు కొంత పని భారం తగ్గి ప్రజలకు అందుబాటులో ఇద్దరు ఉండే అవకాశం ఏర్పడింది.

## 2న బిసి కమిషనర్ పర్యటన

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : నవంబర్ 2న హన్మకొండ కలెక్టరేట్ భవనంలో జరిగే బిసి కమిషనర్ పర్యటనను వరంగల్ ఉమ్మడి జిల్లాలోని బీసీ లంతా పాల్గోని తమ అభిప్రాయాలు కమిషనర్ కు తెలపాలని బిసి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో బీసీల విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయ పార్టీలకతీతంగా వివిధ బిసి కులలు, బిసి సంఘాలు డిమాండ్లను వినతి పత్రాల ద్వారా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## జనార్ధన్ మృతి పట్ల సంతాపం

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : జనగామ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మంగళంపల్లి జనార్ధన్ ఆకస్మిక మృతి వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. జనార్ధన్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనేక బాధ్యతలను ఎంతో ఓపికతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు. కార్మికుల సమస్యలపైన,జనగామపారిశ్రామికఅభివృద్ధి పైన, పేదలకు సాగు భూములు, ఇండ్ల స్థలాల కోసం వారు చేసిన పోరాటాలు మరువరాని వన్నారు.

## ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ

### హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ: హనుమకొండ జిల్లాకు సంబంధించి రెండు నియోజకవర్గాలైన పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా ప్రచురణ జాబితాను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల ముసాయిదా జాబితా పై ఏవైనా అభ్యంతరాలు, మార్పులు చేర్పులు ఉన్నట్లయితే మరియు నూతనంగా ఓటరు నమోదు చేసుకునేవారు నవంబర్ 28వ తేదీ వరకు సంబంధిత ఓటరు నమోదు అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారికి గాని తహసిల్దార్ కార్యాలయాలలో గాని నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రచురణ జాబితా, సిడిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో ఇలా రెవెన్యూ అధికారి వైవి గణేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాస్ రావు, రావు అమరేందర్ రెడ్డి, ఎండి నేహల్, రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి, లక్ష్మణ్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసిలో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జనగామ డిపో ఆర్‌టిసి ఉద్యోగులకు డిపో మేనేజర్ ఎస్ స్వాతి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈపికె సాధించిన ముగ్గురు టీమ్ డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ఇందన పొదుపు చేసిన 10 మంది డ్రైవర్లు , ఒక హైర్ బస్ డ్రైవర్ మొత్తం 23 మందిక మంగళవారం పుష్పగుచ్చాలు ఇచ్చి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ స్వాతి మాట్లాడుతూ ఉద్యోగులు విధుల పట్ల అంకితభావం, పట్టుదల, నిబద్ధతతో పనిచేయడం వలన ఫలితాలు సాధించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి జనగామ డిపోకు మరింత పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి హుస్సెన్, అసిస్టెంట్ మేనేజర్ బి అజయ్‌కుమార్, కె రవీందర్, వై యాదమణిరావు, సూపరిండెంట్ జ యాకయ్య, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు, ఉత్తమ ప్రతిభ కనబ

# క్రీడా స్ఫూర్తి అద్భుతం

### ఎంపి కడియం కావ్య




ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్ : క్రీడలు జాతీయ సమైక్యతభావాన్ని పెంచుతాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ మండలం కరుణాపురంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్పోర్ట్స్ మీట్ 2024ముగింపువేడుకలకుఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానాలను చేపడుతుందని పేర్కొన్నారు. మన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేకత చొరవత స్టేషన్ ఘనపూర్ లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను త్వరలో నిర్మించుకోబోతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల పట్ల ప్రత్యేక శ్రద్ధతో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తా యని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ని పెంపొందించుకోవాలన్నారు. క్రీడలతో శారీరదారుఢ్యం, జ్ఞానం పెరుగుతుందని, క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుని క్రీడల్లో మెళకువలను నేర్చుకుని ముందుకువెళ్లాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమిగెలుపునకునాంది అవుతుందని సూచించారు. సమాజం మీకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరు సమాజానికి తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఉంటుందని అన్నారు. సమాజ నిర్మాణంలో భాగమైన విద్యార్థులు ఇప్పటి నుండే మహిళల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని అన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్ లను విధ్యర్ధులకు అందజేసి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, ఆర్ సి ఓ రాజ్ కుమార్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ట్రైకార్ సబ్సిడీ నిధులివ్వరేమి?



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.265 కోట్ల ట్రైకార్ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు కోరారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32,122 మందికి సంబంధించిన రూ.265 కోట్ల ట్రైకార్ సబ్సిడీ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయడంతో పాటు ఎస్టీ నూతన యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య నిర్మాణ బాధ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా అధ్యక్షురాలు లావుడ్య రమాదేవి,నాయకులు తిరుమల వెంకటేశ్వర్లు,భూక్య స్వరూప, మాలోతు మంగ,లకావత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ



### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వార్ బాష షేక్ ఆదేశించారు. మంగళవారం జనగామ మండలంలోని శామీర్‌పేట, వడ్డకొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్, గోనె సంచులు, అందుబాటులో ఉంచాలన్నారు. శామీర్‌పేట, వడ్లకొండలో ధాన్యం తీసుకొచ్చిన రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లయ్, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

### నవంబర్ 6 నుండి సమగ్ర సర్వే

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 6 నుండి సమగ్ర ఇంటింటి సర్వే నిర్వయించాలన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర బిసి, రవాణ శాఖ మంత్రిఇ పొన్నం ప్రభాకర్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ అధికారులతో సమీక్ష చేశారు. సర్వేకు వెళ్లె ఎన్యుమరేటర్లకు ఐడి కార్డు జారీ చేస్తామని, మండల స్థాయిలో ఎన్యూమరేటర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వయిస్తామన్నారు.

## విజేతలకు అభినందనలు



ప్రజాపక్షం/హనుమకొండ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి హెచ్ఐవి ఎయిడ్స్ క్విజ్ కాంపిటీషన్లో ప్రథమ స్థానంలో నిలిచిన హనుమకొండ జిల్లా విద్యార్థులు కాజీపేట ప్రభుత్వ పాఠశాల, తేజస్వి పాఠశాలకు చెందిన విధాత్రి, కలీముల్లా లను మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తన చాంబర్లో అభినందించారు. వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను కూడా అభినందించి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా వచ్చిన నగదు బహుమతి రూపాయలు ఐదువేలను ఒక్కొక్కరికి అందజేసి త్వరలో నిర్వహించబోయే రీజనల్ స్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, అడిషనల్ డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ మదన్మోహన్ రావు, స్వప్న మాధురి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.అలాగే కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించినటువంటి సంచార హెచ్ఐవి టెస్టింగ్, నిర్ధారణ వాహనాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐసిటిసిలు అందుబాటులో లేని ప్రాంతాలు, హైరిస్క్ ప్రాంతాలలో హెచ్ఐవి బాధితుల కుటుంబ సభ్యులకు ఈ సంచార వాహనం ద్వారా హెచ్ఐవి టెస్టులు, కౌన్సిలింగ్ సేవలు లభిస్తాయి. ఇందులో ఒక కౌన్సిలర్, ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ లలితాదేవి, అడిషనల్ మోహన్ రావు, దిశా మేనేజర్ స్వప్న మాధురి, డెమో వి.అశోక్ రెడ్డి, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి



ప్రజాపక్షం/జనగామప్రతినిధి: అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీసీపీ రాజమహేంద్రనాయక్ హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు చర్యలలో భాగంగా మంగళవారం డీసీపీ జిల్లాలోని ఏసీపీ, సీఐలతో, ఎస్ఐలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా అనుమతి లేకుండా బాణా సంచా విక్రయించరాదన్నారు. అనంతరం పట్టణంలోని బాణాసంచా అనుమతిగల తాత్కాలిక విక్రయ కేంద్రాలను, గోడౌన్‌లను డీసీపీ ఆకస్మికంగా తనిఖీ చేసి వారికి సూచనలు చేశారు. బాణాసంచా అక్రమ ంగా నిల్వ చేసినా, అనుమతి లేకుండా అమ్మేవారి వివరాలను వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలలో ఏసీపీ, సీఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల పట్ల అవగాహన కోసమే ఓపెన్‌హౌస్

### జయశంకర్ ఎస్‌పి కిరణ్ ఖరే



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి విద్యార్థులకు పోలీసు వీధుల పట్ల అవగాహన కోసమే ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ (ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎస్పి కిరణ్ ఖరే పాల్గొని, ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రారంభించారు. భూపాలపల్లి పట్టణానికి చెందిన దాదాపు 500 మంది, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి కిరణ్ ఖరే స్వయంగా పిల్లలకు పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి, బీడీ టీమ్ ఎక్విప్మెంట్, నూతన చట్టాల గురించి, షీ టీమ్స్, భరోసా సెంటర్స్ గురించి, కమ్యూనికేషన్ సిస్టం గురించి, ఫింగర్ ప్రింట్ డివైస్ ల వల్ల కలిగే ఉపయోగాల గురించి, డాగ్ స్క్వాడ్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల గురించి వివరించారు.అనంతరం ఎస్పిమాట్లాడుతూ పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల లో భాగంగా భూపాలపల్లి జిల్లా పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఓపెన్ హౌస్ కార్యక్రమం లో భాగంగా, విద్యార్థిని విద్యార్థులకు ఆయుధాలు, షీ టీమ్స్, ట్రాఫిక్, పోలీస్ విధులు, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్ సిస్టమ్, డాగ్ స్క్వాడ్ మరియు ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న విధుల గురించి అవగాహనా కల్పించడం జరిగిందన్నారు. నూతన చట్టాలు, పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి వివరించారు. విద్యార్థినీ విద్యార్థులకు కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్, విహెచ్ఎఫ్ సెట్ ల గురించి అవగాహన, కల్పించడంతో పాటు, బాలికలు మరియు మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం, షీ టీమ్స్ పని తీరు, పోలీసు శాఖకు సంబంధించిన వివిధ యాప్ ల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 100, గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి (ఆపరేషన్) బోనాల కిషన్, భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నగేష్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, ఆర్ఎస్ఐలు, జిల్లా పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు. వివిధ పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్రంగా ఇంటింటి సర్వే

### జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రక్రియలో సమగ్రంగా ఇంటింటి సర్వేను నిర్వహించడానికి ఎన్యుమరేటర్లు ఖచ్చితమైన శిక్షణను పొంది ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో సామాజిక ఆర్థిక సర్వే నిర్వహణలో సూపర్ వైజర్లు, నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వే నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వే చేపట్టబోతున్న సందర్భంగా సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు శిక్షణ పొంది నిష్ణాతులు కావాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుటుంబాల సమగ్ర సమాచార సేకరణ చేపట్టాలని సూచించారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులాల వారిగా సర్వేలో వివరాలు నమోదులు చేయాలని తెలిపారు. పదిమంది ఎన్యూమరేటర్లను పర్యవేక్షణ చేసేందుకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించాం. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, సిపిఓ బాబూరావు, సంక్షేమ అధికారి చిన్నయ్య, ఆర్డీవో మంగిలాల్ పాల్గొన్నారు.

# సిపిఐకి శత సంవత్సరాలు పూర్తి




ప్రజాపక్షం/కాజీపేట: ప్రజా సమస్యల పరిష్కా రం కోసం ప్రజా ఉద్యమాలునిర్మించి ప్రజల మధ్య ఉండి ప్రజలను చైతన్యం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఉన్న సిపిఐ శత సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. మంగళవారం కాజీపేట మండలం రాంపూర్‌లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం మంద సుమన్ అధ్యక్షతన జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ భారతదేశ స్వా తంత్ర పోరాటంలో సిపిఐ కార్యకర్తలు,నాయకులపై అనేక కుట్రకేసులు బనాయించినా, జైల్లో పెట్టి చిత్రహింసలు పెట్టినా కూడా స్వాతంత్రం సిద్ధించే వరకు ప్రజలను చైతన్యం చేస్తూ విశ్రమించని పోరాటం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సిపిఐని ఆదరించాలని, డిసెంబర్ 10 నుండి 26 వరకు జిల్లా వ్యాప్తంగా వాడవాడల జెండా ఆవిష్కరణ చేసుకొని ఒక పండుగలాగా జరపాలన్నారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మండలకార్యదర్శిమునగాల బిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీన, కొట్టేపాక రవి, మునగాల ఐలయ్య, పూర్ణచందర్, స్వరూప, లక్ష్మి పద్మ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల నిర్వహణపై అవగాహన




ప్రజాపక్షం/వెంకటాపూర్: ప్రధాన వనరులు అయిన వర్షపు నీటిని వృథా కాకుండా భూగర్భ జలాలను భూమిలోకి ఇంకేలా కృషి చేయాలని భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు మల్లికాదేవి అన్నారు. మంగళవారం భూగర్భ జల శాఖ ములుగు ఆధ్వర్యంలో పిస్ ఫర ఆల్ నేషన్స్ స్వచ్ఛంద సంస్థ వెంకటాపూర్ లోని ప్రభుత్వ మైనారిటీ మహిళా జూనియర్ కళాశాలలో భూగర్భ జలాల పెంపు నిర్వహణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న భూ గర్భ జలశాఖ డిప్యూటి డైరెక్టర్ సిహేచ్ మల్లికా దేవి మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణంలో, ప్రతి పరిశ్రమలో కార్యాలయాల్లో పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసు కోవాలన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందన, ములుగు జిల్లా ఆర్. ఎల్ సి రమేష్, వెంకటాపూర్ ఎస్ టి సతిష్, పీస్ ఫర్ ఆల్ నేషన్ సిఓ సాల్మాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్‌ల దొంగ పట్టివేత

### 334 గ్రాముల బంగారం, 1.6 కిలోల వెండి, నగదు స్వాధీనం




ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : బెట్టింగ్ యాప్‌లకు పాల్పడుతున్న దొంగను కేయూసీ పోలీసులు పట్టుకున్నారు. కాగా అరెస్టు చేసిన నిందితుడి నుంచి పోలీసులు సుమారు రూ. 28.50 లక్షల విలువైన 334 గ్రాముల బంగారం, 1640 గ్రాముల వెండి, రూ. 13 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్, చోరీలకు ఉపయోగించి సాధనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడిస్తూ రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు ప్రస్తుతం హన్మకొండ సుబేదారి పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. నిందితుడు ధర్మరాజు డిగ్రీ పూర్తిచేసి కొద్ది కాలం రాయపర్తి మండల కేందరలో బిర్యాని సెంటర్ నిర్వహించి నష్టపోవడంతో హన్మకొండ పోస్టల్ కాలనీలో విద్యార్థినంటూ ఇంటికి కిరాయికి తీసుకున్నాడు. కాగా నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు నిందితుడు వివిధ మార్గాల్లో వ్యక్తిగత రుణాలు తీసుకొని ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడటం ద్వారా నష్టపోయి తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించలేక పూర్తిగా అప్పులపాలయ్యాడు. దీంతో నిందితుడు తన అప్పులు తీర్చడంతోపాటు సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాల మార్గాన్ని ఎంచుకొని దొంగగా మారి చోరీలు చేసేందుకు సాధనాలను సమకూర్చుకోవడంతోపాటు తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ పగటి పూట తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి సమయాల్లో ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడేవాడు. ఇదే రీతిలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 17 చోరీలకు పాల్పడగా ఇందులో కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8, హన్మకొండ, సుబేదారి, సంగెం, ఘన్‌పూర్, పాలకుర్తి, దేవురుప్పల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చోరీలకు పాల్పడ్డాడు. ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటేచేశారు. ఈ దర్యాప్తులో భాగంగా పోలీసులు తమ వద్ద ఉన్న ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నిందితుడిని గుర్తించడంతో పాటు అతనిపై నిఘా పెట్టారు. నిందితుడు మంగళవారం తాను చోరీ చేసిన చోరీ సొత్తు అమ్మేందుకు వాహనంపై కేయూసీ వైపు వస్తున్నట్లుగా పోలీసులకు పక్కా సమాచారం రావడంతో సీసీఎస్, కేయూసీ పోలీసులకు పట్టుపడటంతో పోలీసుల విచారణలో నిందితుడు పాల్పడిన నేరాలను అంగీకరించగా నిందితుడి నుంచి పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి పట్టుకొని దొంగ సొత్తు రికవరీ చేయడంలో ప్రతిభ కనబర్చిన సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, అదనపు డీసీపీ రవి, క్రైమ్ ఏసీపీ బోజ రాజు, హన్మకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ వరప్రసాద్, రఘు, శివకుమార్, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఏఏఓ సల్మాన్ పాషా, సీసీఎస్ ఏఎస్సై శివకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు నజీం అహ్మద్, జంపయ్య, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, మధూకర్, రాములు, వెంకన్న, కేయూసీ క్రైం టీమ్‌లను సీపీ అభినందించారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు




**ప్రజాపక్షం/ ఇచ్చోడ :** నాలుగు వరుసల జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిందని గుడిహత్నూర్ ఎస్ఐ షేక్ ఇమ్రాన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నా యి. ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన జాధవ్ మధుకర్ (32), రమ్య కృష్ణ (29) దంపతులు కలిసి టిఎస్ 01, ఈజే 7772 నంబర్ గల బైక్‌పై పని నిమిత్తం ఆదిలాబాద్‌కు వెళ్తున్నారు. డొంగర్ గావ్ గుడిహత్నూర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న కారు బైక్‌ను డీ కొట్టింది. రమ్య కృష్ణ తలకు, ముఖానికి బలమైన గాయాలై తీవ్రరక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో మధుకర్‌కు తీవ్రగా యాలయ్యాయి. 108లో క్షతగాత్రుడితో పాటు మృత దేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన కారు ఆచూకి కోసం సీసీ కెమెరాల ఆధారంగా గాలిస్తున్నామని ఎస్ఐ వివ రించారు.

## రైతులు పండించిన ప్రతీ ధాన్యంగింజ కొనుగోలు

ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అక్కారం, శ్రీగిరిపల్లి, బంగ్ల వెంకటాపూర్, గిరి పల్లి గ్రామాల్లో ఐకెపి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్‌తో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుండగా, సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు, ఐకెపి నిర్వాహకులు చెప్పే విధంగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రయోజనం పొందాలని సూచించారు. కాగా గ్రేడ్ మొదటి రకం ధాన్యానికి రూ.2320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300 లు చెల్లించనున్నట్లు తెలిపారు. అయితే దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, యాదగిరి, నర్సింహ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి, సర్పంచులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** రుద్రూరులోని వ్యవసాయ కృషి కేంద్రంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అగ్రికల్చర్ అధికారులతో కలిసి చెరుకు, కూరగాయల పంటలలో కొత్త వంగడాలపై రైతులకు అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు గంగారెడ్డి, ముత్యంరెడ్డి, తదితరులు రైతులు పాల్గొన్నారు.

## బిసిలకు వాటా... రాహుల్‌గాంధీ ఉద్దేశం



**ప్రజాపక్షం, నిజామాబాద్ ప్రతినిధి :** బిసి బడుగు బలహీన వర్గాల ప్రజలకు వాటా రావలన్నదే రాహుల్‌గాంధీ ముఖ్య ఉద్దేశమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం బిసి కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో ఎమ్మెల్యే పాల్గొని కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల జనగణన, వారి స్థితిగతులపై అధ్యయనం జరగాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమం కోసం పని చేస్తోందని, బిసి కమీషన్‌ను నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. జనాభా దామాషా ప్రకారం బిసిలకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలని, స్థానిక సంస్థల్లో జనాభా దామాసా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు దక్కాలన్నారు.ఆయనతో పాటు ఎన్‌డిసిసిబి చైర్మన్ తారాచంద్‌నాయక్, బిసి నాయకులు ఆదే ప్రవీన్ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తోందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం పెంబి మండల కేంద్రంలో రూ.1 కోటి 50 లక్షలతో నిర్మించిన పిహెచ్‌సి ఆసుపత్రిని పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచనలు చేశారు.ఈ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి వైద్యులను నియమించేలా చర్యలు చేపడుతామన్నారు.ఫారెస్ట్ అధికారులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వన్యప్రాణులతో పాటు మనుషులు నివాసయోగ్యంగా ఉండే ప్రాంతాలలో ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. అలాగే 120 లక్షలతో ఉన్నత పాఠశాల అదనపు గదుల ప్రారంభం చేసిన తర్వాత ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్,డిఈఓ రవీందర్ రెడ్డి,పెంబి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి,వైద్య సిబ్బంది,అధికారులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# దేశీయంగా స్టంట్‌లు తయారీతో తగ్గనున్న గుండె ఆపరేషన్ల ఖర్చు



రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

ఆయుస్మాన్ భారత్ పిఎం జన్ ఆరోగ్య యోజనను ప్రారంభించిన ప్రధాని మోడీ

**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి :** దేశీయంగా స్టంట్‌లు తయారు చేయడం వల్ల గుండె ఆపరేసన్ల ఖర్చు తగ్గుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా, ఐటి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో గుండె ఆపరేషన్లకు సంబందించి స్టంట్లను తయారుచేసి సహజ ఆనంద్ మెడికల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు కావడం రాష్ట్రానికి గర్వకారణమని వారు చెప్పారు. ధన్వాంతర జయంతి 9వ ఆయుర్వేధ దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఢిల్లీలో ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పిఎం జన్ ఆరోగ్య యోజన కార్యక్రమానికి సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కు సహజ ఆనంద్ మెడికల్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కమైన స్టంట్లను తయారుచేయునట్లు మంత్రులు తెలిపారు. దేశీయంగా స్టంట్‌లు తయా రు చేయడవ వల్ల గుండె ఆపరేషన్ల ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు. ఇలాంటి పరిశ్రమ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ డివైస్ పార్కులో ఏర్పాటు కావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆడ్‌డిఓ రవీందర్‌రెడ్డి, సహజానంద్ ,మెడికల్ టెక్నాలజీ ఎండి ఎస్ ధీరజ్, లాల్ కోబడియా, పరిశ్రమల శాఖ అధికారులు సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. సంస్థలో ఏర్పాటు చేసిన దృశ్య మాధ్యమం ద్వారా వారు హజరైనారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి , టిజిఐఐ విష్ణువర్ధన్ రెడ్డి సిఎంఒ కార్యాలయ అధికారి అజి త్ రెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లతో కలిసి మంత్రులు శ్రీధర్ బాబు దామోదర్ రాజనర్సింహ్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహజానంద్ టెక్నాలజీ ప్రైవేట్ సంస్థ గుండె ఆపరేషన్లతో కీల



# మార్కెట్ భవనానికి గుండా మల్లేష్ పేరు

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయాల మార్కెట్ భవనానికి కామ్రేడ్, అమరజీవి గుండా మల్లేష్ పేరు పెట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐ కార్యాలయం (భాశెట్టి గంగారాం విజ్ఞాన్ భవన్)లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ బెల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనానికి జాతీయ నాయకులు భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన మహనీయులు గడ్డం వెంకట్ స్వామి పేరు పెట్టడం సరైనది కాదని, కూరగాయల మార్కెట్ భవనానికి వారికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. స్థానికుడైన ఉద్యమ నేత, నాలుగు సార్లు ఎంఎల్‌ఎగా చేసి నిజాయితీకి నిదర్శనమై అక్రమార్చనకు తావులేకుండా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పోరాట కెరటం అయినటువంటి గుండా మల్లేష్ పేరు పెట్టడం సరైనదని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి గౌరవ మున్సిపల్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీగా ఖండిస్తున్నామని, ఈ విషయాన్ని పునః సమీక్షించి మరొక సారి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి గుండా మల్లేష్ పేరును నామకరణం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నామని, లేనియెడల అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి మాట్లాడుతూ ఇంతకు ముందు ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఏ, ఆర్‌డిఓ, మున్సిపల్ కమిషనర్, ఎంఆర్‌ఓ, చైర్ పర్సన్‌లకు కూడా మెమొరాండం ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. కూరగాయల మార్కెట్ ఏర్పడింది గుండా మల్లేష్ ద్వారా కనుక ఆ మార్కెట్ సముదాయానికి గుండా మల్లేష్ పేరు పెట్టడం సమంజసమని, మున్సిపల్ కౌన్సిలర్లు దీనికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, బికెఎంయు జాతీయ సమితి సభ్యులు అక్కపల్లి బాపు, బెల్లంపల్లి మండ ల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి కొంకుల రాజేష్, జిల్లా బికెఎంయు జిల్లా కార్యదర్శి గుండచంద్ర మాణి క్యం, బెల్లంపల్లి పట్టణ ప్రచార కార్యదర్శి పుట్ట శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలకు ప్రభుత్వం కృషి

ఎంపి గోడం నగేష్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్ అన్నారు. మంగళవారం పెంబి మండల కేంద్రంలో పంచాయతీరాజ్ విశాఖ ద్వారా రూ.1కోటి 56 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పార్లమెంట్ సభ్యులు పాల్గొన్ని మాట్లాడుతూ,ఆరోగ్యమే మహాభాగ్యమని పెంబి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఏర్పడిన పెంబి మండలంలో విద్యా, వైద్యం, రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జూనియర్ కళాశాల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఖానాపూర్ శాసనసభ్యుడు మాట్లాడుతూ,నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ నిరంతరం వైద్య సేవలు అందించాలని సూచించారు. మారుమూల గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనంలో అధునాతన వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు.అలాగే సబ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డిఇఓ రవీందర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఇఇ నర్సయ్య, ఎంపిడిఓ,రమాకాంత్, అధికారులు, వైద్య సిబ్బంది,గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

## యువ హీరో అనిల్ మొగిలికి మంచి భవిష్యత్తు

ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి




**ప్రజాపక్షం/గజ్వేల్ :** గ్రామీణ ప్రాంత నటీ నటులను ప్రోత్సహించాలని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నేత చెప్పాల రాజా రావు పేర్కొన్నారు. గజ్వేల్ ప్రాంత సినీ నటుడు అనిల్ మొగిలి, ప్రముఖ ఫోక్ వీడియో డాన్సర్ జాను లిరి ఉమ్మడిగా నటించిన తాజా ప్రైవేట్ ఫోక్ ఆల్బమ్ పొరుషాల పిల్లగాడు ప్రోమో పోస్టర్‌ను మంగళవారం గజ్వేల్‌లో ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ఇతివృత్తంతో రూపొందించిన ఈ చిత్ర ఆడియో సాంగ్ అద్భుతంగా ఉందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే సింగర్ పాడిన ఇన్‌స్టాగ్రామ్ సంఖ్య 20 లక్షలు దాటగా, అశేష ప్రేక్షకాదరణతో హిట్ అవుతుందని ఆకాంక్షించారు. పెద్ద హీరోలను కాకుండా గ్రామీణ ప్రాంత యువ హీరోలు రూపొందిస్తున్న గ్రామీణ ప్రాంత కథలు, వాతావరణతో కూడిన చిత్రాలు ఆదరించాలని పేర్కొన్నారు. తద్వారా అనిల్ మొగిలి వంటి యువ హీరోలు రాణించి చక్కటి భవిష్యత్తుతో దూసుకెళ్తారని అన్నారు. అయితే అనిల్ మొగిలి నటించిన పలు చిత్రాలు ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద బద్దలు కొట్టగా, ఆ యువ హీరో ప్రేక్షకుల్లో మంచి క్రేజీ సంపాదించుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# అభివృద్ధే ఊపిరిగా.. 'స్మార్ట్ సిటే' లక్ష్యంగా

నియోజకవర్గ రూపురేఖలు మార్చనున్న ఎంఎల్ఎ కొక్కిరాల



**ప్రజాపక్షం/ మంచిర్యాల క్రైం :** సింగరేణి సిరులతో పాటు అన్ని రకాల వనరులు ఉన్న మంచిర్యాల నియోజక వర్గం గత పాలకుల వల్ల వెనుకబడిపోయింది. వ్యాపార పరంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతున్న మంచిర్యాల పట్టణం మున్సిపాలిటి అభివృద్ధి పరంగా మిన్నుకుండి పోయింది. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలోనే గ్రేడ్ వన్ మున్సిపల్‌గా ఉన్న మంచిర్యాల మున్సిపాలిటి 10 ఏండ్ల బిఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడి పోయిందని చెప్పవచ్చు. ప్రస్తుతం ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి పరంగా ఆయనకు ఉన్న ఆశయం దానికి ఉన్న సంకల్పం చూస్తే త్వరలోనే మంచిర్యాల పట్టణ రూపు రేఖలు మారి పట్టణం స్మార్ట్ సిటీగా మారుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని గర్భిణీల కొరకు మాత శిశు ఆసుపత్రితో పాటు అన్ని రకాల వైద్య సదుపాయాలను సకాలంలో అందే విధంగా కొత్త ఆసుపత్రిని నిర్మించే సంకల్పంతో ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగుతున్నారు. మంచిర్యాల పట్టణంలోని వ్యాపారవేత్తలు వారి స్వలాభం కొరకు రోడ్డుని ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తుండేవారు, కానీ ఎంఎల్ఏగా ప్రేమ్ సాగర్ రావు గెలిచిన అనంతరం ప్రజల సంక్షేమం, సౌకర్యం దృష్ట్యా వ్యాపార సముదాయాలు అక్రమంగా ఆక్రమించిన వాటిలోని నిర్మాణాలను తొలగించి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. చుట్టుపక్కల పట్టణాల, పల్లె ప్రాంతాల ప్రజలకు సకల సదుపాయాలతో ఏడు అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించడం కోసం కంకణం కట్టుకున్నారు.

**పార్టీకి అత్యంత విధేయుడుగా ప్రేమ్ సాగర్ రావు**

గత 10 ఏళ్ల కాలంలో ఎందరో నాయకులు వారి స్వలాభం, ఉనికిని కాపాడుకునేందుకు పార్టీలు మారుతుపోయారు. కానీ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో కూడ పార్టీకి విధేయుడుగా ఉంటూ, ప్రజా సేవలో ఉండి ప్రజల కష్టాల్లో పాలుపంచుకున్నారు. ప్రస్తుత మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు రాజకీయపరంగా ఆయన పై ఎన్ని నిందలు మోపిన సహిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఆయనకు మంత్రి పదవి రాకుండా ఉండేందు కూడ ఎన్నో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

## ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి రైతులకు అన్యాయం

జిల్లా కలెక్టర్‌కు సిపిఐ నాయకుల వినతి



**ప్రజాపక్షం/నిర్మల్/ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పత్తి మార్కెట్‌లో రైతులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, సిపిఐ నాయకులు మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ ద్వారా 8 శాతం తేమ శాతానికి 7521 చెల్లిస్తున్న సిసి అధికారులు అదనంగా రైతులకు తెలియకుండా 75 రూపాయలను, కమిషన్ పేరుతో కట్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు ఎక్కువ కింటాలకు రూ.7221 మాత్రమే చెల్లిస్తున్నారని తెలియజేశారు. ఇలాంటి మోసాలతో రైతులకు అన్యాయం జరగకుండా చూడిలని విజ్ఞప్తి చేశారు. ఇందులో నాయకలు అరుణ్ కుమార్,గణేష్ తదితరులు ఉన్నారు.

## తడిసిన ధాన్యంతో పాటు చివరి గింజ వరకు కొనుగోలు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి నేడు అధికారంలోకి వచ్చాక వరి ధాన్యంలో రకాలు వేరు చేసి దానికి ధాన్యాన్ని కొలతలు చేసి బోనస్ ఇస్తామనడం సరికాదని వరి, మొక్కజొన్నలకు మద్దతు ధరతో పాటు బోనస్ తప్పకుండా ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తునికి ముట్రాజ్ పల్లి వెంకటాపూర్ మహమ్మద్ నగర్ గ్రామాలలో సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిగా హాజరై ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి వెంకట్రావుపేట్ గేటు వద్ద మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా వరి ధాన్యానికి మక్కజొన్నలకు బోనస్ ఎలాంటి షరతులు విధించకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ చిలుముల చిన్నంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోరీ శ్రీనివాస్ రావు, మాజీ సిడిసి చైర్మన్ దుర్గారెడ్డి మాజీ ఎంపిపి రాజు నాయక్, వైస్ ఎంపిపి నవీన్ కుమార్ గుప్తా, మాజీ ఎంపిపి రుద్రప్ప, సీనియర్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సాగు చట్టాలు, న్యాయ సహాయంపై అవగాహన




**ప్రజాపక్షం/మందమర్రి :** రైతులు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, దేశానికి అన్నం పెట్టే రైతులకు న్యాయ సలహాలు అందించడంలో, న్యాయం చేయడంలో న్యాయస్థానాలు ఎప్పుడు ముందుంటాయని జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవా అథారిటి సెక్రటరీ అర్పిత మారం రెడ్డి అన్నారు. మంగళవారం మందమర్రి మండలంలోని సండ్రోంపల్లి వద్ద గల రైతు వేదికలో మండల పరిధి లోని రైతులకు మంచిర్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవా అథారిటి సెక్రటరీ అర్పిత మారం రెడ్డి రైతు సాగు చట్టాలు, న్యాయ సహాయ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విత్తన చట్టం, ఆర్ఓఆర్ చట్టం సవరణలు, భూ సంస్కరణలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి జి.కల్పన ప్రభుత్వ పరంగా వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. చెన్నూరు ఎడిఏ బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా సంబంధిత డీలరు ద్వారా రశీదు పొంది పంట చేతికి వచ్చే వరకు భద్రపరచుకోవాలని, అలాంటప్పుడే పంటకు విత్తనం ద్వారా నష్టం వాటిల్లినప్పుడు చట్ట పరంగా న్యాయం పొందవచ్చునని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి ప్రభుత్వ పథకాలైన రైతు బీమా, రైతు భరోసా, పిఎం కిసాన్, రైతు రుణ మాఫీ వంటి పథకాలు, చట్ట భద్రతపై అవగాహన కల్పించారు. న్యాయ సేవా డిఫెన్స్ కౌన్సిల్ అధికారి ఎండి. సందాని రైతులు సాగు చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు ముత్యం తిరుపతి, కనకరాజు, ఇజిఎస్ ఎపిఒ రజియా సుల్తానా, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య, మాజీ సర్పంచులు కోట రాయలింగు, సోదరి పుణ్ణం, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్, పాఠశాల, మున్సిపల్ కార్యాలయాలకు స్థల పరిశీలన

గూడెం మహిపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/పటాన్‌చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నియోకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య రోడ్డులో నూతనంగా నిర్మించనున్న పోలీస్ స్టేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మున్సిపల్ కార్యాలయానికి సంబందించిన స్థలాలను పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. పాఠశాలకు రెండెకరాల పోలీస్ స్టేషన్‌కు రెండు ఎకరాలు, మున్సిపల్ కార్యాలయానికి రెండెకరాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా పనులు ప్రారభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మున్సిపల్ కమీషనర్ జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు ఏర్పాట్లు

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి :** సామాజిక ,విద్య, ఆర్థిక ఉద్యోగ, రాజకీయ కుల అంశాలపై సర్వేకు సంబందించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో ఇంటింటి సర్వే కార్యక్రమం ఏర్పాట్లపై సంబందిత తహసీల్దార్లు ,మున్సిపల్ కమిసనర్లు మండల పరిషత్ అధికారులతో వీడియో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వే కోసం ఎన్యూమరేటర్లు ఎమ్యూనేటర్ల బ్లాక్ హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలం వారిగా ఎంపిడిఓలు తహసీల్దార్లు ఎమ్యూనేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి వారి వివరాలను బ్లాక్‌ల వారీగా అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిఫల్ కమిషనర్లకు ఆదేశించారు. రెవన్యూ గ్రామాలు, గ్రామ పంచాయతీలలో విలీనం కావడంతో ఎదురవుతున్న సమస్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేట్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి తహసీల్దార్ ఎంపిడిఓ దగ్గర గ్రామ పంచాయతీలు ,మున్సిపాలిటీల నివాస స్థలాలు మ్యాప్‌లు హౌస్ లిస్టింగ్ పార్మాట్, 57 ప్రశ్నల పార్మాట్ సర్వే పూర్తి అయిన ఇంటిపై అతికించు స్టిక్కర్ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ లు పిపిటీ ద్వారా సర్వే ఏవిధంగా చేయాలన్నది అందరికి అవగాహన కల్పించారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రేయినింగ్ కలెక్టర్ మనోజ్, జడ్‌పి సిఇఒ జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ



## స్మృతి మందాన శతకం..
### న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం!

న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 2–1తో కైవసం చేసుకుంది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన సిరీస్ డిసైడర్ మ్యాచ్ అయిన మూడో వన్డేలో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన(122 బంతుల్లో 10 ఫోర్లతో 100) సూపర్ సెంచరీతో విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ 49.5 ఓవర్లలో 232 పరుగులు చేసింది. బ్రూక్ హాల్లీడే(96 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 86) తృటిలో శతకం చేజార్చుకోగా.. జార్జియా ప్లిమ్మర్(39) కీలక ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ(3/39) మూడు వికెట్లు తీయగా.. ప్రియా మిశ్రా(2/41) రెండు వికెట్లు పడగొట్టింది. రేణుకా సింగ్, సైమా థాకోర్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లకు 236 పరుగులు చేసింది. స్మృతి మంధాన శతకంతో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(68 బంతుల్లో 8 ఫోర్లతో 70 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. న్యూజిలాండ బౌలర్లలో హన్నా రోవే రెండు వికెట్లు తీయగా.. సోఫియా డివైన్, ఫ్రాన్ జోనాస్ తలో వికెట్ తీసారు. 233 పరుగుల లక్ష్యచేధనలో టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. ఓపెనర్ షెఫాలీ వర్మ(12) తీవ్రంగా నిరాశపర్చగా.. యస్తికా



భాటియాతో కలిసి మంధాన ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. రెండో వికెట్‌కు 72 పరుగులు జో డించిన అనంతరం యస్తికా భాటియా సోఫియా డివైన్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. క్రీజులోకి హర్మన్‌ప్రీత్ కౌర్ రాగా.. స్మృతి మంధాన 73 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. ఆచితూచి ఆడిన ఈ జోడీ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. కాస్త దూకుడుగా ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ 54 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. స్మృతి మంధాన 121 బంతుల్లో సెంచరీ సాధించింది. ఆ వెంటనే మంధాన ఔటవ్వగా.. క్రీజులోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్(11) గెలుపు ముంగిట పెవిలియన్ చేరింది. తేజల్ హసాబిన్స్‌తో కలిసి హర్మన్‌ప్రీత్ కౌర్ విజయలాంఛనాన్ని పూర్తి చేసింది.

## ఆ ఇద్దరి వల్లే టీమిండియాకు వరుస పరాజయాలు..!





టీ20 ప్రపంచకప్ 2024 విజయంతో 11 ఏళ్ల ఐసిసి టైటిల్ నిరీక్షణకు టీమిండియాకు తెరదించింది. ఈ గెలుపుతో 2007 టీ20 ప్రపంచకప్ తర్వాత మరో పొట్టి కప్‌ను ముద్దాడింది. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత ఐసీసీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ చిరస్మరణీయ విజయంతో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియాకు తిరుగుండదని అంతా అనుకున్నారు. మరిన్నీ ఐసిసి టైటిళ్లు కూడా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులో కూడా భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. టీమిండియా హెడ్ కోచ్ బాధ్యతల నుంచి రాహుల్ ద్రవిడ్ తప్పుకోగా.. గౌతమ్ గంభీర్ కొత్త కోచ్‌గా ఎంపికయ్యాడు. అతని పర్యవేక్షణలో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. అనూహ్యంగా శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్ కోల్పోయింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ చేజారింది. భారత గడ్డపై న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. అయితే టీమిండియా వరుస పరాజయాలకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల పేలవ బ్యాటింగే ప్రధాన కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీ20 ప్రపంచకప్ తర్వాత వారి బ్యాటింగ్ గణంకాలను పరిశీలిస్తే ఈ వాదన నిజమేనని‌పిస్తోంది. టీ20 ప్రపంచకప్ విజయానంతరం రోహిత్ శర్మ.. ఇప్పటి వరకు 11 ఇన్నింగ్స్‌లు ఆడి మూడు అర్థ సెంచరీలు మాత్రమే నమోదు చేశాడు. ఇందులో రెండు శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో సాధించినవే. అంతేకాకుండా ఈ 11 ఇన్నింగ్స్‌ల్లో ఐదు సార్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఈ 11 ఇన్నింగ్స్‌ల్లో అతని పరుగుల సగటు మరీ దారుణంగా 25.3గా ఉంది. మరోవైపు విరాట్ కోహ్లీ కూడా ఇదే పేలవ ప్రదర్శన కనబరుస్తున్నాడు. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో 76 పరుగులతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన కోహ్లీ.. ఆ తర్వాత 11 ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ 11 ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. అది కూడా న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసన తొలి టెస్ట్.. రెండో ఇన్నింగ్స్‌లో చేసిందే. ఈ 11 ఇన్నింగ్స్‌ల్లో మూడు సార్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. అతని సగటు కూడా రోహిత్ శర్మలానే 25.3గానే ఉంది. ఈ ఇద్దరి పేలవ ప్రదర్శనే టీమిండియా పరాజయాలకు కారణమనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కోహ్లీ, రోహిత్ కెరీర్‌లు చివరి దశలో ఉన్నాయనే విషయాన్ని ఈ గణంకాలు స్పష్టం చేస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## 'చిరు' ఆతిథ్యానికి కృతజ్ఞతలు- అమితాబ్

ప్రతిష్టాత్మకమైన ఏఎన్నార్ నేషనల్ అవార్డు ప్రదానోత్సవంలో అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా ఏఎన్నార్ జాతీయ పురస్కారాన్ని మెగాస్టార్ చిరంజీవి అందుకున్నారు. ఈ వేడుక నిన్న కన్నుల పండువగా జరిగింది. ఐతే, ఈ అవార్డు ప్రదానోత్సవంలో బిగ్ బి అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ.. ''ఈ వేడుక పై నా ద్వారా చిరంజీవికి ఏఎన్నార్ జాతీయ అవార్డును అందించడం చాలా సంతోషంగా, ఓ గౌరవంగా భావిస్తున్నాను. నాపట్ల చిరంజీవి చూపే ప్రేమాభిమానాలకు, స్నేహభావానికి.. ఆతిథ్యానికి చాలా కృతజ్ఞతలు' అని అమితాబ్ చెప్పుకొచ్చారు. అమితాబ్ ఇంకా మాట్లాడుతూ.. 'సైరా నరసింహారెడ్డి', 'కల్కి 2898ఎ.డి' సినిమాలతో నన్ను తెలుగు ఇండస్ట్రీలో ఒక భాగం చేశారు. ఇప్పుడు నన్ను నేను తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన నటుణ్ని అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాను. చిరంజీవి, నాగార్జున, నాగ్ అశ్విన్.. ఇకపై మీ నుంచి రాబోయే సినిమాల్లోనూ నాకు అవకాశాలు ఇవ్వడాన్ని మర్చిపోవద్దు' అంటూ అమితాబ్ బచ్చన్ కామెంట్స్ చేయడం విశేషం. ఈ వేడుకలో నాగార్జున మాట్లాడుతూ.. ''నాన్న శత జయంతి వేడుకల సందర్భంగా ఏఎన్నార్ జాతీయ పురస్కారాన్ని చిరంజీవికి అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

# రీల్

## పాన్ ఇండియా సూపర్ హీరో ఫిల్మ్ 'కాల భైరవ'



రాఘవ లారెన్స్ హీరోగా ఏ స్టూడియోస్ ఎల్ఎల్పి, గోల్ మైన్ టెలీ ఫిల్మ్స్ నీలాద్రి ప్రొడక్షన్స్, హవీష్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రమేష్ వర్మ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్ ఇండియా సూపర్ హీరో ఫిల్మ్ 'కాల భైరవ' రాక్షసుడు, ఖిలాడి వంటి చిత్రాలను రూపొందించిన ప్రముఖ నిర్మాత కోనేరు సత్యనారాయణ ఇప్పుడు ఏ స్టూడియోస్ ఎల్ఎల్పి బ్యానర్‌పై మరో ప్రెస్టీజియస్ చిత్రాన్ని నిర్మిస్తునారు. ఏ స్టూడియోస్ ఎల్ఎల్పి, గోల్ మైన్ టెలీ ఫిల్మ్స్ నీలాద్రి ప్రొడక్షన్స్, హవీష్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. వైవిధ్య మైన పాత్రలు, చిత్రాలతో మెప్పిస్తోన్న డైనమిక్ స్టార్ రాఘవ లారెన్స్ ఇందులో హీరోగా నటిస్తున్నారు. కొరియోగ్రాఫర్, డైరెక్టర్, యాక్టర్గా తనదైన ముద్ర వేసిన లారెన్స్ కెరీర్లో 25వ చిత్రంగా ఇది రూపొందుతుండటం విశేషం.



## కుటుంబ భావోద్వేగాలతో కూడిన అద్భుతమైన చిత్రం లక్కీ భాస్కర్ : మీనాక్షి

వైవిధ్యభరితమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస విజయాలను ఖాతాలో వేసుకుంటున్న ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ 'లక్కీ భాస్కర్' అనే మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రానికి, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడు. దీపావళి కానుకగా అక్టోబర్ 31వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక మీనాక్షి చౌదరి, చిత్ర విశేషాలను పంచుకున్నారు. లక్కీ భాస్కర్ ప్రయాణం ఎలా సాగింది? సితార సంస్థలో పనిచేయడం ఎలా ఉంది? గుంటూరు కారం తర్వాత సితార ఎంటెర్టైన్మెంట్స్ లో ఇది నా రెండో సినిమా. ఈ మంచి సినిమాలో భాగం కావడం నాకు సంతోషంగా ఉంది. సితార సంస్థ నన్ను కుటుంబసభ్యురాలిలా చూస్తుంది. ఈ అవకాశమిచ్చిన చినబాబు గారికి, వంశీ గారికి కృతజ్ఞతలు.

## సిండికేట్ బంధం

(మొదటి పేజీ తరువాయి)

గుత్తాధిపత్యం కోసం మోదీ తీసుకున్న చర్యలు బట్టబయలవుతున్నాయని, తక్షణమే సిండికేట్ వ్యవహారంపై జెపిసి వేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. సెబీ నిఘాలో ఉన్న ఇండియా బుల్స్ గ్రూప్‌తో సంబంధం ఉన్న కంపెనీకి బచ్ తన స్థలాన్ని అద్దెకు ఇచ్చారని ప్రతిపక్షం తీవ్ర ఆరోపణలు చేసింది. దీనిపై బచ్ లేదా అదానీ గ్రూపు నుంచి స్పందన రాలేదు. ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయంలో కాంగ్రెస్ మీడియా విభాగం హెడ్ పవన్ ఖేడా మాట్లాడుతూ సెబీ పూర్తి స్థాయి సభ్యుడు అనంత్ నారాయణ్ కూడా 2022 అక్టోబర్ నుంచి ముంబైలోని తన స్థలాన్ని ఐఎంసి ఇండియా సెక్యూరిటీస్ అనే బ్రోకరేజ్ సంస్థకు సంబంధించిన స్టాక్ బ్రోకర్‌కు అద్దెకు ఇచ్చారని తెలిపారు.

## 'ఫార్ములా–ఈ కార్ రేస్' కుంభకోణంపై ఎసిబికి ఫిర్యాదు..?

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మెడకు 'ఫార్ములాఈ కార్ రేస్' కుంభకోణం ఉచ్చు బిగిస్తుందని విశ్వసనీయ సమాచారం. ఫార్ములాఈ కార్ రేస్ నిర్వహణకు సంబంధించి నిధుల గోల్మాల్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కోసం జరిపిన కేటాయింపులపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులకు మున్సిపల్ శాఖ అధికారులు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని మున్సిపల్ శాఖ కోరింది. కోట్లల్లో నిధులు బదిలీలు జరగడంపై మున్సిపల్ శాఖ విచారణ కోరింది. నిబంధనలు పాటించకుండా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డౌలప్‌మెంట్ అథారటీ (ఎమ్ఎయుడి) నిర్వహణ సంస్థ ఎఫ్ఇఒకు రూ. 55కోట్ల చెల్లింపులు చేశాయి. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు పాటించకపోవడంతో ఫార్ములా ఈ రేసింగ్ సెషన్ 10 రద్దు అయ్యింది. ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రూ.55 కోట్లు విదేశీ సంస్థకు నిధుల చెల్లింపులు జరిగాయి. ఈ విషయం



పైనే మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గత ఏడాది ఫిబ్రవరి11న హైదరాబాద్‌లో హుస్సేన్సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2.8 కి.మీ. ట్రాక్లో మొదటి ఫార్ములాఈ కార్ల పోటీ జరిగింది. సీజన్9 ఫార్ములాఈ రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చయింది. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థలైన గ్రీన్‌కో రూ.150కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30 కోట్లు ఖర్చుచేసిన విషయం తెలిసిందే.ఈ కుంభకోణంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో పాటు అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్ఎండిఎ కమిషనర్ అరవింద్ కుమార్‌లు అవినీతికి పాల్పడినట్లు సమాచారం.

## పంథా మారిన ఉగ్రవాదం

(మొదటి పేజీ తరువాయి)

స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతనికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయని వారు తేల్చారు. ఉగ్రవాద కేసులో ఇతగాడు 2021లో అరెస్టు అయినట్లు కూడా తేలింది.

**గతంలో స్వయంగా విధ్వంసం**

ఉగ్రవాదులు దేశంలోని ప్రధాన నగరాల్లో విధ్వంసం సృష్టించాలంటే.. ముందుగా స్థానిక యువకులను ఉగ్రవాద సంస్థలోకి రిక్రూట్‌మెంట్ చేసుకోవడం, వారికి బాంబు తయారీ, పేల్చడంలో శిక్షణ ఇవ్వడం, ఆ తరువాత వారికి టార్గెట్ ఇవ్వడం, నెల రోజుల పాటు స్థానికంగా మకాం వేయ డం, రెక్కీ నిర్వహించడం, ఆ తరువాత జన సమ్మర్ధ ప్రాంతాల్లో బాంబు లు పేల్చడం చేసేవారు. ఇలా చేయడం ద్వారా కొంత మంది మృత్యువాత పడడంతో పాటు ఆస్థి నష్టం సంభవించేది. ఒక్క ఆపరేషన్ విజయవంతం కావాలంటే ఉగ్రవాదులు ఆరు నెలలుగా ఆయప్రాయసాలకు గురికావాల్సి వచ్చేది. వారికి ఖర్చులు కూడా పెరిగేవి. మధ్యలో ఎక్కడైనా పోలీసులకు దొరికితే వారి ఆపరేషన్ ఫేయిల్ అయ్యేది. దీనికి ప్రత్యామ్నాయంగా సులువైన మార్గాలను ఉగ్రవాదులు ఎంచుకున్నట్లు తెలుస్తుంది.

**ఒక్కరూపాయితో రూ.కోట్లలో నష్టం**

ఉగ్రవాదులు ఒక్కరూపాయి ఖర్చుతో రూ.కోట్లలో భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారు. విమానంలో బాంబులు ఉన్నాయంటూ ఒక్కఫోన్ కాల్‌తో ఆయా విమానాయాశ్రయాలకు బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. దీంతో ఆయా సంస్థలు, పోలీసులు, ఇతర విభాగాల అధికారులందరు ఆగమేగాలపై రంగంలోకి దిగి ఆ విమానాన్ని ఆపివేయడం క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత ఊపిరిపీల్చుకోవడం తంతుగా మారిపోయింది. ఈ లోపు విమానాయ సంస్థలకు కోట్లలో నష్టాలు వస్తున్నాయి.ఈ ఆపరేషన్ వారికి అత్యంత సులువైన మార్గంగా మారింది. ఇలాంటి కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయరని వారి భావన. అంతేకాకుండా ఇలాంటి చర్యలకు పాల్పడం ఉగ్రవాద యువతకు చాలా సులువైన మార్గం. ఎక్కడో అక్కడ దారిన పోయే దానయ్య ఫోన్ తీసుకుని కూడా విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులకు పాల్పడవచ్చు. దర్యాప్తు చేసినా దొరికే ప్రసక్తే లేకుండా చూసుకుంటున్నారు.

**కొనసాగుతున్న బెదిరింపుల పర్వం**

బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. విమానాలు పేలుస్తామని, స్కూళ్లకు బాం బులు అమర్చామని గుర్తుతెలియని దుండగులు తరచూ ఫోన్లు చేసి భయోత్పాతం సృష్టిస్తున్నారు. భారత్‌కు చెందిన విమానాలకు వరుస బాంబు బెదిరింపులు ప్రజల్లో ఆందోళన సష్టిస్తున్నాయి. విమానయాన సంస్థలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా... ఇవి ఆగడం లేదు. మంగళవారం మరో 10 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లుగా ఇండిగో ఎయిర్లైన్స్ అధికారులు వెల్లడించారు. దేశీయ సర్వీసులే కాకుండా జెడ్డా, ఇస్తాం బుల్, రియాద్ లాంటి అంతర్జాతీయ సర్వీసులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ వారంలో ఇండిగో ఎయిర్లైన్సు మొత్తం 100కు పైగా హెచ్చరికలు వచ్చాయని తెలిపారు. 'జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ అంతర్జా తీయ మార్గాల్లో ప్రయాణించే విమానాలకు మంగళవారం బాంబు బెదిరింపులు రావడంతో మా సిబ్బంది వెంటనే అప్రమ త్తమయ్యారు. ప్రయాణికులను తరలించి... తనిఖీలు నిర్వహి స్తున్నాం'' అని ఇండిగో ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపులు దేశవ్యాప్తంగా ఉన్న సిఆర్‌పిఎఫ్ పాఠశాలలకు సైతం బాంబు బెదిరింపులు వచ్చాయి. కేవలం భయపెట్టేందుకే కొందరు నకిలీ ఇమెయిల్ పంపి ఉండొచ్చని పోలీసులు అను మానిస్తున్నారు. కొన్ని పాఠశాలల గదుల్లో పేలుడు పదార్థాలు ఉంచామని, ఉదయం 11 గంటల్లోపు అన్ని స్కూళ్లను ఖాళీ చేయాలని దుండగులు హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. కొద్దిరోజులుగా విమానయాన సంస్థలకు ఈ బూటకపు సందేశాలు ఎక్కువ య్యాయి. దాంతో విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడు తోంది. ఇటు ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. విమా నయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. బెదిరింపు కాల్స్‌కు పాల్పడేవారిని నోఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలు సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుది. బెదిరింపు కాల్స్ పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నారు.

**అధికారులతో కేంద్ర హోం సెక్రటరీ సమీక్ష**

ఈ బాంబు బెదిరింపులపై కేంద్ర హోంశాఖ ఇటీవలే అత్యవసరమైన కీలక సమావేశం నిర్వహించింది. సిఐఎస్ఎఫ్, డిజిసిఎ ఉన్నతాధికారులతో హోం సెక్రటరీ గోవింద్‌మోహన్ సమావేశమయ్యారు.బాంబు బెదిరింపుల పురోగతిని సమీక్షించారు.బెదిరింపు కాల్స్ చాలా వరకు విదేశాల నుంచి వ చ్చినట్లు అధికారులు ఆయనకు తెలియజేశారు. నవంబర్ ఒకటి నుంచి 19 వరకు ఎయిర్ ఇండియాలో ప్రయాణించవద్దని సిక్కు ఉగ్రవాద సంస్థ కలిస్థాన్ నాయకుడు పన్ను ప్రయాణికులను హెచ్చరిస్తూ వీడియో సందేశం విడుదల చేయడంపై అధికారులతో గోవింద్‌మోహన్ చర్చించారు.

## ఫీజులపై సర్కారు నిర్లక్ష్యం- కళాశాలల కఠినత్వం

### అయోమయంలో విద్యార్థిలోకం
### నిరసన దీక్షలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థుల పట్ల వివక్షత చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని..రాష్ట్రంలో కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలను విడుదల చేస్తామన్న హామీని నేడు అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విస్మరిస్తూ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేశారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర ప్రభుత్వం చేస్తుందని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిపు లను తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వం పై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని స్థానిక సత్యనారాయణ రెడ్డి భవన్ నందు ఎఐఎస్ఎఫ్ నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి ,పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర విద్యార్థులు రోడ్డెక్కి ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని ,సిఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న విద్యార్థులకు ఉపయోగం లేదని, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడే ఉన్నతవిద్య అభ్యసిస్తారని కానీ వారికి ఫీజు బకాయిల విడుదల లేక సర్టిఫికెట్ల కోసం పడుతున్నారు. నాన్ ప్రొఫెషనల్ విద్యార్థులకు 2000 కోట్లు, ప్రొఫెషనల్ విద్యార్థులకు 4000 కోట్లు గాను పెండింగ్ ఉపకార వేతనాలు ఉన్నాయని,2021 22 ప్రభుత్వం విడుదల చేసిన బకాయలు 30% 2022 23 గాను 20%, 2023 24 గాను



100/ శాతం బకాయిలు పెండింగ్ లో ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా నిరవధిక బంద్ నిర్వహించాయి.ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని వారు విమర్శించారు. 20242025 విద్యా సంవత్సరం గాను ఇప్పటివరకు స్కాలర్షిప్ ఈపాస్ ఆన్లైన్ డేట్ ప్రభుత్వం ఇవ్వలేదు కానీ బీసీ స్కాలర్షిప్స్ 1500 కోట్లు రిలీజ్ చేస్తున్నామని చెప్పిందన్నారు.స్కాలర్షిప్స్ ఆన్లైన్ డేట్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసిన 1500 కోట్ల బీసీ స్కాలర్షిప్స్ ఉపకార వేతనాలు ఏమయ్యాని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గారు 10 నెలల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్తున్నారు మరి అందులో విద్యార్థుల చదువులకు 8000 కోట్లు విడుదల చేయడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని, తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రులు, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించడానికి కూడా సంసిద్ధం అవుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటిక్యాల రామకృష్ణ, బానోత్ రఘురాం, గ్యార నరేష్,గ్యార క్రాంతి, లెనిన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంశీవర్ధన్ రెడ్డి, చైతన్య, అన్వర్, అంజి, రామారపు వెంకటేష్, శరత్,శ్రావణ్,పార్వతి, శాంతి కుమార్, ప్రేమ్ కుమార్,రవి తేజ,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యబీమా'

(మొదటి పేజీ తరువాయి)

సంరక్షణను మరింతగా ప్రజల దరికి చేర్చేందుకు ఒక సరికొత్త నవకల్పనల సమ్మిళిత ఉపయోగంతో డ్రోన్ టెక్నాలజీ సర్వీస్ డెలివరీ కూడా ఈ సందర్భంగా ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి మోదీ 11ప్రాదేశిక ఆరోగ్య రక్షణ సంస్థలలో డ్రోన్ సర్వీసులను ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించడంతో ఈ డ్రోన్ సేవలు ఉత్తరాఖండ్‌లోని రిషికేష్ ఎఐఐఎంఎస్(ఎయిమ్స్), తెలంగాణ రాష్ట్రంలోని బీబీనగర్ ఎయిమ్స్, అసోంలోని గువహతి ఎయిమ్స్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ఎయిమ్స్, రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ ఎయిమ్స్, బీహార్‌లోని పట్నా ఎయిమ్స్, హిమాచల్‌ప్రదేశ్‌లోని భిలాస్‌పూర్ ఎయిమ్స్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ ఎయిమ్స్, ఛత్తీస్‌ఘర్‌లోని రాయ్‌పూర్ ఎయిమ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి ఎయిమ్స్, మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని రిమ్స్‌లలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా ప్రధాని మెడికల్ కేర్ డెలీవరి మరింత వేగవంతంగా జరిగేందుకు ఎయిమ్స్‌రిషికేష్ నుంచి 'హెలీక్యాప్టర్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్' నుకూడా ప్రారంభించారు. గర్భిణులకు, శిశువులకు ప్రయోజనం కలిగించేందుకు 'యుడబ్ల్యుఐఎన్ (విన్)' పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ పథకం గర్భిణులు, పిల్లల (పుట్టుక నుంచి 16సంవత్సరాల వరకు) వ్యాధులను ముందస్తుగా నివారించేందుకు 12వ్యాక్సిన్లను సకాలంలో అందజేసి వారి జీవిత కాలాన్ని పొడిగించేందుకు దోహదపడనున్నది. వైద్య వృత్తిదారులు. హాస్పిటల్స్‌ను అనుసంధానిస్తూ ప్రధానమంత్రి యువిన్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ పోర్టల్ వీరికి సంబంధించిన డేటాబేస్‌ను కేంద్రీకృతం చేసేందుకు ఉపకరిస్తుంది. వీటితోపాటు ప్రధానమంత్రి మోదీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సియోని, నీముచ్, మాండ్సౌర్ వద్ద మూడు మెడికల్ కాలేజీలను కూడా ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ ఎయిమ్స్, పశ్చిమబెంగాల్‌లోని కళ్యాణి, బీహార్‌లోని పట్నా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్, అసోంలోని గువహతి, దేశరాజధాని న్యూఢిల్లీ తదితర ప్రాంతాలకు వసతులు, సేవల విస్తరణను ప్రారంభించారు. ఛత్తీస్‌ఘర్‌లోని బిలాస్‌పూర్ వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఒక సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను కూడా నరేంద్రమోదీ ప్రారంభించారు. అలాగే ఒడిషా రాష్ట్రంలోని బార్ఘర్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఇవేకాకుండా మధ్యప్రదేశ్‌లోని మాండ్సౌర్, రాజ్‌ఘర్, ఖాండ్వా, రాత్లమ్, శివ్‌పురి ప్రాంతాలలో 5నర్సింగ్ కళాశాలలకు శంకుస్థాపన చేశారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌళిక వసతుల సంస్థ కింద రాజస్థాన్, తమిళనాడు, మణిపూర్, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ వద్ద 21క్రిటికల్ కేర్ బ్లాక్స్‌కు కూడా శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా న్యూఢిల్లీ ఎయిమ్స్, హిమాచల్ ప్రదేశ్‌లోని భిలాస్‌పూర్ ఎయిమ్స్ వద్ద పలు సదుపాయాలను ఆయన విస్తరించారు. హెల్త్‌కేర్ రంగంలో మేక్ ఇన్ ఇండియాకు బలం చేకూరేలా హెల్త్‌కేర్ రంగంలో ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్‌సెంటివ్ (పిఎల్ఐ) పథకం కింద 5 మెడికల్ డివైసెస్, బల్క్ డ్రగ్స్ సంబంధింత 5 ప్రాజెక్ట్‌లను గుజరాత్‌లోని వాపి, తెలంగాణలోని హైదరాబాద్, కర్నాటకలోని బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద ప్రారంభించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com